Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com


Journalism first!



ముహూర్తం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం; తిథి: శుద్ధ తదియ (పూర్తి); నక్షత్రం: శతభిషం ఉ.10.11 వరకు, అనంతరం పూర్వాభాద్ర; అమృతకాలం: రా.తె.4.00 నుండి 5.45 వరకు; వర్జ్యం: సా.5.12 నుండి 6.57 వరకు; దుర్ముహూర్తం: ఉ.10.00 నుండి 10.48 వరకు, తదుపరి మ.2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: మ.1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు


సంపుటి: 64 • సంచిక: 24 • గురువారం 7 ఫిబ్రవరి 2019 • విజయవాడ * పేజీలు: 22 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad



ఐటీ ఫైలింగ్‌కు

పాన్‌తో ఆధార్ లింకేజీ తప్పదు!

• స్పష్టం చేసిన సుప్రీం 6



మండలి ఛైర్మన్‌గా

నేడు షరీఫ్ ప్రమాణం

• విశ్వాసపాత్రునికి తెదేపా అందలం 8



టీవీ నటి

ఝాన్సీ ఆత్మహత్య

• ప్రేమ వ్యవహారమే కారణం 3



ఇంటర్ విద్యార్థినిపై

ప్రేమోన్మాది ఘాతుకం

• కొబ్బరి బొండాం కత్తితో దాడి 3

నా జీవితాశయం

పేదల సంక్షేమం



• రాష్ట్రాన్ని కాపాడుకుంటున్నా
• పేదల కోసం సంపద సృష్టించా..
• తిరిగి వారి సంక్షేమానికే పంచుతా
• అన్నివర్గాలకూ సంపూర్ణ భరోసా కల్పిస్తా
• ముగ్గురు మోడీలదీ బూటకపు ఫ్రంట్
• గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ : ''నా జీవితాశయం ఒక్కటే.. పేదల సంక్షేమం కోసం పాటుపడడం.. వారి కళ్లల్లో ఆనందం చూడడమే నా లక్ష్యం.. అందుకోసం ఎంత దాకైనా వెళతాను.. నేను కష్టపడేది రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణం పెంచడం.. సంపద సృష్టించడం.. ఈ క్రమంలో ఎన్ని కష్టాలు, నష్టాలైనా ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యాను.. ఈ నాలుగేళ్లలో నన్ను అన్ని వర్గాల ప్రజలు ఎంతగానో ఆశీర్వదించారు.. దీవించారు.. అందుకే నాకు పేదలంటే అంత ఇష్టం.. వారి సంక్షేమానికి ఎన్ని కోట్లయినా ఖర్చు చేయడానికి, ఎంతటి త్యాగాన్నైనా చేయడానికి టీడీపీ ప్రభుత్వం వెనుకడుగు వేసే ప్రసక్తే లేదు.. సుపరిపాలన అందించేందుకు ఆటో డ్రైవర్ మాదిరిగా రాష్ట్ర ప్రజల్ని కాపాడుకునేందుకు సర్వ శక్తులు ఒడ్డుతున్నాను'' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై బుధవారం ముఖ్యమంత్రి శాసనసభలో గంటన్నర దాకా సుదీర్ఘంగా ప్రసంగించారు. మధ్యమధ్యలో మోడీ, జగన్, కేసీఆర్‌లకు చురకలు అంటించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి పెద్ద ఎత్తున శ్రీకారం చుట్టామన్నారు. రైతుల ఆత్మవిశ్వాసం పెంపొందేలా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 24వేల కోట్ల రుణ మాఫీ చేశామన్నారు. కేంద్రం రూ. 6వేలు ఇస్తానంటే తాము ఒక్కో రైతుకు ఒక లక్షా 50 వేల రూపాయలను రుణమాఫీ చేసి, అన్నదాతకు సంపూర్ణ భరోసా కల్పించామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో రైతులు నానా ఆగచాట్లకు గురయ్యారని, కరెంట్ కోసం పొలాల వద్ద పడుకుని, మృత్యువాత పడ్డారని, ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. కానీ టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులు నిరంతరం కరెంట్ ఇవ్వడంతోపాటు సాగునీరు ఇచ్చామని, పెద్ద ఎత్తున పంటలు పండిస్తూ గుండెల మీద

➪ 5వ పేజీలో...



₹3 పింఛన్ వేలు!

పెంచుకుంటూ వెళతానన్నజగన్

• పూర్తిగా రుణమాఫీ చేస్తా
• నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తా
• చంద్రబాబువన్నీ డ్రామాలు
• తిరుపతిలో వైఎస్ జగన్ ఎన్నికల శంఖారావం

తిరుపతి, ప్రభన్యూస్ బ్యూరో : చంద్రబాబు పాలన ఇక ముగిసింది... రానున్నది రామరాజ్యం... రాక్షస పాలనకు ప్రజలు చమరగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయి... నేను సీఎంగా వస్తున్నా, మీ కష్టాలు తీరుస్తా, మీ కన్నీళ్లు తుడుస్తా అంటూ రాష్ట్ర ప్రతిపక్ష నేత వైకాపా నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తిరుపతిలో బుధవారం జరిగిన ఎన్నికల శంఖారావం బహిరంగ సభలో అన్నారు. రేణిగుంట వద్ద ఓ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చిత్తూరు జిల్లా పోలింగ్ బూత్ సభ్యులు, కన్వీనర్ల బహిరంగ సభలో జగన్ ప్రసంగించారు. గంటన్నర పాటు ప్రసంగించిన జగన్ ప్రసంగానికి మంచి స్పందన

➪ 5వ పేజీలో...

జనసేనలోకి పెంటపాటి



• ఆర్థిక, పర్యావరణ వేత్తగా గుర్తింపు • పోలవరం నిర్వాసితుల కోసం పోరాటాలు • పవన్‌తో నడవడం గర్వకారణం: పుల్లారావు

కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి: ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, ఆర్థికవేత్త, పర్యావరణ వేత్త పెంటపాటి పుల్లారావు జనసేనలో చేరారు. బుధవారం పార్టీ హైదరాబాద్ కార్యాలయంలో పవన్ సమక్షంలో ఆయన జనసేన తీర్థం పుచ్చుకున్నారు. విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం చేసిన పుల్లారావు దేశంలో పర్యా వరణ పరిరక్షణ కోసం విశేష కృషి చేశారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలంటూ పోరాటాలు నిర్వహించారు. అడవుల పరిరక్షణ విధానాల్ని సూత్రీకరించారు. ఆయన భావజాలం, ఆలోచనలు, పవన్ కళ్యాణ్‌ను విపరీతంగా ఆకర్షించాయి. కొద్దిరోజుల క్రితమే ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు. బుధవారం పార్టీలో చేరిన పుల్లారావు మేధావులు, విద్యావేత్తలు మౌనం వీడి రాజకీయాల్లోకి రావాలంటూ పిలుపిచ్చారు. జనసేన ద్వారా మాత్రమే

➪ 3వ పేజీలో...

అప్పులతో సొంతిల్లా?!



• ప్రభుత్వ ప్రోత్సాహంతో నిర్మాణాలెలా సాధ్యం • ఇళ్ల స్థలాల కొనుగోళ్లకు రూ.3 వేల కోట్లు ఇవ్వాలి • పక్కా ఇళ్లు నిర్మించి రుణం ప్రభుత్వమే భరించాలి • అప్పుడే పేదలకు సొంతింటి కల సాకారం • ప్రజా సంఘాల సూచనలు

తమిళంలో దర్శకుడు చెలియన్ టూ లెట్ అనే సినిమాను తెరకెక్కించాడు. ఇందులో సంతోష్‌శ్రీరామ్, సుశీల, అధిరపాండిలక్ష్మిలు ప్రధానపాత్ర పోషించారు. ఈ చిత్రం ఇంకా విడుదలకాలేదు. కానీ ఈ ట్రైలర్ తమిళ జనాన్ని విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ చిత్రం చివర్లో హీరో సంతోష్‌శ్రీరామ్ కుమారుడు తన తండ్రిని మనకు మోటార్‌సైకిల్ ఉంది.. టివి ఉంది.. ఇల్లెందుకు లేదంటూ ప్రశ్నిస్తాడు. తమిళనాడులో అద్దెకొక ఇల్లు దొరకడం ఎంత కష్టమో ఈ చిత్రంలో విశదీకరించారు. దేశంలో ఇదింకా విడుదల కాకపోయినా ఇప్పటికే 83అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల్లో ప్రదర్శితమైంది. ఇప్పటికే 80చిత్రోత్సవాల్లో ఉత్తమ చిత్రంగా నామినేట్ అయింది. 26చిత్రోత్సవాల్లో ఉత్తమ చిత్రంగా అవార్డుల్ని దక్కించుకుంది. ఇది భారత్‌లో సొంతింటి ఆవశ్యకతకు అద్దంపడుతోంది. దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరికి ఇల్లుండాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నా అందుకు తగ్గ ప్రయత్నాల్ని నిజాయితీగా చేపట్టడంలేదు. ఇందుకు ఆంధ్రప్రదేశ్ బడ్జెట్‌లో ఇళ్ళ నిర్మాణ కేటాయింపులు అద్దంపడుతున్నాయి.

3 లో



5% కాపులకు రిజర్వేషన్లు

• అగ్రకులాల్లో మిగిలిన పేదలకు మరో 5 శాతం
• శాసన సభలో బిల్లు ఆమోదం

అమరావతి, ఆంధ్రప్రభ : విద్య, ఉద్యోగ రంగాల్లో ఆర్థికంగా వెనుకబడిన అగ్రకులాల వారికి కేంద్రం కల్పించిన పది శాతం రిజర్వేషన్లకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక బిల్లును బుధవారం శాసన సభలో ఆమోదించింది. మొత్తం పది శాతం రిజర్వేషన్లలో అయిదు శాతం రాష్ట్రంలోని కాపు కులస్తులకు కల్పిస్తూ బిల్లును ప్రవేశపెట్టింది. దీనిపై ఎటువంటి చర్చ జరగకుండానే శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. దీంతో ఆర్థికంగా వెనుకబడిన అగ్రకులాల్లోని వారికి కాపు కులస్తులకు పోను మిగిలిన అయిదు శాతం విద్యరంగంలో సీట్లు, ఆయా ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు లభిస్తాయి. గతంలో కాపుల రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం పంపింది. అయితే ఈ బిల్లుపై కేంద్రం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఈ ప్రక్రియలో ఎలాంటి ముందడుగు పడలేదు. ఇటీవల

➪ 8వ పేజీలో...





కడప గడప దాటేదెవరు?

రాయచోటి రాజెవరు?

- వైసీపీ, టీడీపీల నుంచి ఐదుగురు ఆశావహులు
- నిర్ణయాత్మక దిశగా ముస్లిం మైనార్టీలు



రాయచోటి నియోజకవర్గం లో 2019 సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి, ఎవరు రాయచోటి రారాజుగా నిలుస్తారోనన్న చర్చలు మొదలయ్యాయి. టీడీపీ నుంచి టికెట్ రేసులో మాజీ ఎమ్మెల్యే, రాయచోటి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేష్‌కుమార్ రెడ్డి ముందంజలో ఉండగా, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు కుమారుడు సుగవాసి ప్రసాద్‌బాబు టీడీపీ టికెట్ తనకు కేటాయించాలని అధినేతను కోరడం జరిగింది. ఇదిలా ఉంటే వైసీపీలో తన న్యాయం జరగలేదని, గతంలో పలుమార్లు టికెట్ ఇస్తామంటూ ఇవ్వకుండా పోతున్నారన్న కారణంతో మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి కూడా ఇటీవల టీడీపీ అధినేత చంద్ర బాబును కలిసి పార్టీలో చేరేందుకు సన్నా హాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే ద్వారకనాథరెడ్డి కూడా తనకు రాయచోటి నుంచి టీడీపీ టికెట్ కావాలని అడినట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. మరో వైపు వైసీపీ నుంచి గత మూడు సార్లు (ఒకసారి కాంగ్రెస్, రెండుసార్లు వైసీపీ) వరుసగా రాయచోటిలో విజయం సాధించిన సిట్టింగ్ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డికే టికెట్ ఇస్తారన్న ఊహాగానాలతో ఆయన ఇప్పటికే గ్రామాలలో పర్యటిస్తున్నారు. అయితే మరోవైపు మాజీ ఎమ్మెల్యే కుమారుడు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కూడా తనకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని, తన కుటుంబ నేపథ్యంతో పాటు తన వ్యక్తి ఇమేజ్‌తో వచ్చే ఓట్లతోఖచ్చితంగా గెలుస్తానన్న నమ్మకం ఉందని వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డిని అడిగినట్లు తెలుస్తోంది. జనసేన విషయానికి వస్తే జనసేన అధినేత పవన్‌కల్యాన్ ప్రకటించిన కొన్ని హామీలను ప్రజల్లోకి తీసుకెలుతూ పలువురు అభిమానులు, నాయకులను కలుపుకుని స్థానిక నాయకులు సతీష్‌రాయల్ కూడా ఆ పార్టీ నుంచి టికెట్ అడిగినట్లు తెలుస్తోంది. 2008లో నియోజకవర్గాల పునర్విభజనలో బాగంగా లక్కిరెడ్డిపల్లె నియోజకవర్గాన్ని రద్దు చేసి రాయచోటిలో కలపడంతో అప్పటి వరకు లక్కిరెడ్డిపల్లె నియోజకవర్గంలో పోటీ పడుతూవచ్చిన గడికోట, రెడ్డెప్పగారి (మాజీ మంత్రి రాజగోపాల్‌రెడ్డి) కుటుంబాలు ఇక్కడ పోటీపడుతూ వస్తున్నాయి. రాయచోటిలో గత మూడు ఎన్నికల్లోకూడా వరుస విజయాలు సాధించిన వైసీపీ నేత గడికోట శ్రీకాంత్ రెడ్డి మరో సారి విజయం సాధించే విధంగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. మరో వైపు సీఎం చంద్రబాబు ప్రకటించిన ఫించన్ల పెంపు, పసుపు కుంకుమ నగదుతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలతో టీడీపీ నాయకులు ప్రజల్లో ఉంటున్నారు. ప్రజలకు అవసరమైన ప్రతిపనిని చేస్తూ, గ్రామీణ,పట్టణ ప్రాంతాల అభివృద్దే లక్ష్యంగా ఆర్.రమేష్‌కుమార్ రెడ్డి పర్యటనలు చేస్తున్నారు. సుమారు 2లక్షల ఓట్లు ఉన్న రాయచోటి నియోజకవర్గంలో నిర్ణయాత్మకంగా 50వేలకు పైగా ముస్లింల ఓట్లు అత్యధికంగా ఉన్నాయి. వీరిదే నిర్ణయాత్మక శక్తిగా ఉంది.







కడప బరి మైనార్టీల గురి






జిల్లా కేంద్రమైన కడప నియోజ కవర్గం లో తెలుగుదేశం, వైసీపీలు ప్రతిష్టాత్మకంగా పోటీ పడుతున్నాయి. కడప నుండి ప్రస్తుత ఎమ్మెల్యే అంజద్‌బాష తిరిగి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేయనుండటంతో తెలుగుదేశం పార్టీ కూడా ఈసారి మైనార్టీ కార్డును బరిలోకి దించనుంది. మాజీ ఎమ్మెల్యే అహ్మదుల్లా తనయుడిని కడప నుండి దించేందు కు సిద్దమైంది 1952లో ఏర్పడ్డ కడప నియోజకవర్గం నుంచి మహామహులే పోటీ చేశారు. 1983 లో ఎన్‌టి రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించిన తర్వాత టీడీపీ కూడా పలుమార్లు గెలుపొందుతూ వచ్చింది. ఇప్పటి వరకు 8 సార్లు ఎన్నికలు జరిగితే 4 సార్లు టీడీపీ , 3 సార్లు కాంగ్రెస్ ఒకసారివైకాపా గెలిచింది. తెలుగుదేశంకు కడపలో పట్టుఉన్నప్పటికీ 2004 నుండి వరుసగా టీడీపీ ఓటమి పాలవుతూ వస్తోంది. 2014లో వైసీపీ అభ్యర్థిగా అంజద్‌బాష, టీడీపీ అభ్యర్థి దుర్గాప్రసాద్‌పై పోటీ చేసి గెలిచారు. 1994 నుంచి కడప నియోజకవర్గం పార్టీ ఏదైనా మైనార్టీలే గెలుస్తూ వస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఈసారి తెలుగుదేశం పార్టీ మైనార్టీని బరిలో దించేందుకు సిద్దమైంది. అయితే ఇప్పటికే వైసీపీ నుంచి కూడా మైనార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే అంజద్‌బాష బరిలో ఉన్నారు. అంజద్‌బాష అభివృద్ధి పరంగా చెప్పుకోదగ్గ పనులు చేయలేకపోయినా ప్రతిపక్షంలో ఉన్నందున దాన్ని పెద్దగా ప్రజలు తప్పు పట్టే పరిస్థితి కనిపించలేదు. ఇందుకు తోడు సౌమ్యుడిగా పేరు ఉండటంతో వైసీపీకి సరైన అభ్యర్థిగా ఆయనను పార్టీ శ్రేణులు గుర్తిస్తున్నాయి. ఇక టీడీపీ విషయానికి వస్తే మాజీ మంత్రి అహ్మదుల్లా, ఆయన తనయుడు అష్రఫ్ నెలరోజుల క్రితమే కాంగ్రెస్ నుంచి టీడీపీలో చేరారు. వీరిలో అష్రఫ్‌కు అసెంబ్లీ టిక్కెట్ ఇచ్చి బరిలో దించనుంది. ఇరు ప్రధాన పార్టీల నుంచి మైనార్టీలు బరిలో దిగునుండటంతో పోటీ గట్టిగా ఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయి. తెదేపా, వైసీపీలు మైనార్టీలు రంగంలోకి దింపితే జనసేన మైనార్టీయేత వ్యక్తిని బరిలో దింపేందుకు వ్యూహం ఉంది. బలమైన వ్యక్తిని బరిలో దించింతే కడపలో జనసేనకు కొంత ఆదరణ కనిపించే అవకాశం బాగా ఉంది.


జమ్మలమడుగులో 'ఆది' పత్యం ఎవరిదో?





ఇప్పుడు జమ్మలమడుగు నియోజకవర్గం రాష్ట్ర వ్యాప్తంగా ప్రాధాన్యం సంతరించుకుంది. 2004 నుంచి రెండు సార్లు కాంగ్రెస్ గెలిచింది. 2014 లో వైసీపీ నుంచి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి రామసుబ్బారెడ్డిపై గెలుపొంది ఆ తర్వాత టీడీపీలో చేరారు. జమ్మలమడుగు అసెంబ్లీ అభ్యర్థిత్వం వీరి మధ్య మళ్ళీ పోరుకు తావునిస్తోంది. ఇరువురు అసెంబ్లీ టిక్కెట్టే ఆశిస్తున్నారు. దీంతో తెలుగుదేశం అధిష్టానం ఒకరిని కడప పార్లమెంటు, ఒకరికి అసెంబ్లీకి ఒప్పించాలన్న ప్రయత్నం చేస్తోంది. 1983 నుంచి జరిగిన 8 ఎన్నికల్లో 5 సార్లు వరుసగా టీడీపీ గెలువగా, రెండుసార్లు కాంగ్రెస్, ఒక్కసారి వైసీపీ గెలిచింది. వైసీపీ మాత్రం ముందు నుంచి జమ్మలమడుగు వైఎస్ కుటుంబానికి సానుకూలంగా ఉంటూ వస్తోంది. ఆదినారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డిల మధ్య సఖ్యత కుదరకపోతే అది కూడ కలసివస్తుందన్న లెక్కలతోవుంది. ఆదినారాయణరెడ్డి బయటకు వెళ్ళాక మాజీ ఎంపీఅవినాష్‌రెడ్డి జమ్మలమడుగుపై దృష్టి సారించారు. మైసూరా రెడ్డిసోదరుడి కుమారుడు డాక్టర్ సుధీర్‌రెడ్డిని బరిలో దింపుతున్నారు. సుధీర్‌రెడ్డి కూడా జమ్మలమడుగు నియోజకవర్గ వాతావరణానికి సమర్థుడైన వారిగా వైసీపీ గుర్తించి టిక్కెట్ కట్టబెడుతోంది. జమ్మలమడుగుపై వైసీపీ ప్రత్యేక దృష్టి సారించడంతో వైసీపీ, టీడీపీలు హోరాహోరి పోటీ పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆదినారాయణరెడ్డి నియోజకవర్గంలో ఆదిపత్యం ఎవరిదో అన్నది రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. ఇక్కడ ఈ రెండు పార్టీలతో పాటు జనసేన, కాంగ్రెస్ పార్టీలు బరిలో దిగనున్నాయి.

కమలాపురం ఎవరి పరం?







సీనియర్ నాయకుడు రాయలసీమ ఉద్యమనేత డా.యం.వి.మైసూరరెడ్డి ఇక్కడి నుండి 3 సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1984 నుంచి ఇప్పటి వరకు 3 సార్లు టీడీపీ, 4 సార్లు కాంగ్రెస్, 2014లో వైసీపీ గెలుపొందింది. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పుత్తానరసింహారెడ్డిపై రవీంద్రనాథరెడ్డి గెలుపొందారు. గత ఎన్నికల్లో గెలుపొందిన రవీంద్రనాథరెడ్డే తిరిగి వైసీపీ అభ్యర్థిగా బరిలో దిగనుండగా, తెదేపాలో ఇప్పటి వరకు సీట్ల కేటాయింపుపై సఖ్యత కుదరలేదు. ఈ నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా వున్న జి.వీరశివారెడ్డి గత ఎన్నికల్లో టీడీపీలో చేరి ఈసారి టిక్కెట్ అడుగుతున్నారు. ఇక్కడి నుంచి నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా వున్న పుత్తా నరసింహారెడ్డి టిక్కెట్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు. వైసీపీ నుంచి జగన్ మేనమామే అయిన రవీంద్రనాథరెడ్డి మళ్ళీ పోటీ చేస్తుండటంతో వైఎస్ కుటుంబం ప్రభావం కూడా కనిపిస్తోంది. దీంతో తెలుగుదేశం పార్టీ కూడా నేతల మధ్య సఖ్యతతో బరిలో దిగాల్సివుంది. రవీంద్రనాథరెడ్డితో పాటు జగన్ చిన్నాన్న అయిన దుగ్గాయపల్లి మల్లికార్జునరెడ్డి ఆయనతో పాటు ప్రచారంలో దిగారు. నేతలు ఇద్దరూ ఇప్పటికే అన్ని మండలాల్లో ఒకమారు పర్యటించి వచ్చారు. వైసీపీ ప్రచారంలో ముందుంటే టీడీపీ ఇప్పటి వరకు టిక్కెట్ పోరు నుండి బయటపడలేదు. ఇలాంటి పరిస్థితి నెలకొన్న కమలాపురం ఎవరి పరమవుతుందో వేచి చూడాలి. ఇక్కడ కూడా ఇప్పటి వరకు జనసేన నేతలు కనిపించకపోయినా ఎన్నికల బరిలో మాత్రం దిగే అవకాశం కనిపిస్తోంది. విద్యావేత్త రాజోలి వీరారెడ్డి పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

సీమ కూడలి... ఎవరిది?

- మైదుకూరులో వైకాపా జోరు సాగేనా!








రాయలసీమ 4 జిల్లాలకు కేంద్ర బిందువుగా వున్న మైదుకూరు నియోజకవర్గంలో ఈసారి ఎన్నికల్లో ఎగిరే జెండా ఏ పార్టీది? దాదాపు గత 30 సంవత్సరాల నుండి మైదుకూరు రాజకీయాలలో డి.ఎల్. రవీంద్రారెడ్డి, శెట్టిపల్లె రఘురామిరెడ్డి నువ్వా, నేనా అనే తరహాలో పోటీ పడుతూ వచ్చారు. కాగా 2014 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో పతనం కావడంతో డి.ఎల్. ఎటూ తేల్చుకోలేక పరోక్షంగా టిడిపికి తన మద్దతు తెలిపారు. ఇక రఘురామిరెడ్డి టిడిపి నుండి వైసిపిలో చేరి వైసిపి నుండి 2014లో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైసిపి అభ్యర్థి రఘురామిరెడ్డి 2014 ఎన్నికల్లో పుట్టాపై స్వల్ప అధిక్యంతో విజయం సాధించారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి పార్టీ అధికారం చేపట్టడంతో అధికారపార్టీ నాయకుడైన పుట్టా సుధాకర్‌యాదవ్ ఈ నాలుగున్నర సంవత్సరాల కాలంలో నియోజకవర్గంలో అధికారంతో సంబంధం లేకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు. టిడిపి నుండి మైదుకూరులో బరిలో వుండేది పుట్టా సుధాకర్‌యాదవ్ అని మంత్రి ఆదినారాయణ రెడ్డి ఇటీవల మైదుకూరులో పాల్గొన్న ఓ సమావేశంలో తెలిపారు.

మరో వైపు సిట్టింగ్ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి విషయమై మైదుకూరు వైసిపి బరిలో వున్నది రఘురామిరెడ్డే అనే జగన్ పరోక్షంగా సంకేతాలిచ్చారు. ఈ నేపథ్యంలో డి.ఎల్. ఏ పార్టీ నుండి బరిలోకి దిగుతారనే విషయమై మైదుకూరులో ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ ముగ్గురు నేతలతో పాటూ ప్రస్తుతం మైదుకూరులో కాంగ్రెస్ పార్టీ తరపున 2014లో బరిలో వున్న న్యాయవాది కోటయ్య గారి మల్లిఖార్జునమూర్తి ప్రస్తుతం కూడా బరిలో దిగే అవకాశాలు వున్నాయి. కాగా ఈ నాలుగున్నర సంవత్సరకాలంలో ఈయన కూడా ప్రజలకు కాంగ్రెస్ పార్టీపై వున్న వ్యతిరేకతను కొద్దిలో కొద్దిగా తగ్గించే ప్రయత్నం చేశారు. జనసేన నుండి కేవలం కార్యకర్తలు పలు కార్యక్రమాలు చేస్తున్నారే కానీ, ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలిచే నాయకుని గురించి ఇంతవరకు ఎటువంటి సమాచారం లేదు. ఇక బిజేపి విషయంలోనూ ఇదే తరహాలో కార్యకర్తలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నా, నాయకుడు ఎవరనే విషయం తేటతెల్లమవడం లేదు.





ప్రముఖ వాణిజ్య కేంద్రంగా బంగారు వ్యాపారంలో రెండో ముంబయిగా ప్రాముఖ్యత సంతరించుకున్న ప్రొద్దుటూరుపై ఇరు పార్టీలు ప్రతిష్టాత్మకంగా దృష్టిసారించనున్నారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి వరుసగా ఐదు సార్లు విజయం సాధించిన ఘనత దక్కించుకున్నారు. ఈయన 2009, 2014 లో ఓటమిపాలయ్యారు. 2014లో వైసీపీ అభ్యర్థి రాచమల్లు ప్రసాదరెడ్డితో టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగిన ఆయన గెలుపు సొంతం చేసుకోలేకపోయారు. కాంగ్రెస్ నుంచి టీడీపీలోకి వెళ్ళడంతో ఆయన టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయడం జరిగింది. ఈ నియోజకవర్గంలో ఇప్పుడు వైసీపీ తిరిగిపాగా వేయాలని ప్రయత్నాలు చేస్తుండగా, టీడీపీ

పసిడిపురిపై ఎవరిది గురి?!



మాత్రం ఈ సారైనా ప్రొద్దుటూరులో పట్టుసాధించాలని దృష్టిపెట్టింది. అయితే తెలుగుదేశం పార్టీలో నెలకొన్న విభేదాలు అంతర్గత రాజకీయాలు అభ్యర్థిత్వంపై పోటీలు ఆ పార్టీకి తీవ్ర ప్రతికూలంగా మారే పరిస్థితులు ఎదురవుతున్నాయి. నంద్యాల వరదరాజులరెడ్డి మళ్ళీ టిక్కెట్ బరిలో ఉన్నారు. ఈయనతో పాటు మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి టిక్కెట్ ఆశిస్తున్నారు. వీరిద్దరూ టిక్కెట్ ఆశిస్తున్నా ఇక్కడ రాజ్యసభ్యుడు సీఎం రమేష్ ప్రభావం కూడా ఉంటుంది.ఈయన వీరిద్దరిలో ఎవరికీ సానుకూలంగా లేరన్న అభిప్రాయాలు ఉన్నాయి. ముఖ్యంగా వరదరాజులరెడ్డితో తీవ్రమైన విభేదాలు ఉన్నాయి. దీంతో ఈ ఎన్నికల్లో వారిద్దరిని కాదని మరోకరికి టిక్కెట్ ఇప్పించే అవకాశం ఉంటుందా అన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.ఒక దశలో సీఎం రమేష్‌కుటుంబం నుంచేఎవరైన బరిలో ఉండవచ్చన్న అభిప్రాయాలు వున్నాయి. తెలుగుదేశం పార్టీలో అతికష్టమైన పరిస్థితి ఈ నియోజకవర్గంలో నెలకొనివుంది. ఇదే తరుణంలో వైసీపీ మాత్రం ఏకనాయకత్వంతో ముందుకెళుతోంది. అక్కడ ఎమ్మెల్యే రాచమల్లుబరిలో దిగనున్నారు. తెలుగుదేశంలో వున్న విభేదాలు వైసీపీకి కలిసివచ్చే పరిణామాలు దారితీసే అవకాశం కూడా లేకపోలేదు.


తేదేపా కోటలో ఏదీ నాటి వైభవం?







రిజర్వుడు నియోజకవర్గమైన రైల్వేకోడూరు తెలుగుదేశం పార్టీకి జమ్మలమడుగుతో పాటు ఒకనాటి కంచుకోట. పార్టీ ఆవిర్భావం 1983 నుంచి 1999 వరకు ఐదు సార్లు వరుస విజయాలు తెలుగుదేశం పార్టీకి ఈ నియోజకవర్గం నుండి దక్కాయి. కాంగ్రెసేతర రాజకీయ పక్షాలే ఎక్కువసార్లు ఇక్కడ విజయం సాధించాయి. అయితే 2004 ఎన్నికల్లో సీను మారింది. అప్పటి నుంచి వరుసగా రెండు సార్లు కాంగ్రెస్, 2014లో వైసీపీ విజయం సాధించింది. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి కొరముట్ల శ్రీనివాసులు, టీడీపీ అభ్యర్థి వెంకట సుబ్బయ్యతో పోటీ చేసి గెలుపొందారు. ఇక్కడ ఈ నియోజకవర్గంలో కింగ్ మేకర్‌లదే పై చేయిగా ఉంటుంది. అందుకే ఒకసారి వున్న అభ్యర్థి మరోసారి బరిలో దిగడం చాలా అరుదుగా వుంటోంది. అయితే వైఎస్ రాజశేఖరరెడ్డికి, జగన్మోహన్‌రెడ్డికి దగ్గరగా వున్న కొరముట్ల కాంగ్రెస్ నుంచి వైసీపీ నుంచి వరుసగా పోటీ చేసి గెలుపొందుతూ వస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించాక ఐదు సార్లు వరుసగా టీడీపీ అభ్యర్థులు గెలుస్తూ రాగా, కొరముట్ల శ్రీనివాసులు రెండుసార్లు సాధారణ ఎన్నికల్లో ఓ మారు ఉప ఎన్నికల్లో విజయం సాధించారు. ఇక్కడ డిసిసి బ్యాంకు మాజీ చైర్మన్ దివంగత బ్రహ్మానందరెడ్డి ఆయన సోదరుడు కొల్లం గంగిరెడ్డిలు నియోజకవర్గంలో కొరముట్లకు పూర్తి సహకారం అందించేవారు అయితే ఇప్పుడు ఆ కుటుంబం రాజకీయంగా కొంత నష్టపోయింది. బ్రహ్మానందరెడ్డి చనిపోవడం గంగిరెడ్డి జైలుపాలుకావడంతో కోడూరు నియోజకవర్గంలో వైసీపీకి నేతల పరంగా పట్టుసడలినట్లయింది. దీంతో అక్కడ పార్టీపై వైసీపీ ప్రత్యేక గురి పెట్టాల్సిన పరిస్థితి వుండటంతో రాజంపేట మాజీ ఎంపీ మిథున్‌రెడ్డి ఆనియోజకవర్గంపై దృష్టి సారించారు. స్థానికంగా నాయకత్వ కొరత వున్న కోడూరుపై ఈసారి గట్టి ప్రయత్నంతో ముందుకెళ్ళి కంచుకోట పూర్వవైభవం తేవాలన్న సంకల్పంతో టీడీపీ ప్రయత్నాలు సాగిస్తోంది. అయితే టీడీపీలో నియోజకవర్గ ఇన్‌చార్జిగా విశ్వనాథనాయుడు, మాజీ ఎమ్మెల్సీ చెంగల్‌రాయుడు మధ్య ఇంకా సఖ్యత కుదరాల్సివుంది. చెంగల్‌రాయుడు మాజీ ఎమ్మెల్యే కోడలు అన్నపూర్ణమ్మ అనే మహిళకు టిక్కెట్ ఇప్పించుకునేందుకు ప్రయత్నిస్తుండగా, విశ్వనాథనాయుడు చిత్తూరు ఎంపీ శివప్రసాద్ మేనల్లుడు నరసింహాప్రసాద్‌కు టిక్కెట్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు.

అభ్యర్థి విషయంలో ఇద్దరూ ఒక్కటై ఎన్నికల్లో కలసి పనిచేస్తే కోడూరులో మళ్ళీ పూర్వవైభానికి అవకాశాలు లేకపోలేదు. అయితే ఆ పరిస్థితి ఏ మేరకు ఉంటుందన్నది సందేహంగా మారింది. ఇప్పటికే చెంగల్‌రాయుడికి పక్క నియోజకవర్గమైన రాజంపేట దేశం అభ్యర్థిగా ఖరారు చేసే పరిస్థితులు స్పష్టమయ్యాయి. దీంతో చెంగల్‌రాయుడు సూచిస్తున్న నరసింహ ప్రసాద్‌కే టిక్కెట్ రావచ్చన భావిస్తున్నారు. టిక్కెట్ ఎవరికైనా ఇద్దరు కలసి పనిచేస్తేనే కోడూరులో పూర్వవైభవం సాధ్యమవుతుంది. లేదంటే కొరముట్ల గెలుపుకు మరోసారి అవకాశం ఏర్పడుతుంది. ఇక్కడ కూడా జనసేన ప్రభావం బాగా కనిపిస్తోంది. సామాజికపరంగా కూడా ఇక్కడి పరిస్థితులు అనుకూలించనున్నాయి. బలమైన అభ్యర్థిని బరిలో దించింతే పార్టీకి సానుకూలం ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రాజంపేటకు అసెంబ్లీలో బండారు రత్నసభాపతి, పోతురాజు పార్థసారధి వంటి ప్రముఖులు ప్రాతినిధ్యం వహించారు. జిల్లాలో ఉక్కుమహిళగా పేరొందిన ప్రభావతమ్మ నాలుగుసార్లు పోటీ చేశారు. 1983 ఎన్‌టిఆర్ ప్రభంజనంలో జిల్లాలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో పాటు గెలుపొందిన ప్రభావతమ్మ అంతకుముందు రెండు సార్లు ఎమ్మెల్యేగా కూడా వున్నారు. ఈ నియోజకవర్గం జిల్లాలో ప్రాధాన్యం సంతరించు కుంది. 2014లో జరిగిన ఎన్నికల్లో తెదేపా అభ్యర్థిగా మేడా మల్లికార్జునరెడ్డి ఒకే ఒక్కడు జిల్లాలో ఇక్కడి నుండి విజయం సాధించారు. ఆయన అప్పట్లో వైసీపీ అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డిపై గెలుపొందారు. మల్లికార్జునరెడ్డి ఇప్పుడు వైసీపీలో చేరడంతో ఇప్పుడు ఆ ఇద్దరు ఒకే పార్టీ గొడుగుకిందకు వచ్చారు. దీంతో తెలుగుదేశం పార్టీ ఇప్పుడు అక్కడ కొత్త అభ్యర్థినిబరిలోకి దించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రాజంపేట... ఎవరి కోట?!



ఇందుకోసం సామాజికవర్గ నేపథ్యంలో బలిజ సామాజిక వర్గానికి చెందినమాజీ ఎమ్మెల్సీ చెంగల్‌రాయుడిని బరిలో దింపేందుకు సిద్దమైంది. అయితే ఇక్కడ రాజులు కూడా తమ సామాజిక వర్గానికి టిక్కెట్ ఇవ్వాలని కోరుతున్నారు. ఈ నియోజకవర్గానికి చెందిన వారికే టిక్కెట్ ఇవ్వాలని కోడూరు ప్రాంతానికి చెందిన వారికి టిక్కెట్ ఎలా ఇస్తారని అధిష్టానం దగ్గరవాదిస్తున్నారు. దేశంలో వున్న వర్గ భేదాలు పరిష్కరించకపోతే పెద్ద నష్టం కలిగించే పరిస్థితులు లేకపోలేదు. సామాజికపరంగా టీడీపీకి సానుకూలంగా ఉండే ఈ నియోజకవర్గంలో టీడీపీ వ్యూహాత్మాకంగా ముందుకెళ్ళే పరిస్థితి వుండటంతో రాజంపేట రాజకీయంగా రంజుగా మారనుంది. ఇక్కడ జనసేనకు కొంత సానుకూల పరిస్థితులు ఉంటాయి. సామాజికపరంగా రాజంపేట నియోజకవర్గంలో పవన్ సామాజిక వర్గం బాగా ఉంది. యువతలో కూడా పవన్ పట్ల ఆదరణ ఉండటంతో అక్కడ సమర్థవంతమైన నాయకులను బరిలో దింపితే జనసేన కు మంచి ఓటింగ్ రావడంతో పాటు టీడీపీకి నష్టం జరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

వైఎస్ కోట పులివెందుల!







జిల్లాలోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా పులివెందులకు రాజకీయంగా ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్ర రాజకీయ చిత్రంలో పులివెందులకు గుర్తింపు రావడానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ నియోజకవర్గానికి చెందిన వారు కావడం. అప్పుడు ఆయన ప్రతిపక్షనేతగా, ముఖ్యమంత్రి ఉండగా, ఇప్పుడు ఆయన తనయుడు ప్రతిపక్ష నేతగా ఇక్కడి నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 1955 నుంచి నియోజకవర్గంలో ఏర్పడ్డ పులివెందుల్లో 1978 నుంచి ఇప్పటి దాకా జరిగిన ఎన్నికల్లో వైఎస్ కుటుంబీకులే గెలుస్తూ వస్తున్నారు. 1983లో తెలుగుదేశం పార్టీ ఏర్పాటయ్యాక పులివెందుల మినహా అన్ని చోట్ల పలుసార్లు గెలుస్తూ వస్తోంది. అయితే పులివెందులలో మాత్రం ఇప్పటి వరకు బోణీ కాలేదు. 2014లో జగన్మోహన్‌రెడ్డి వైసీపీ అభ్యర్థి తెలుగుదేశం అభ్యర్థి సతీష్‌కుమార్‌రెడ్డితో పోటీ పడి గెలుపొందారు. ఈ నియోజకవర్గంలోవైఎస్ కుటుంబానికి ఎనలేని ఆదరణ కొనసాగుతూ వస్తోంది. వైఎస్ 1978 లో ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుంచి ఒక ఉప ఎన్నిక, 10 సార్లు సాధారణ ఎన్నికల్లో ఈ కుటుంబీకులే గెలుస్తూ వచ్చారు. రాజశేఖర్‌రెడ్డి 5 సార్లు ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగాకాగా, మరో ఆరు సార్లు ఆయన కుటుంబీకులే గెలుస్తూ వచ్చారు. ఈ సారి ఎన్నికల్లోనూ ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి ఈ నియోజకవర్గం నుంచే పోటీ చేయనున్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సతీష్‌రెడ్డి కూడా ఇక్కడి నుంచే పోటీ చేయనుండటంతో తిరిగి వీరిద్దరి మద్యే పోటీ జరిగే అవకాశముంది. ఈ సారి సతీష్‌రెడ్డి గట్టిగా సిద్దమవుతున్నారు. పులివెందుల ప్రాంతానికి కృష్ణాజలాలు ఇవ్వడం, రెండు మూడు ప్రాజెక్టులకు నీరు తీసుకరావడం లాంటి అభివృద్ధి పనులు పట్టుబట్టి సతీష్‌రెడ్డి చేయించారు. దీంతో పులివెందుల ప్రాంత ఓటర్లు తమకు సానుకూలంగా మారుతారన్న యోచనలో సతీష్‌రెడ్డి ఉన్నారు.

పరువు కోసం తెదేపా, పట్టుకోసం వైకాపా,..






బద్వేలు నియోజక వర్గం టీడీపీ ఆవిర్భావం నుంచి వీ రారెడ్డి మరణం వరకు పార్టీకి కంచుకోటగా ఉండేది. 2000వ సంవత్సరంలో వీరారెడ్డి మరణా నంత రంజరిగిన ఉప ఎన్నికలలో ఆయన కుమార్తె కొనిరెడ్డి విజయమ్మ దాదాపు20 వేల ఓట్ల మెజార్టీతోగెలుపొం దింది. 2004లో కాంగ్రెస్ పార్టీ గెలుపొం దగా, 2009 ఎన్నికల సమయానికి నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా ఎస్సీలకు కేటాయిం చారు. 1999 ఎన్నికల వరకు ప్రధాన ప్రత్యర్థులుగా టీడీపీ తరపున బిజివేముల వీరారెడ్డి , కాంగ్రెస్‌తరపున డాక్టర్ శివరామకృష్ణారావు బరిలో ఉండేవారు. వీరిద్దరు నియోజక వర్గంలో ప్రత్యేక వర్గాలను కొనసాగిస్తూ తమ ఆధిక్య తను నిలుపుకునేందుకు నిరం తరం ప్రజలలో ఉండేవారు. 2004 ఎన్నికలలో డీసీ.గోవిం దరెడ్డిని నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించారు. 2009 లో 2014లో జరిగిన ఎన్నికలలో వైసీపీ తన పట్టును కొనసాగించింది. 2014 ఎన్నికలలో నియోజక వర్గంలో వైసీపీ అభ్యర్థిగా జయరాములు ఎన్నికైనా అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో టీడీపీ గూటికి చేరారు. 2014 ఎన్నికల అనంతరం టీడీపీలో వర్గ విభేదాలు ప్రారంభమయ్యాయి. మూడు వర్గాలుగా విడిపోయింది. 2019 ఎన్నికలలో తాము గెలిచిన సీటును మరోసారి దక్కించుకుని నియోజక వర్గంలో తమ సత్తా చాటాలని ప్రస్తుత ఎమ్మెల్సీగా ఉన్న డి.సి.గోవిందరెడ్డి క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడం వైసీపీకి కలిసొచ్చే అంశంగా మారింది. అంతేకాకుండా రాబోయే ఎన్నికలలో తమ పార్టీ అభ్యర్థిగా డాక్ట ర్‌వెంకటసుబ్బయ్యను ప్రకటించింది. ఇందుకు భిన్నంగా టీడీపీలో ఇంత వరకు అభ్యర్థి ఎవరా అన్న విషయం స్పష్టం కాలేదు. 2019ఎన్నికలలో టీడీపీ అభ్యర్థిగా గతంలో ఓటమి చవిచూసిన విజయ జ్యోతి ,ప్రస్తుత ఎమ్మెల్యే జయ రాములు, కొత్త అభ్యర్థులుగా పారిశ్రామిక వేత్త ఎల్.లాజరస్, డాక్టర్ రాజశేఖర్, ముత్యాల పార్థసారథి, శీలం గంగన్నలు పోటీ పడుతున్నారు. నియోజక వర్గంలోటీడీపీలో ఉన్న అనైక్యతే వైసీపీకిబలంగా మారు తుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.



సంస్కరణలతోనే నిరంతర విద్యుత్

● సాఫ్ట్ స్కిల్స్ అభివృద్ధికి ఎనలేని కృషి ● లోటు విద్యుత్ నుండి మిగులు విద్యుత్‌కు ఎదిగాం
● పారిశ్రామిక విప్లవంతో ఉద్యోగాల విప్లవాన్ని తీసుకొచ్చాం ● ఐటీ వినియోగం ద్వారా సాంకేతికతలో కొత్తపుంతలు
● ఏపీ విద్యుత్ రంగాన్ని దేశంలోనే మిన్నగా చేస్తాం ● ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ : దేశంలో ఆంధ్రప్రదేశ్‌లో మొదటిసారిగా విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చి ఫలితాలను ప్రజలకు చేరవేయడంతో 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్‌ను అందించగలుగుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. బుధవారం విజయవాడలో జరిగిన అంతర్జాతీయ ఇంధన సదస్సు ముగింపు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వచ్చే ఏడాది నుండి అమరావతిలో ఉత్తమ సోలార్ నగరం పురస్కారాన్ని అదిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. 800 మంది డెలిగేట్స్, 80 మంది స్పీకర్లు, 40 సంస్థల ప్రతినిధులు, 21 దేశాల నుండి ముఖ్యంగా జపాన్, యూకే, స్పెయిన్, పోలాండ్ వంటి దేశాల నుండి డెలిగేట్స్ హాజరయ్యారని తెలిపారు. ఏదేశమైనా, రాష్ట్రం అయినా, ప్రజలైనా అభివృద్ధి సాధించాలంటే ఇన్నోవేషన్ అనేది తప్పక జరగాలన్నారు. ఊబరైజేషన్‌తో పంచాతీలలో చెత్త సేకరణ చేసి రైతులకు ఎరువుగా మార్చి తిరిగి అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి మంచి అవకాశాలు ఉన్నాయని, ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తుందని చెప్పారు. కరెప్షన్ ఫ్రీ సొసైటీగా, నివాసోగ్యమైన ప్రాంతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయంలో రాష్ట్రం ప్రపంచంలోనే ఎంతో ముందుందని చెప్పారు. ఈ ఉత్పత్తులను వాడటం వల్ల ప్రజలకు ఆరోగ్యపరంగా మేలు చేస్తుందన్నారు. అభివృద్ధిలో ఐటీ పరిశ్రమ చాలా కీలకమని, ఐఓటీతో ఏదైనా సాధ్యమేనన్నారు. ఆంధ్రప్రదేశ్ కూడాసమాచార సాంకేతిక రంగాలకు కేంద్రంగా ఉందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. భవిష్యత్తులో కూడా ఈ స్థానాన్ని నిలబెట్టుకోవడంతో పాటు డిస్టెన్స్ నెంబర్ వన్‌గా నిలిచే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్, దేశంలో తొలిసారిగా 1997-98వ సంవత్సరంలో విద్యుత్ రంగంలో సంస్కరణలు ప్రారంభించిదని, అది తానే నని గర్వగా చెబుతున్నానన్నారు. విభజన సమంలో 25 మిలియన్ యూనిట్ల లోటులో ఉన్న విద్యుత్ ఉత్పత్తిని తర్వాత నాలుగున్నరేళ్లలోనే మిగులు విద్యుత్ రాష్ట్రంగా నిలిపామన్నారు. విద్యుత్ సరఫరాలో నష్టాన్ని గణనీయంగా తగ్గించామని, వచ్చే నాలుగేళ్లలో ప్రభుత్వ వాహనాలను విద్యుత్ వాహనాలుగా మారుస్తామన్నారు. అజయ్ జైన్, విజయానంద్ ఇద్దరూ విద్యుత్‌రంగలో అపార అనుభవం ఉన్నవారని కొనియాడారు. 2019 మార్చి చివరి నాటికి అన్ని గ్రామాల్లో ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. నూతన సాంకేతిక విధానంలో స్కానర్లు ఏర్పాటు చేయడం ద్వారా ఎక్కడా ఏ దీపం వెలగడం లేదో నిమిషాల్లో తెలుస్తుందన్నారు. 15 వేల అగ్రికల్చర్ పంపుసెట్లను రీప్లేస్ చేసి అధునాతన విద్యుత్ తక్కువ ఖర్చయ్యే పంపుసెట్లు అందిస్తున్నామన్నారు. ట్రాన్స్‌మిషన్ లాసెస్‌ను తగ్గించగలిగా మన్నారు. కార్బన్ న్యూట్రల్ సిటీగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామన్నారు. ఆదాని గ్రూప్ సోలార్ ఉత్పత్తికి ముందుకు రావడం అభినందనీయ మన్నారు. ఇప్పటికే మొదటి అగ్రిటెక్ సదస్సు 2017 నవంబరులో విశాఖలో, రెండవ సదస్సును 2018 ఏప్రిల్‌లో హ్యాపీ సమ్మిట్‌ను గుంటూరు జిల్లా మంగళగిరి, మూడో సదస్సు 2019 ఫిబ్రవరి 6న ఏపీ ఎనర్జీ ఇన్నోవేషన్ సమ్మిట్‌ను నిర్వహించామన్నారు. రాష్ట్రంలో సోలార్, పవన విద్యుత్తు ఉత్పత్తి శాతం పెంచే విధంగా అనేక కార్యక్రమాలు తీసుకుంటున్నామన్నారు. దీనికి సంబంధించి అనేక సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రానికి రానున్నాయన్నారు. ప్రపంచలంలో నలుగురు ఐటీ ప్రొఫెషనల్స్‌లో ఇండియా నుండి ఒకరు ఉంటున్నారని, ఇండియాలో నలుగురు ప్రొఫెషనల్స్‌లో ఏపీ నుండి ఒకరు ఉంటున్నారని, అది ఏపీ ఘనతఅని చెప్పారు. ఏపీలో ఐటీ రంగాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవడం ద్వారా సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతుందని తెలిపారు. మౌలిక వసతుల శాఖ ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ, ఏపీ సృజనాత్మకతకు పుట్టినిల్లు అని అన్నారు విభజన తరువాత రాజదాని ఎక్కడ పెట్టాలో కూడా తెలియని పరిస్థితి నుండి ఈరోజు ఒక స్థాయికి చేరుకున్నామన్నారు. లోటు బడ్జెట్‌తో ప్రభుత్వ కార్యకలాపాలు ప్రారంభించామన్నారు. రాజధాని నిర్మాణానికి నిధులు కాదు ఒక మంచి ఆలోచన కావాలని ముఖ్యమంత్రి ప్రోత్సహించారని చెప్పారు. ఆ ఆలోచనే ల్యాండ్ పూలింగ్ ద్వారా 35 వేల ఎకరాల భూమి రాజధానికోసం సేకరించామన్నారు. సంక్షోభం ఎదురైన ప్రతిసారి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంచి ఆలోచనలతో ముందుకెళ్తూ అనేక విషయాల్లో అభివృద్ధిని సాధిస్తున్నారన్నారు. ఏపీఈఆర్సీ ఛైర్మన్ జస్టిస్ జీ భవానీ ప్రసాద్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే ఒక శక్తి అన్నారు. ఆయనకు అంత శక్తి ఎక్కడి నుండి వస్తుందో అర్థంకాదని రాష్ట్రం కోసం అహర్నిశలు పనిచేస్తున్నారన్నారు. తాను కడా ఆయన సమకాలికుడునేనని అయినా ఆయనతో పనిలో పోటీ పడలేనన్నారు. రెండు రోజుల పాటు ఇక్కడ కూర్చొనేందుకే తనకు కొంచెం నీరసంగా అనిపించిందన్నారు. ముఖ్యమంత్రి నిరంతరాయంగా పనిచేస్తూనే ఉంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, నెడ్ క్యాప్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఇంధన సదస్సు జరిగింది. ఈ సదస్సులో 200పైగా విద్యుత్ ఉత్పత్తి, పరికరాల తయారీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా, నామమాత్రంగా నష్టాలు, గ్రీన్ ఎనర్జీ విధానం అమలుపై రెండు రోజుల పాటు సదస్సులో చర్చించారు. 1366 టెక్నాలజీ సంస్థ విజేతగా నిలిచింది. చక్ర ఇన్నోవేటివ్ టెక్నాలజీస్ సంస్థ మొదటి రన్నరప్‌గా నిలచింది. రెండవ రన్నరప్‌గా స్కై లాన్సర్ టెక్నాలజీ సంస్థ నిలిచింది. భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచమని చెబుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నెడ్ క్యాప్ ఆధ్వర్యంలో రూపొందించిన అక్షర శక్తి జర్నల్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. 1366 టెక్నాలజీస్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకుంది. ఎనర్జీ ఇన్నోవేషన్ సమ్మిట్ కార్యక్రమంలో నెడ్ క్యాప్ వీసీ మరియు ఎండీ ఎం కమలాకర్ బాబు ముఖ్యమంత్రి చంద్రబాబుకు మెమెంటో అందించారు. రెండు రోజుల సమ్మిట్‌లో వివిధ సంస్థల ప్రతినిధులు, డెలిగేట్స్ తదితర అధికారులు పాల్గొన్నారు.



జనసేనలోకి పెంటపాటి

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయాల్లో కొత్త రక్తం ఎక్కుతుందన్నారు. చీడపట్టిన రాజకీయ వ్యవస్థను జనసేన ద్వారా మార్చాలని సూచించారు. ఒకప్పుడు వామపక్షాలు మాత్రమే నిబద్ధతతో కూడిన పోరాటాలు చేసేవన్నారు. ఇప్పుడు ఆ బాధ్యతను కూడా జనసేనే చేపట్టిందన్నారు. పవన్ వెంట నడవడం గర్వంగా భావిస్తున్నానన్నారు.

పిఎసి సభ్యునిగా పుల్లారావు

జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యునిగా పుల్లారావును నియమిస్తున్నట్లు పవన్ ప్రకటించారు. ఇందుకు పుల్లారావు తన సమ్మతి వ్యక్తం చేశారు. రాజకీయాల్లో డబ్బు ప్రభావాన్ని రూపుమాపడమే తమ లక్ష్యంగా చెప్పారు. తెలుగు ప్రజలకు సరికొత్త రాజకీయాల్ని పరిచయం చేస్తామన్నారు. రాజకీయాలు కొందరికే పరిమితం కాదన్నారు. మేధావులు రాజకీయాల్లో భాగస్వాములు కావాలన్నారు. పవన్ తపన తనను విపరీతంగా ఆకర్షించిందన్నారు. దేశంలో ఎన్నో రాజకీయ పార్టీలు, నాయకులున్నా పవన్ వారందరికీ భిన్నమని చెప్పారు. కోట్లాదిమంది అభిమానులున్న పవన్ స్వయంగా తనను పార్టీలోకి ఆహ్వానించిన విధానం ఆకట్టుకుందన్నారు.

టీవీ నటి ఝాన్సీ ఆత్మహత్య

ప్రేమ వ్యవహారమే కారణం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వర్ధమాన టీవీ నటి ఝాన్సీ ఆత్మహత్య కలకలం రేపుతోంది. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్‌వీఆర్ కనస్ట్రక్షన్స్ సాయి రామ్ రెసిడెన్సీలోని తన ఫ్లాట్ నెం.401లో మంగళ వారం రాత్రి ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఝాన్సీ ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. విజయవాడకు చెందిన సూర్య అలియాస్ నానితో ఝాన్సీ ప్రేమ వ్యవహారం నడిపిందని, దీంతో గత ఆరు నెలలుగా సీరియల్ షూటింగ్‌లకు కూడా ఝాన్సీ వెళ్లడం లేదు. ఝాన్సీ స్వస్థలం కృష్ణాజిల్లా ముదినేపల్లి మండలం వడాలి గ్రామం. ఆమె బ్యూటీ పార్లర్ కూడా నిర్వహిస్తోంది. మధు అనే తోటి నటి సూర్య అలియాస్ నానిని ఝాన్సీకి పరిచయం చేసిందని తెలుస్తోంది. సోదరుడు దుర్గా ప్రసాద్, తల్లి అన్నపూర్ణలతో కలిసి ఝాన్సీ ఉంటోంది. సోదరుడు దుర్గా ప్రసాద్ డ్యూటీకి వెళ్లి తిరిగి మంగళ వారం రాత్రి 9 గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. ఝాన్సీ తలుపులు తెరవ కపోవడంతో చుట్టు పక్కల వారి సాయంతో తలుపులు బద్దలు గొట్టి లోనికి ప్రవేశించాడు. అప్పటికే ఆమె ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందింది. ఘటనపై ఝాన్సీ సోదరుడు దుర్గాప్రసాద్ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యా దునందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. ఘటనాస్థలిలో ఉన్న ఆమె సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆత్మహత్యకు ముందు ఆమె సూర్య అలియాస్ నానితో ఛాటింగ్ చేసి నట్లు పోలీసులు గుర్తించారు. ఝాన్సీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. సూర్య అలియాస్ నాని మాయమాటలతో ఝాన్సీని నమ్మించాడని తెలుస్తోంది. పెళ్లి చేసుకోమని ఝాన్సీ తల్లిదండ్రులు కోరడంతో అందుకు నిరాకరించాడని సమాచారం.

సూర్యకు, ఝాన్సీలు పలుమార్లు వాగ్వాదాలకు దిగారని, తాము ఉన్న సమయంలో సూర్య ఇంటికి వచ్చి ఝాన్సీపై చేయి చేసుకున్నాడని సైతం ఆమె కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. సూర్య పెళ్లి చేసుకోవడానికి నిరాకరించడంతో ఝాన్సీ పూర్తిస్థాయిలో డిప్రెషన్‌లోకి వెళ్లిందని, ఈ క్రమంలో ఇక తనకు చావే శరణ్యమని భావించి ఆత్మహత్యకు పాల్పడింది. కాగా, ఈ నెల 22న తమ ఊరిలో గృహ ప్రవేశం ఉందని, మొన్ననే ఝాన్సీ ఇక్కడికి వచ్చిందని ఝాన్సీ తల్లి అన్నపూర్ణ తెలిపింది. 22న గృహప్రవేశం ఉన్న సమయంలో ఈ విధంగా ఝాన్సీ ఆత్మ హత్యకు పాల్పడిందని ఆమె కన్నీరు మున్నీరుగా విలపించారు. తన కుమార్తె మృతికి కారణమైన సూర్యపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కాగా, ఝాన్సీ మాటీవీ పవిత్ర బంధం సీరియల్‌లో నటించింది. కాగా, సూర్య అలియాస్ నానితో పీకల్లోతూ ప్రేమలో మునిగిన ఝాన్సీ అతడితో సహజీవనం చేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఆత్మహత్యకు ముందు ఝాన్సీ సెల్ఫీవీడియో తీసిందని, ఆ వీడి యోలో తన ఆత్మహత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించినట్లు సమా చారం. అయితే ఈ వీడియో విషయంలో పోలీసులు గోప్యత పాటిస్తూనే కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెబుతున్నారు.



అశోక్‌బాబుకు ఎమ్మెల్సీగా అవకాశమిస్తా

● మోడీ, కేసీఆర్, జగన్‌లు ఒక్కటే... ● ఎన్నికల్లోపు ఉద్యోగస్తులకు చేయాల్సినవన్నీ చేస్తాం ● అశోక్‌బాబు ఆత్మీయ వీడ్కోలు సభలో సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం, ఉద్యోగులు కలిసి పనిచేయాలని, సమైకాంధ్ర ఉద్యమంలో ఉద్యోగులు పోరాడిన తీరు ప్రశంసనీయమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం విజయవాడలో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఏపీ ఎన్జీవో మాజీ అధ్యక్షుడు అశోక్ బాబు ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 54శాతం ఆదాయం ఉన్న తెలంగాణాకు ఇచ్చారని, 46శాతం ఆదాయంతో అమరావతికి వచ్చామని, తెలంగాణా ఉద్యోగులతో సమానంగా ఏపీ ఉద్యోగులకు 43శాతం ఫిట్‌మెంట్ ఇచ్చామని, కేంద్ర వద్దన్నా ఉద్యోగులకు ఐఆర్ ఇచ్చామన్నారు. జాతీయ, అంతర్జాతీయంగా 670 అవార్డులు ఏపీకి వచ్చాయంటే ఇంతా ఉద్యోగుల కృషేనని, కేంద్రం అన్ని విధాల సహకరించి ఉంటే ఏపీ అభివృద్ధి ఇంకోలా వుండేదన్నారు. ప్రభుత్వం, ఉద్యోగులు కష్టపడితే ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు పెంచవచ్చని, రాబోయే ఎన్నికలకు తమకు మద్దతుగా ఉంటారని ఆశిస్తున్నానన్నారు. ఉద్యోగస్తులకు ప్రజలకు తెలంగాణ కంటే ఎక్కువ చేస్తున్నామని, ఎన్నికల్లోపు ఉద్యోగస్తులకు ఏమి చేయగలమో అన్ని చేస్తామన్నారు. ఖజానా ఖాళీ అవ్వడం ద్వారానే డ్వాక్రా మహిళలకు మూడు చెక్కులు ఇచ్చామన్న పరిస్థితిని ఉద్యోగులు అర్థం చేసుకోవాలన్నారు. కులాలు, మతాలు, ప్రాంతీయ విద్వేషాలతో కొంత మంది రెచ్చగొట్టాలని ప్రయత్నిస్తున్నారని, అందరూ సమైక్యంగా ఉండి వాటిని తిప్పికొట్టాలన్నారు. కేంద్రంపై పోరాడడానికే ఈ నెల 11న ఢిల్లీలో జరిగే ధర్నాలో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. అశోక్ బాబును ప్రజాసేవ చేయడానికి మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నానని, రాబోయే ఎన్నికల్లో అశోక్ బాబుకు ఎమ్మెల్సీగా అవకాశమిస్తామన్నారు. అనంతరం అశోక్ బాబు మాట్లాడుతూ 1996 లో టీడీపీ ఓటమికి ఉద్యోగస్తులే కారణమనే అపోహ ఉందని, 2014 లో టీడీపీ గెలుపుకు ఉద్యోగస్తులే కారణమన్నారు. చంద్రబాబు నాలుగున్నరేళ్లలో ఉద్యోగస్తుల కోసం ఇచ్చిన జీవోలతో ఒక పుస్తకం తయారు చేయవచ్చని, 2019 లో మళ్ళీ చంద్రబాబే అధికారంలోకి రావాలని, రాజకీయంగా ఉన్నత స్థాయిలో ఉండాలని మా ఉద్యోగులు కోరుకుంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనకు ఇచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని అశోక్ బాబు స్పష్టం చేశారు.

అప్పులతో సొంతిల్లా?!

● ప్రభుత్వ ప్రోత్సాహంతో నిర్మాణాలెలా సాధ్యం?
● ఇళ్ల స్థలాల కొనుగోళ్లకు రూ.3 వేల కోట్లు ఇవ్వాలి
● పక్కా ఇళ్లు నిర్మించి రుణం ప్రభుత్వమే భరించాలి
● అప్పుడే పేదలకు సొంతింటి కలసాకారం
● ప్రజా సంఘాల సూచనలు

(అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

ఎపి అసెంబ్లీలో ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో గృహనిర్మాణానికి 4079.10కోట్లు కేటాయించారు. అలాగే ఇళ్ళ స్థలాల నిమిత్తం భూముల కొనుగోలుకు 500కోట్లు ప్రతిపాదించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఒక్కరికి సొంతిల్లు కల్పించడం ద్వారా వారి సామాజిక హోదాను, పరపతిని పెంచుతామంటూ బడ్జెట్ సందర్భంగా ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. అయితే సొంత స్థలముండి ఇళ్ళ నిర్మాణానికి ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేసుకుంటే రాష్ట్రం తరపున లక్షన్నర, కేంద్రం నుంచి మరో లక్షన్నర మొత్తం 3లక్షలు మాత్రం చెల్లిస్తున్నారు. ఇది కూడా వస్తురూపంలో మాత్రమే ఇస్తున్నారు. ఊచలు, సిమెంట్ బస్తాలు, సిమెంట్ ఇటుకలతో పాటు ఇందులో 20శాతం మొత్తాన్ని కూలీల నిమిత్తం నగదు రూపంలో అందిస్తున్నారు. కానీ ఎక్కడా ఈ మూడు లక్షల్తో ఇళ్ళ నిర్మాణం పూర్తికాదు. కనీసం 20లక్షలుంటే తప్ప ఇంటిని నిర్మించుకోలేరు. కానీ ఆర్థికసాయం పేరిట ప్రభుత్వమిస్తున్న ప్రోత్సాహంతో ఇంటి నిర్మాణంలోకి దిగిన లబ్ధిదారుడు అప్పులపాలౌతున్నాడు. ఇక ప్రభుత్వ స్థలాలంటూ రాష్ట్రంలో ఎక్కడాలేవు. ఉన్న కొద్దిపాటి స్థలాలు కబ్జాలకు గురయ్యాయి. ఈ దశలో ప్రభుత్వం తన స్థలంలో ఇల్లు కట్టివ్వాలంటే తప్పనిసరిగా భూములు కొనుగోలు చేయాలి. నూతన భూసేకరణ చట్టానికగుణంగా భూముల విలువ అనూహ్యంగా పెరిగింది. కానీ ప్రభుత్వం ఇందుకోసం కేవలం ఐదొందల కోట్లు మాత్రమే కేటాయించింది.



ఈ మొత్తం ఇంటి స్థలాలకేమాత్రం సరిపోదు. తెలంగాణాలో ప్రభుత్వమే పక్కా ఇళ్ళు నిర్మించింది. తమ భాగస్వామ్యంతో పాటు బ్యాంకుల్నుంచి రుణం తీసుకుంది. పూర్తి చేసిన ఇళ్ళను లబ్ధిదార్లకు అందిస్తోంది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇళ్ళ స్థలాల కొనుగోలుకు కనీసం 3వేల కోట్లు కేటాయించాలి. ఆ స్థలాల్లో లబ్ధిదార్లకు బ్యాంక్ రుణసాయంతో పక్కా ఇల్లు నిర్మించి అందించాలి. రుణచెల్లింపు బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలి. అప్పుడే పేదలకు పక్కా ఇళ్లు అందుబాటులోకొస్తాయి. ప్రభుత్వం పేదరికాన్ని నిర్మూలిస్తామంటూ చేస్తున్న వాగ్దానాలు నెరవేరతాయి. పేదలు కూడా సొంతింటితో సామాజిక హోదా పొందగలుగుతారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున శాసనసభ్యులు భూముల కొనుగోలుకు ప్రతిపాదించిన మొత్తాన్ని పెంచాలంటూ పట్టుబట్టాల్సిన ఆవశ్యకతుందని ప్రజాసంఘాలు సూచిస్తున్నాయి. లేనిపక్షంలో ప్రతిపాదిత ఐదొందల కోట్లతో ఏ విధంగానూ ప్రభుత్వ ఆకాంక్షలు నెరవేరవు. పేదలకు సొంతింటి కల సాకారం కాదని సూచిస్తున్నారు.

ఇంటర్ విద్యార్థినిపై ప్రేమోన్మాది ఘాతుకం

కొబ్బరి బొండాం కత్తితో దాడి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రేమను నిరాకరించిందనే అక్కసుతో భాగ్యనగరంలోని కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సత్యానగర్‌లో భరత్ అనే ఓ ప్రేమోన్మాది ఘాతుకానికి పాల్పడ్డాడు. నడిరోడ్డుపై మధులిక అనే ఇంటర్ విద్యార్థిని కొబ్బరి బోండాల కత్తితో తెగనరికాడు. గత కొంతకాలంగా ప్రేమపేరుతో మధులికను డిగ్రీ చదివే భరత్ ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేసేవాడు. ఇద్దరూ సత్యా నగర్‌లో పక్కపక్కనే ఉంటున్నారు. భరత్ ప్రేమను మధులిక అంగీకరించలేదు. ఈ విషయంపై మధులిక తల్లిదండ్రులు సైతం భరత్‌ను మందలించారు. షీటీమ్స్‌కు తెలపడంతో షీటీమ్స్ భరత్‌కు కౌన్సిలింగ్‌నిచ్చారు. అయినప్పటికీ భరత్‌లో మార్పు రాలేదు సరికదా.. మరింతగా మధులికను ప్రేమించమని వేధింపులకు గురిచేసేవాడు. ఇదే క్రమంలో బుధవారం ఉదయం కాలేజీకి వెళ్లేందుకు బస్టాప్‌కు వస్తుండగా అక్కడే కాపుకాచి ఉన్న భరత్ కొబ్బరి బోండాల కత్తితో అందరూ చూస్తుండగానే మధులికపై దాడికి పాల్పడ్డాడు. కత్తితో తల, ఛాతీ, కడుపు ప్రాంతాల్లో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. బుధవారం ఉదయం 8-30 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. మధులిక తీవ్రగాయాలతో రోడ్డుపైన కొట్టుమిట్టాడుతుంది. తొలుత భయంతో చోద్యం చూసిన స్థానికులు ఆనక అప్రమత్తమై భరత్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించగా అతడు అక్కడ్నించీ ఉడాయించాడు. ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. మధులికను మలక్‌పేట యశోద ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అయితే మధులిక పరిస్థితి విషమంగానే ఉందని తెలుస్తోంది. కాగా, మధులిక ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియెట్ సెకండియర్ ఎంపీసీ చదువుతోంది.

ఆర్‌బీఎఫ్ ధర్నా

● ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద నిరాహార దీక్ష ● బ్రాహ్మణ రాజకీయ ప్రాతినిధ్యం కోసం పోరాటం

అమరావతి, ఆంధ్రప్రభ ప్రతినిధి : ఎంఐఎం తరహాలో రాష్ట్రంలో బ్రాహ్మణ సామాజిక వర్గం ఓ రాజకీయ పార్టీ పెట్టింది. కర్నాటక, తమిళనాడు, ఒరిస్సా, డిల్లీ తదితర రాష్ట్రాల్లోనూ శాఖలు ఏర్పడ్డాయి. రిజిష్ట్రేషన్ కోసం కేంద్ర ఎన్నికల కమిషన్ ముందు దరఖాస్తు చేసింది. కాగా తన ఉనికి చాటిచెప్పేందుకు బుధవారం దేశ రాజధాని డిల్లీలో భారీ ధర్నా నిర్వహించింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు డిల్లీకి చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రీయ బ్రాహ్మణ ఫ్రంట్ (ఆర్‌బిఎఫ్) పేరిట ఏర్పాటైన బ్రాహ్మణ రాజకీయ పార్టీ బుధవారం డిల్లీ జంతర్‌మంతర్ వద్ద ఒక్కరోజు నిరాహారదీక్ష, ధర్నా, ర్యాలీ జరిపింది. బ్రాహ్మణులకు చట్టసభల్లో రాజకీయ పార్టీలు దామాషా పద్ధతిని సీట్లు కేటాయించాలని, బ్రాహ్మణ ఎట్రాసిటీ చట్టం తేవాలని డిమాండ్ చేసాయి.రెండు రోజుల ముందే పార్టీ వ్యవస్థాక అధ్యక్షులు కాశీభట్ల సాయినాథశర్మ, జాతీయ కన్వీనర్ తిరుపతి సాయి స్వామిల ఆధ్వర్యంలో ప్రత్యేక రైలులో రెండు రాష్ట్రాలకు చెందిన బ్రాహ్మణ సంఘాలు, పార్టీ నాయకులు, మహిళలు, యువత భారీ ఎత్తున డిల్లీకి చేరుకున్నారు. అక్కడ వారికి డిల్లీ శాఖ అధ్యక్షుడు షా ఏర్పాట్లు చేసి డిల్లీ పోలీస్ కమిషనర్ నుంచి నిరాహార దీక్షకు అనుమతి తెచ్చారు. తాము బస చేసిన చోట నుంచి జంతర్‌మంతర్ వరకు ర్యాలీగా చేరుకున్నారు. డిల్లీలో వాడి వేడిగా తెలుగు స్వరాన్ని వేదఘోషను విన్పించారు. తొలుత ధర్నా జరిపి అనంతరం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిరాహార దీక్ష చేపట్టారు.



ఈసందర్భంగా సాయినాథశర్మ, తిరుపతి స్వామిలు మాట్లాడుతూ గ్రామాల్లో బ్రాహ్మణులను పిలక పంతులు, బాపనోడు, ఎర్రి బాపనయ్య అంటూ రకరకాల పేర్లతో వేధించడం, చిన్నబుచ్చడం, వివాహాలు చేసినపుడు పిలకకు తాడు కట్టి అవహేళన చేయడం వంటి పనులు చేస్తున్నారని దీంతో బ్రాహ్మణుల ఆత్మ గౌరవం దెబ్బతింటోందన్నారు. ఎస్సి, ఎస్టి అట్రాసిటీ తరహాలో బ్రాహ్మణ అట్రాసిటీ చట్టం తేవాలని వారు డిమాండ్ చేసారు. అలాగే తమ జనాభాకు అనుగుణంగా రాజకీయ పార్టీలు చట్టసభల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని వారు కోరారు. ఏపార్టీ బ్రాహ్మణులను గుర్తించి ప్రాధాన్యత ఇస్తుందో ఆ పార్టీకే మద్దతు తెలుపుతామని లేదంటే ఒంటరి పోరు ఆర్‌బిఎఫ్‌న చేస్తామని వెల్లడించారు. ఆర్‌బిఎఫ్ ఏర్పాటు అయి అనంతపురం, కర్నూలు, కరపలలో సమావేశాలు పెట్టాక ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి బ్రాహ్మణులకు సీట్ల కేటాయింపులో తగిన గుర్తింపు ఇస్తామని ప్రాధాన్యత ఇచ్చారని, వైకాపా నుంచి ఇప్పటికే ఇద్దరికి అవకాశం కల్పించారన్నారు. కనీసం మూడు నుంచి ఐదు ఎమ్మెల్యే సీట్లు, ఓ ఎంపి సీటు, రెండు ఎమ్మెల్సీ సీట్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేసారు. తమ వర్గానికి రాజకీయ ప్రాధాన్యత ఉంటేనే తమ డిమాండ్లు పరిష్కారమవుతాయన్న నమ్మకం, ఆశతో ఈ సీట్ల గురించి అడుగుతున్నట్లు వారు తెలిపారు. ఇక నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో గ్రామ గ్రామాన కమిటీలు ఏర్పాటుచేసి బలోపేతం చేయడం, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు ముమ్మరం చేస్తామన్నారు. దేశ రాజధానిలో తమ గొంతు విన్పించడం వల్ల అన్ని రాజకీయ పార్టీలకు, దేశ ప్రజలకు బ్రాహ్మణ సామాజిక వర్గం డిమాండ్లు, తమ ప్రాధాన్యత తెలిసి వచ్చిందన్నారు. డిల్లీలో తమకు ఆతిథ్యం ఇచ్చిన డిల్లీ శాఖకు వారు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో రాష్ట్రపతి, ప్రధానిలను కలుస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌బిఎఫ్ ముఖ్య నాయకులు అద్దంకి కిరణ్, ముతుకుమిల్లి రామకృష్ణ, మంగళంపల్లి వరలక్ష్మి, కరణం సుజాత, సతీష్,కాళీ, అనంతలక్ష్మి, పురుషోత్తమరాజు, రఘు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.


సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

గురువారం 7 ఫిబ్రవరి 2019

చరిత్రలో ఈరోజు

చదువు సంధ్యల్లేని మహా రచయిత!



విక్టోరియన్ యుగంలో అతి గొప్ప నవలా రచయిత, సాంఘిక విమర్శకుడిగా పేరొందిన చార్లెస్ జాన్ హఫమ్ డికెన్స్ ఫిబ్రవరి, 7, 1812న జన్మించారు. డికెన్స్ సృష్టించిన పాత్రలు నవల పరిధినిదాటి.. ప్రపంచవ్యాప్తంగా వాస్తవిక ప్రపంచంలో ప్రవేశించాయనడంలో అతిశయోక్తిలేదు. ఆయన జీవించిన కాలంలోనే అనూహ్యమైన పేరు ప్రఖ్యాతులు పొందారు. సాహిత్య దిగ్గజంగా గుర్తింపు పొందారు. ఇప్పటికీ డికెన్స్ నవలలు, కథలు, కథానికలను విస్తారంగా చదువుతుండడం విశేషం. ఇంగ్లాండ్‌లోని పోర్ట్సమౌత్‌లో జన్మించిన డికెన్స్.. తన తండ్రి అప్పులు చేసి జైలు పాలవడంతో కుటుంబ పోషణ కోసం స్కూలు వదిలేసి ఫ్యాక్టరీలో చేరాడు. చదువు సంధ్యలు లేని డికెన్స్ 20 సంవత్సరాల పాటు ఒక వారపత్రికకు ఎడిటర్‌గా, 15 నవలలు, 5 నవలికలు, వందలకొద్దీ కథానికలు, వ్యాసాలు రచించారు. మేధావులు, పండితుల సభల్లో విలక్షణమైన ఉపన్యాసాలిచ్చారు. ఇక డికెన్స్ ఉత్తరాలు రాయడంలోనూ ప్రసిద్ధుడే. చిన్న పిల్లల హక్కులు, విద్య కోసం, ఇతర సాంఘిక సంస్కరణల కోసం జీవితమంతా అలుపెరగకుండా కృషి చేశారు. 1836లో డికెన్స్ ఇంగ్లాండ్‌లోని పిక్‌విక్ పేపర్లో సీరియల్ రాయడం మొదలెట్టాడు. అనతి కాలంలోనే ప్రపంచ ప్రఖ్యాత సాహితీవేత్తగా ఎదిగారు. హాస్యం, వ్యంగ్యం పండించడంలో డికెన్స్ తరువాతే ఎవరైనా అని అన్ని వర్గాలతో ప్రశంసలు పొందారు. వారపత్రికల్లో డికెన్స్ సీరియల్స్ ఎన్నో కొత్త ఒరవడులకు నాందీ పలికాయి. వారం వారం పాఠకులను తీవ్ర ఉత్కంఠలో వదిలేసి.. వచ్చే వారం వరకు ఎదురు చూసేలా చేయడం డికెన్స్‌కి వెన్నతో పెట్టిన విద్య. డికెన్స్ ద్వారానే ఇంగ్లాండ్‌లోని నిరుపేదలకు కూడా సాహితీ సుగంధం అబ్బింది. చదువు రాకపోయినా.. డికెన్స్ రాసినవి చదివి వినిపించుకొనే వారు. ఈ విధంగా సాహిత్యంలోకి కొత్త పాఠకులను తెచ్చిన ఘనత కూడా డికెన్స్‌దే! డికెన్స్ రాసిన నవలల్లో తలమానికైంది రెండు నగరాల కథ!

తొలి స్పేస్ జెట్ ప్యాక్!




మొన్నామధ్య వచ్చిన గ్రావిటీ సినిమా ప్రపంచ ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టింది. అందులో హీరోయిన్ సాండ్ర బులాక్ ఏకపాత్రాభినయం చేశారు. స్పేస్ షటిల్ నుంచి దూరంగా ఒక కుర్చీలో కూచున్నట్లున్న వాహనంపై సాండ్ర ఫీట్లు చేయడం గుర్తుండే ఉంటుంది. దాన్నే... జెట్ ప్యాక్ అంటారు. దీన్ని నాసా అభివృద్ధి చేసింది. 1984, ఫిబ్రవరి 4న స్పేస్ షటిల్ ఛాలెంజర్ అంతరిక్షంలోకి వెళ్లింది. వ్యోమగామి బ్రూస్ మెక్ కాండిల్స్ తొలిసారిగా జెట్ ప్యాక్‌ను ఉపయోగించి.. స్పేస్ షటిల్‌తో ఎలాంటి సంబంధం లేకుండా తొలిసారిగా అంతరిక్షంలో విహరించారు. ఛాలెంజర్ నుంచి మూడు వందల అడుగుల వరకు వెళ్లి తిరిగి దిగ్విజయంగా తిరిగొచ్చారు. 7, ఫిబ్రవరి, 1984న బ్రూస్ ఈ ఫీట్ చేసి చరిత్ర సృష్టించారు. గ్యాస్‌తో నడిచే జెట్ ప్యాప్ ప్రొపెల్లర్‌తో అంతరిక్షంలో తిరగడం చిన్న విషయమేమీ కాదు. దీన్నే నాసా భాషలో మ్యాన్డ్ మాన్యువరింగ్ యూనిట్ అంటారు. కక్ష్యలో ఉన్న ఉపగ్రహాల దగ్గరకి వెళ్లడం, వాటిని రిపేర్ చేయడం లేదా, షటిల్ వద్దకు తీసుకొని రావడానికి ఎమ్ఎమ్‌యూలను వినియోగిస్తారు. వీటి బరువు 148 కిలోలు ఉంటుంది. ఎమ్ఎమ్‌యూలను నడపడానికి నైట్రోజన్ వాయువును వాడతారు. రెండు అల్యూమినియం ట్యాంకుల్లో ఒక్కోదాంట్లో 5.9 కేజీల నైట్రోజన్ వాయువు ఉంటుంది. ఇది దాదాపు ఆరు గంటల పాటు అంతరిక్షంలో తిరగడానికి సరిపోతుంది. ఇక దీని వేగం సెకనుకి 40 అడుగుల దూరం ఉంటుంది. ఇందులో కూచున్న వ్యోమగామి చేతుల వద్ద కంట్రోలర్లు ఉంటాయి. వీటి సాయంతో పైకి, కిందకి, వెనక్కి, ముందుకు వెళ్లగలుగుతాడు. కక్ష్యలోని ఉపగ్రహాల వద్ద వ్యోమగాములు పని చేస్తున్నప్పుడు ఆటోమేటిక్ మోడ్ కూడా ఈ జెట్ ప్యాక్‌లో ఏర్పాటు చేశారు. అయితే తరువాతి కాలంలో జెట్ ప్యాక్‌లను వాడడాన్ని నాసా మానేసినా, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్ర నిర్మాణంలో మరింతగా అభివృద్ధి చేసిన ఎమ్ఎమ్‌యూల సేవలను వాడుకున్నారు.

వందేళ్ల పోరాటంతో ఓటు హక్కు!



ప్రజాస్వామ్యం ఎంతో అభివృద్ధి చెందింది అని చెబుతున్న యూరోప్ దేశాల్లో నిజానికి అలాంటి పరిస్థితి ఉందా అంటే.. అనుమానమే! భూతల స్వర్గంగా చెప్పే స్విట్జర్లాండ్‌లో మహిళలకు 1971 వరకు ఓటు హక్కు లేదు అంటే విచిత్రంగా ఉంటుంది కదూ. 7, ఫిబ్రవరి, 1971న స్విట్జర్లాండ్ తమ దేశ మహిళలకు ఓటు హక్కు కల్పించింది. ఇక్కడే మరో వింతైన విషయమేంటంటే, ప్రపంచంలో మహిళలకు ఓటు హక్కు లేని అయిదు దేశాలున్నాయి. జోర్డాన్, కువైట్, సౌదీ అరేబియా, యెమెన్, లిచిటెన్‌స్టన్ అనే ఓ చిన్న దేశంలో మహిళలకు ఇప్పటికీ ఓటు హక్కు లేదు. దేశంలో మహిళలకు ఓటు హక్కు కల్పించాలా వద్ద అన్నదానిపై స్విట్జర్లాండ్‌లో పెద్ద మీమాంసే జరిగింది. దేశవ్యాప్తంగా రెఫరెండమ్ నిర్వహించారు. ఇలాంటి రెఫరెండాన్ని 1959లో కూడా నిర్వహిస్తే స్విట్జర్లాండ్‌లోని పురుష పుంగవులు.. అవసరమే లేదని తేల్చేశారు. 67 శాతం మంది పురుషులు.. మహిళలకు ఓటు హక్కు వద్దని ఓటేశారు. 1848 నాటి స్విస్ రాజ్యాంగం ప్రకారం ఓటు వేసే హక్కు, మిలటరీలో చేరే అవకాశం కేవలం పురుషులకే కేటాయించారు. మనుషులంతా సమానమేనని ఘోషించిన స్విస్ రాజ్యాంగం.. ఆడవారి విషయంలో మాత్రం చిన్నచూపే చూసింది. దీంతో స్విస్ మహిళలు వంద సంవత్సరాలకు పైగా ఓటు హక్కు కోసం పోరాటాలు చేయాల్సి వచ్చింది. ఫెమినిస్ట్ సంఘాలు ఏర్పాడి రాజకీయ ప్రాధాన్యత కోసం సభలు, సమావేశాలు పెట్టాయి. లెక్కలేనన్ని ఉద్యమాలు చేశాయి, ఎన్నో న్యాయపోరాలు చేశారు. అయినప్పటికీ వారికి రావాల్సి ఓటు హక్కు మాత్రం రాజ్యాంగ పరంగా కాకుండా రెఫరెండమ్ నిర్వహించడం ద్వారానే సంక్రమించడం విశేషం. అక్కడ ప్రత్యక్ష ఎన్నికల కారణంగా కూడా మహిళలకు ఓటు హక్కు ఆలస్యంగా లభించిందంటారు.

ఆధునిక రష్యాకి పునాది రాయి!



25, డిసెంబర్, 1991న సోవియట్ యూనియన్ కుప్పకూలిపోయింది. దీనికి ముందే సోవియట్ యూనియన్ అధ్యక్షుడు మిఖైల్ గోర్బచేవ్. 7, ఫిబ్రవరి, 1990న కీలక నిర్ణయం తీసుకున్నారు. దాని ప్రకారం కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ సోవియట్ యూనియన్ రాజ్యాధికారాన్ని వదులుకోవడానికి అంగీకరించింది. మిఖైల్ గోర్బచేవ్ సిఫార్సుల ప్రకారం 70 సంవత్సరాల రాజ్యాధికారంపై పెత్తనాన్ని వదులుకోవడానికి కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ అంగీకరించింది. ఈ అంగీకారంతోనే తరువాత రోజుల్లో సోవియట్ యూనియన్ కూలిపోయి.. రష్యాగా అవతరించడం సాధ్యపడింది. సోవియట్ యూనియన్‌లోని సుప్రీం సోవియట్ ప్రకటన 142 ప్రకారం యూనియన్‌లోని మాజీ రిపబ్లిక్‌లకు స్వాతంత్ర్యం లభించింది. డిసెంబర్ 25న మిఖైల్ గోర్బచేవ్ తన అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఈయనే సోవియట్ యూనియన్‌కి ఎనిమిదవ, చివరి నియంతగా గుర్తింపు పొందారు. రష్యా తొలి అధక్షుడిగా బోరిస్ ఎలిస్టిన్ ప్రమాణస్వీకారం చేశారు. క్రెమ్లిన్‌పై సోవియట్ యూనియన్ పతాకాన్ని దించేసి.. విప్లవానికి పూర్వం ఉన్న రష్యా పతకాన్ని ఎగురేశారు.

'అయోధ్య' వాయిదా వెనుక...

లోక్‌సభ ఎన్నికలు పూర్తి అయ్యే వరకూ అయోధ్యలో రామాలయం కోసం ఎటువంటి ఆందోళన చేయరాదని విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) నిర్ణయించడం ప్రధానమంత్రి నరేంద్రమోడీకి పెద్ద ఊరట. బీజేపీ ఇప్పుడు రామాలయం అంశంపై కాకుండా, మోడీ అమలు జేసిన కార్యక్రమాలపై ప్రజల తీర్పు కోరేందు కు సిద్ధమవుతోంది. మోడీ హయాంలో అంతా మంచే జరిగిందనీ, పేదల సంక్షేమ పథకాలు సజావుగా అమ లు జరుగుతున్నాయని ఆ పార్టీ పదే పదే స్పష్టం చేస్తోం ది. మోడీకి లోక్‌సభలో సంపూర్ణమైన మెజారిటీ ఉన్నందున రామాలయం కోసం ఆర్డినెన్స్ తెచ్చినా రాజకీయంగా ఆయనను అడ్డుకునే వారు ఎవరూ లేరు. పేరుకి ఎన్‌డిఏ-2 ప్రభుత్వానికి నేతృత్వం వహి స్తున్నా, మోడీ మదిలో మెరిసిన ఆలోచనే నిర్ణయంగా అమలు జరుగుతున్న రోజులివి. ఇందుకు ఉదాహరణ 2016 నవంబర్‌లో ఆయన తన సహచరులను సైతం సంప్రదించకుండా పెద్ద నోట్లను రద్దు చేశారు. అందు వల్ల రామాలయంపై ఆర్డినెన్స్‌ను తీసుకుని వచ్చినా ఆయనకు ఎదురు లేదు. అయితే, అలనాడు రామాలయం కోసం పార్టీ అగ్ర నాయకుడు అద్వానీ రథయాత్ర చేపట్టిన నాటికీ. ఇప్పటికీ దేశంలో, ముఖ్యంగా, సమా జంలో ఎన్నో మార్పులు వచ్చాయి. మోడీ అధికారం లోకి వచ్చిన తర్వాత అయోధ్యకు బదులు అభివృద్ధి మంత్రాన్ని పఠిస్తూ ప్ర జల ఆలోచనా విధానాల్లో మార్పు తేగలిగారు. అయితే, సంఘ్ పరివార్ ఒత్తిళ్ళ కు ఆయన పూర్తిగా దూరమయ్యారనడానికి లేదు. ఇప్పటికీ పరివార్ నాయకులు మోడీ ప్రభుత్వంపై ఒత్తి ళ్ళు తెస్తూనే ఉన్నారు. దేశంలో పలుచోట్ల దాడులు జరుపుతున్న గోరక్షకుల వెనక పరివార్ నాయకులు న్నారన్నది తిరుగులేని వాస్తవం. ఉత్తరప్రదేశ్ ముఖ్య మంత్రిగా తన శిష్యుడు, హిందూ యువవాహిని వ్యవస్థాపకుడు అయిన యోగీ ఆదిత్యనాథ్ పరివార్ అజెండాను వీలైనమేరకు అమలుజేస్తూనే ఉన్నారు. అలహాబాద్ పేరును ప్రయాగరాజ్ గానూ, ఫైజాబాద్ జిల్లాని అయోధ్య జిల్లాగా మార్చారు. రామాలయ నిర్మాణానికి తొందరపడకూడదన్న నిర్ణయం మేరకే మోడీ, ఆయన అనుచరులు ఆచితూచి అడుగులేస్తు న్నారు. రామాలయం ఆర్డినెన్స్ కోసం ఆందోళన సాగించాలన్న నిర్ణయాన్ని విహెచ్‌పి నాయకులు వాయిదా వేయడాన్ని ఈ కోణంలోనే చూడాల్సి ఉంటుంది. అయోధ్యలో రాముడు పుట్టినచోట రామాలయం నిర్మాణంపై మీ వైఖరి ఏమిటో చెప్పండి అంటూ సమాజ్ వాదీ, బహుజన సమాజ్ పార్టీలకు బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా పిలుపు ఇచ్చిన రోజునే వీహెచ్ పీ సంయుక్త ప్రధాన కార్యదర్శి సురేంద్ర జైన్ ఈ ప్రకటన చేయడం కాకతాళీయం కాకపోవచ్చు. ఈ ఎన్నికల్లో తాము రామాలయాన్ని ప్రచారాంశంగా చేసుకో దల్చుకోలేదనీ, మోడీ సాధించిన అభివృద్ధి అం శంపైనే ప్రజల తీర్పు కోరతామని అమిత్ షా అన్నారు. ఈ ఎన్నికలు మోడీకీ, ప్రతిపక్షాలకూ మధ్య జరుగుతున్నాయని కూడా ఆయన అన్నారు. అందు వల్ల రామాలయంపై ఆందోళనను వాయిదా వేయాలన్న నిర్ణయాన్ని వీహెచ్‌పీ మోడీ ఆదేశంపైనే వాయిదా వేసి ఉండ వచ్చు. బీజేపీ ఎంపీ డాక్టర్ సుబ్రహ్మణ్య స్వామి ఇటీవ లి వరకూ రామాలయం నిర్మాణం కోసం పదే పదే డిమాండ్ చేసేవారు. ఇప్పుడు ఆయన కూడా మౌనం పాటిస్తున్నారు. మోడీ పాలనలో జరిగిన అవినీతి, వాగ్దానాల భంగం పైనా ప్రతిపక్షాలు గురి పెట్టి ప్రచారాస్త్రాలను సంధించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో రామాలయం అంశాన్ని తెర మీదికి తెస్తే, ప్రతిపక్షాలకు మరింత శక్తిమంతమైన అస్త్రాన్ని అందించినట్టు అవుతుందని మోడీ భావించి ఉండవచ్చు. అందుకే, తన కార్యక్రమాలు, పథకాలను ప్రచారం చేసుకోవాలని ఆయన నిర్ణయించి ఉండవచ్చు. అంతేకాక, అయోధ్యపై ఆర్డినెన్స్ తెచ్చినా, ఆలయ నిర్మాణాన్ని ఇప్పుడు పూర్తి చేయడం ఎలాగూ సాధ్యం కాదు. మోడీకి ప్రత్యా మ్నాయంగా బీజేపీ మాజీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని పరివార్ సమర్థిస్తోందంటూ వచ్చిన వార్తలు ఊహాగానాలే తప్ప నిజం లేదని తాజా పరిణామంతో స్పష్టం అవుతోంది. సంఘ్ కార్యక్ర మాలను అమలుజేయడంలో గడ్కరీ కన్నా, మోడీ యే మేలు అనీ, ఆలయ నిర్మాణం ఆలస్యమైనా మోడీ ద్వారానే అమలు జరిపించాలని పరివార్ తల పోస్తున్నట్టు స్పష్టం అవుతోంది. ఉత్తరప్రదేశ్‌లో అగ్ర వర్ణాల ఓట్ల ను రాబట్టేందుకు అగ్రవర్ణాల్లో పేదలకు పది శాతం రిజర్వేషన్ల బిల్లును ఇప్పటికే రాష్ట్రపతి ఆమోదించ డం, పలు రాష్ట్రాల శాసనసభలు ఈ రిజర్వేషన్లను అమలు జేస్తామని తీర్మానాలు చేయడంతో అగ్రవర్ణా ల ఓట్లు ఎక్కడికీ పోవన్న ధీమా కమలనాథులలో ఏర్పడి ఉండవచ్చు. ఎన్నికల ముందు అయోధ్య అం శాన్ని తెరమీదికి తెస్తే లాభం కన్నా, నష్టమే ఎక్కువ అని భావించి ఉండవచ్చు. మోడీ సలహాలపైనే పరివార్ పని చేస్తోందనడానికి ఇది తాజా ఉదాహరణ.

నలువైపులా జనసేన!



విజయవంతమైన ప్రతి రాజకీయ నాయకుడికి రెండు సాధారణ లక్షణాలుంటాయి. నిశ్శబ్దంగా తమ పని తాము చేసుకుంటూ పోయి, ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యానికి గురి చేస్తారు. అసాధ్యంగా కనిపించిన వాటిని సుసాధ్యం చేయడంలో అపరిమితమైన నిర్ణయాత్మక శక్తిని ప్రదర్శిస్తారు. ఇప్పుడు మనం 2200 సంవత్సరాల క్రితం ఉత్తర ఆఫ్రికాను ప్రభావితం చేసిన జనరల్ హనీబాల్ చరిత్ర తెలుసుకుందాం.

తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంలో, వ్యూహరచనలో హనీబాల్ గొప్ప నాయకుడిగా చరిత్రలో కీర్తించబడ్డారు. 2200 సంవత్సరాల క్రితమే హనీబాల్ ఓడల్లో మధ్యధరా సముద్రాన్ని దాటి యూరోప్ చేరుకున్నారు. ఆల్ప్ పర్వతశ్రేణి గుండా తన అశేష సైనిక వాహినిని నడిపించి ఇటలీపై దండెత్తారు. చరిత్రలో అతి గొప్ప యుద్ధంగా దీన్ని పరిగణిస్తారు. ఆఫ్రికా ఏనుగుల సహాయంతో మంచుతో కప్పబడిన ఆల్ప్ పర్వతాలను దాటడమే హనీబాల్ తొలి విజయం. రోమన్లను ఆశ్చర్య చకితుల్ని చేసేలా వారిని వారి గడ్డపైనే యుద్ధంలో ఒక కృత నిశ్చయంతో ఓడించారు. ఒక ఆఫ్రికా జనరల్ సముద్రం దాటి వచ్చి ఏనుగుల సహాయంతో మంచు పర్వతాలను అధిగమించి యూరోప్‌ను జయిస్తాడని అప్పట్లో ఎవరూ ఊహించలేకపోయారు. అసాధ్యమైన దాన్ని హనీబాల్ సుసాధ్యం చేశారు.

మంచు పర్వత శ్రేణుల్లో హనీబాల్ ఆఫ్రికా ఏనుగులను చూసి రోమన్లు కాలికి బుద్ధి చెప్పినట్లే, కొత్తగా ఏర్పడ్డ రాజకీయ పార్టీ అలుపెరగకుండా చివరి దాకా పోరాటం చేస్తే ప్రత్యర్థులు కూడా పరారవుతారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పార్టీలకు పెద్ద పెద్ద మౌలిక వనరులున్నాయి. అయితే వారికి కలిసి రానిదేంటంటే, ఎన్నికల్లో పాత పద్ధతుల్లో పోరాడుతూ ఉంటారు. కొత్త వ్యూహ రచన చేయలేరు. ఒకసారి మాజీ అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇలా చెప్పారు.. మీరు భిన్నమైన ఫలితాలు రావాలనుకుంటే, అంతే భిన్నంగా పని చేయాలని డెమొక్రాటిక్ నేతలు, కార్యకర్తలకు పిలుపిచ్చారు. అదే ఇప్పుడు ఏపీలో పవన్ కళ్యాణ్ చేస్తున్నది. ఇది ఆం ధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెను మార్పులు తీసుకొస్తోంది. అలాంటి కొత్త ఎత్తుగడలను ఆక్స్‌ఫర్డ్, హార్వార్డ్ వంటి పెద్ద విశ్వవిద్యాలయాలు విచ్ఛిన్న చర్యలుగా అభివర్ణిస్తాయి. ఆపిల్ ఫోన్‌కి ఇలాంటి విచ్ఛిన్నకర సాంకేతిక పరిజ్ఞానముంది. అందుకనే ఆపిల్ ఫోన్ అలాంటి విచ్ఛిన్నకర విధానాలను అవలంభించి అతి పెద్ద కంపెనీగా అవతరించింది. ఇలాగే జనసేన కూడా ఏపీలో పాత తరహా రాజకీయాలను విచ్ఛిన్నం చేసి, కొత్త తరహా రాజకీయాలను లేదా నవీన కాలపు రాజకీయాలను పరిచయం చేస్తోంది.

జన సేన ప్రభావం..!

- పవన్ కళ్యాణ్ కృషితో జనసేన ఇప్పు డు ఆంధ్రప్రదేశ్ అంతటా విస్తరించిం ది. ఏపీలో రాజకీయ పార్టీగా ఆవిర్భవించింది. దీంతో ఆ రాష్ట్రం లో ముక్కోణపు పోటీకి తెర తీసినట్లైంది. ఆంధ్రప్రదేశ్ నాలుగు చెరుగులా జన సేన వ్యాపించింది. ప్రజల్లో సహజంగా ఉండే నాయకు లు, కొత్తవారికి పార్టీలో పెద్దపీట వేశారు. అట్టడుగు ప్రజలంతా ఇప్పుడు జనసేనకు మద్దతి స్తున్నారు.
- సహజంగా ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులను ముందుగా ప్రకటిస్తాయి. అయితే జనసేన ఇంకా తన అభ్యర్థులను ప్ర కటించకపోవడంతో ఏపీ రాజకీయ ఆవరణలో పెద్ద నిశ్శబ్దం తాండ వం చేస్తోంది. బరిలో కేవలం రెండే ప్రధాన పార్టీలుంటే, ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించేవారు. అయితే ఏపీలో రాజకీయ పార్టీలన్నీ కూడా ఇప్పుడు జనసే న ఏం చేస్తుంది, ఎలాంటి అభ్యర్థులను ప్రకటిస్తుంది అన్న దానిపై అమితాసక్తితో ఎదురు చూస్తున్నాయి.
- రెండు తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ సహజంగానే మూడో రాజకీయ పక్షంగా ఉండాల్సి ఉంది. అయితే ఆ అవకాశాన్ని బీజేపీ చేతులారా చేజార్చుకుంది. దీంతో ఏపీలో జనసేన మరో అతిపెద్ద రాజకీయ పార్టీగా ఆవిర్భవించింది.
- కొత్త తరం నాయకులు జనసేనలో చేరారు. వృత్తి నిపుణులు, అన్ని కులాలు, మతాల నుంచి యువత రాజకీయాల్లో కొత్త శక్తులుగా అమితమైన ఉత్సాహంగా ఉన్నారు. జనసేనలో అందరికీ ఆహ్వానం ఉండడంతో, ఎవరైనా సభ్యుడిగా, నాయకుడిగా ప్రకటించుకొనే అవకా శం ఉంది. ఎవరూ ఎవరినీ పార్టీలోకి ఆహ్వానించాల్సిన అవసరమే లేకుండా పోయింది. దీంతోనే జనసేనలో సభ్యత్వ నమోదు విపరీతంగా పెరిగిపోయింది.
- రాష్ట్ర వ్యాప్తంగా, విదేశాల నుంచి చదువుకున్న వారిని జనసేన రాజకీయాల్లోకి తీసుకొస్తోంది. జనసేన అధికారంలోకి వస్తే అమలు చేయబోయే పథకాలకు ఈ వర్గాల్లో విపరీతమైన మద్దతు వస్తోంది. దీంతో పాతుకుపోయిన రాజకీయ పార్టీలు తాము మర్చిపోయిన కులాలు, తెగలను ఇక ఎంతమాత్రం నిర్లక్ష్యం చేయలే ని పరిస్థితి ఏర్పడింది. కులాల వారీగా ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎంతమంది ఉన్నారో విశ్లేషిస్తే, యాభై శాతం ఆధిపత్య కులాల ప్ర జాప్రతినిధులే ఉన్నట్లు తెలుస్తుంది. ఈ సంఖ్యలో మార్పు రావాలని ఏపీలోని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.
- జనసేన సభలు, సమావేశాలను డబ్బులు ఖర్చు పెట్టకుండా నిర్వహిస్తోంది. జనసేన నిర్వహించే కవాతులు, ఊరేగింపులన్నీ స్వచ్ఛందంగా, రూపాయి ఖర్చు పెట్టకుండా జరిగిపోతున్నాయి. అందుకనే జనసేన అన్ని వర్గాలకు చెందిన యువతపై ఆధారపడుతూ.. నిధులు లేని పార్టీగా అవతరించింది. పాతుకుపో యిన పార్టీలు మాత్రం తమ కార్యకర్తలకు డబ్బులు, ఆహారం, రవాణా ఖర్చులు పెట్టుకొని కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నాయి.

అగ్రవర్ణ కులాల్లో గొప్ప ఐక్యత ఉంటుందని, అధికారం లేని చిన్న కులాలు అనైక్యతతో ఉంటాయని గొప్ప సామాజిక శాస్త్రవేత్త అంబేద్కర్ చెప్పారు. అయితే ఏ అగ్రవర్ణమైన మొత్తం జనాభాలో విడిగా మూడు శాతం కూడా మించకపోయినా ఐక్యంగా ఉంటూ, సంపద, మీడియా, రాజకీయ జ్ఞానంపై ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఇవే పార్టీలు మరోసారి అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కొంతమందికి చెందిన ప్రైవేటు కంపెనీగా తయారవుతుందని ప్రజలు ఎంతో అప్రమత్తతతో ఉన్నారు.

1862లో ఇటలీలో జన్మించిన జార్జ్ సంత్యాన అనే తాత్వికుడు చెప్పిన విలువైన మాటలను ఈ సందర్భంలో గుర్తు చేసుకోవాలి. ఎవరైతే చరిత్రను మర్చిపోతారో వారు పదే పదే శిక్షకు గురవుతారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు పూర్తిగా అవినీతితో నిండుకున్న ప్రభుత్వాన్ని నడుపుతున్నారని ప్రకటించి, ఆయనపై పోటీకి సిద్ధపడడానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కి ఎంతో గుండె ధైర్యం ఉండాలి. గత ఏడాది పవన్ కళ్యాణ్ తన పార్టీ జనసేనని బలోపేతం చేశారు. ప్రజల్లోకి విస్తారంగా తీసుకెళ్లారు. డబ్బు రాజకీయాలను ఎదుర్కోవాలంటే.. జనసేన ఒక్కటే ప్రత్యామ్నాయమని ఏపీ ప్రజలకు ఇప్పుడు బాగా అర్థమైంది. నేను జోతిష్యుడిని కాను. ఎన్నికల ఫలితాలను ఊహించలేను. అయితే అనేక తప్పుడు సర్వేలు మీడియాలో ప్రచారంలో ఉన్నాయి. ప్రజలకు ఈ విషయాలు ఇప్పుడు బాగా అర్థం అవుతున్నాయి. ఎన్నికల్లో ధన ప్రవాహానికి జనసేన ఎదురీదుతున్న విషయాన్ని జనం గుర్తిస్తున్నారు. జనసేనకే ఓటేయాలని కంకణం కట్టుకున్నారు. హనీబాల్ నుంచి మనం నేర్చుకోవాల్సింది ఏంటంటే, మన శత్రువు ఊహించని దెబ్బ తీయాలి. కృ త నిశ్చయాన్ని సడలించరాదు. పవన్‌కళ్యాణ్ ఎంతో వినయ విధేయతలతో అదే చేస్తున్నారు. అదే.. జనసేన ప్రజలకు వాగ్దానం చేస్తున్న మార్పు!



డాక్టర్ పెంటపాటి పుల్లారావు
(రాజకీయ విశ్లేషకులు)
(ppr193 @gmail.com)

రైతులకు కొంత ఊరట!

కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన తాత్కాలిక బడ్జెట్‌లో రైతులకు 6 వేల రూపాయలు 3 విడతలుగా చెల్లించే విధంగా నిర్ణయం తీసుకోవడం పట్ల దేశవ్యాప్తంగా సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మొత్తం మీద కేంద్ర ప్రభుత్వ సహాయం రైతులకు ఎంతో కొంత ఊరట కలిగించనున్నది. ఈ మధ్యకాలం లో ఇప్పుడు కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ఒక్క రాష్ట్రాన్ని చూసి మరొక రాష్ట్రం అన్నట్లుగా పోటీ పడి రైతులకు రాయితీలు, ఆర్థిక సహకారాలు అందించడం లో దూసుకెళుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తాజాగా దేశవ్యాప్తంగా తీసుకొ చ్చిన పిఎం కిసాన్ పథకాన్ని కొన్ని ప్రతిపక్ష పార్టీలు ఇతర రాజకీయ పక్షాలు ఎన్నికల గారడీగా విమర్శిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వమైతే... ఏకంగా మా రైతుబంధు పథకాన్ని కాపీ కొట్టారని ఎద్దేవా చేస్తున్నది. ఐతే... గతంలో అనేక సందర్భాల్లో అటు కేంద్ర ప్రభుత్వ పాలకులు, ఇటు అనేక రాష్ట్రాల ప్రభుత్వాల పాలకులు రైతులకు సమయానుకూలంగా రాయితీల రూపంలో కొన్ని పథకాలు, నేరుగా సహాయం చేస్తూ మరికొన్ని పథకాలు తీసుకొచ్చా రు. స్వతంత్ర భారత దేశ మొదటి ప్రధాని నెహ్రూ తాను దీర్ఘకాలిక వ్యూహం తో ఏర్పాటు చేసిన పంచవర్ష ప్రణాళికల లక్ష్యంతో మొదటి పంచవర్ష ప్రణాళిక కాలాన్ని పూర్తిగా వ్యవసాయరంగ అభివృద్ధికి, రైతాంగ శ్రేయస్సుకు కేటాయించారు. లాల్ బహదూర్ శాస్త్రి ఏకంగా జై జవాన్ - జై కిసాన్ అనే నినా దాన్ని దేశవ్యాప్తంగా హోరెత్తించారు. విశ్వనాథ ప్రతాప్‌సింగ్ 1989 ఎన్నికల సమయంలో తన జనతాదళ్ పార్టీ మ్యానిఫెస్టోలో తాను అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల బాకీలు 10 వేల వరకు రద్దు చేస్తానని ప్రకటించారు. అన్నట్లుగానే అతడు ప్రధానిగా కొనసాగిన కేవలం ఏడాదిన్నర కాలంలో ఆ హామీని నెరవేర్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2001 - 2003 మధ్య వరుసగా వచ్చిన కరవుల నేపథ్యంలో అరకొర కరెంట్‌తో... మరియు తగిన గిట్టుబాటు ధర లేక ఇంకా.. ఇతరత్రా కారణాలతో అనేకమంది రైతులు ఆత్మ హత్యలకు పాల్పడ్డారు. అప్పట్లో కరెంట్ బాకీలను వసూలు చేయడానికి అధికారులు రైతుల మీద నాన్ బెయిలబుల్ కేసులతో వేధించిన సందర్భాలు కూ డా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నాయకునిగా ఉన్న వైఎస్ రాజశేఖర రెడ్డి తాము అధికారం లోకి రాగానే రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించడమే కాకుండా పెండింగ్ విద్యుత్ బిల్లులు రద్దు చేస్తామని కూడా హామీ ఇచ్చారు. అన్నట్లుగానే 2004లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ హామీని నెరవేర్చారు.

ఇలాగే ప్రభుత్వ బ్యాంకులలో రైతుల బాకీలనే కాకుండా ప్రైవేట్ వ్యక్తుల దగ్గర తీసుకున్న బాకీలు కూడా అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు రైతులను వేధించకుండా మామూలుగా సాదా సీదా తరహాలో వసూలు చేయాలని ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చారు. 2009 ఎన్నికల ముందర అప్పటి యుపిఏ ప్రభుత్వం దేశవ్యాప్తంగా సరాసరిన 10 వేల వరకు రైతుల బాకీలను రద్దు చేసింది. సకాలంలో రైతులు బ్యాంకులకు చెల్లించిన రైతుల జాబితాలను సేకరించి వారి అకౌంట్లలోకి నేరుగా 4 వేల నుంచి 5 వేల వరకు డిపాజిట్ చేసింది. ఈ ప్రభావం రెండవసారి యుపిఏ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి చాలా ఉపయోగపడింది. ఇదే విధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన తరువాత రెండు తెలుగు రాష్ట్రాలలో 2014 ఎన్నికల సమయంలో ఇటు టిఆర్ఎస్ పార్టీ, అటు తెలుగుదేశం పార్టీ వారి పార్టీల మేనిఫెస్టోలో అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల రుణా లను రద్దు చేస్తా మని ప్రకటిం చారు. ఒక్కసారిగా కాకుండా మూ డు సంవత్సరాల కాల పరిమితితో విడ తల వారీగా రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు రైతుల రుణాలను చాలా వరకు రద్దు చేశారు. ఏకంగా టీఆర్ఎస్ ప్రభుత్వం సరిగ్గా ఏడాది కిందట ఎన్నికలను దృష్టిలో పెట్టు కొని రైతు బంధు పథకం పేరుతో ప్రతి రైతుకు ఎకరానికి 8 వేల ప్రకారం ఏడాదిలో రెండు విడత లుగా చెల్లించే విధంగా కొత్త చట్టాన్ని తీసుకొచ్చారు. అన్నట్లుగా ఊరు, వాడా అదిరేవిధంగా జాతరలాగా చెక్కులు పంపిణీ చేశారు. ఈ రైతు బంధు పథకం ద్వారానే కేసీఆర్ మరోసారి అధికారంలోకి రాగలిగారని దేశ వ్యాప్తం గా చర్చనీయాంశమైంది. ఇదే సమ యం లో ఎన్న, చిన్నకారు రైతులకు, కౌలు రైతు లకు మాత్రమే ఈ సహాయం చేస్తే బాగుంటుందని అనేకమంది సూచించినప్పటికీ కేసీఆర్ పట్టించుకోకుండా కౌలు రైతులను దూరంగా పెట్టి అన్నివర్గాల రైతుల కు పంపిణీ చేశారు. చివరకు ఎన్ఆర్ఐలకు కూడా ఈ పంపిణీ జరిగిం ది. ఇది మరీ అతిగా పంపిణీ జరిగిందనే విమర్శలు వచ్చినప్పటికీ కేసీఆర్ మాత్రం రాజకీయంగా బాహుబలిలాగా మారిపోయారు.


ఇదే తరహా పథకాన్ని పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ కూడా తీసుకొచ్చారని ప్రచార మాధ్యమాలలో ప్రచారం జరుగుతోంది. పక్కనున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా మరోసారి ఈ తరహా పథకాన్ని ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తీసుకొ చ్చిందని చెబుతున్నారు. అయితే... ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కౌలు రైతులను కూడా గుర్తించారని సమాచారం అందింది. ప్రస్తుతం తాజాగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రైతులకు వర్తించే విధంగా తీసుకొచ్చిన పిఎం కిసాన్ పథకంలో 5 ఎకరాల లోపు రైతులకు మాత్రమే వర్తించే విధంగా నిబంధనలు తీసుకొచ్చారు. ఇది చాలావరకు శుభపరిణామమేనని చెప్పవచ్చు. ఏది ఏమైనా... నేడు మొత్తం దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు రైతుల చుట్టూ తిరుగుతుండడం ఈ మధ్యకాలంలో రైతులలో వచ్చిన చైతన్యమేనని చెప్పవచ్చు.

అయితే... ఇలా రైతులకు ముసర, సహాయం అంటూ ఇచ్చుకుంటూ పోవడం కన్నా రైతులను స్వయం ఉత్పాదక శక్తులుగా మార్చడానికి అవకాశాలు లేవా? అని అనేకమంది విజ్ఞులు ప్రశ్నిస్తున్నారు. రైతు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించి దళారీ వ్యవస్థను దూరం చేసి రైతులకు కావలసిన ఎరువులు, ఇతరత్రా పనిముట్లు సరైన విధంగా సమకూర్చి రైతులు ఎదుర్కొనే ప్రతికూల పరిస్థితులను ప్రకృతిపరమైన సమస్యలను దూరం చేస్తే ఈ విధంగా చెల్లింపు.. పరిహారం... అనే వాటికి దూరం చేసి వారిని పేరాశవాదులుగా మార్చకుండా ఆత్మగౌరవం కలిగిన రైతన్నలుగా జీవించే విధంగా తీర్చిదిద్దాలని మెజార్టీ ప్రజల అభిప్రాయం.

-తిప్పినేని రామదాసప్ప నాయుడు
9989818212

బందరు పోర్టుకు మహర్దశ

నేడు చంద్రబాబు శంకుస్థాపన



మచిలీపట్నం, కృష్ణా జిల్లా ముఖ్యపట్టణం. క్రీస్తు పూర్వం నుంచి కూడా చరిత్రలో నిలిచింది. చరిత్రలో సుస్థిరస్థానం సంపాదించుకోబోతోంది. ఫిబ్రవరి 7న నవ్యాంధ్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బందరు పోర్టు (ఓడరేవు)కు శంఖుస్థాపన చేయనున్నారు. పోర్టు పనులు ప్రారంభమైతే మచిలీపట్నంకు మళ్ళీ మహర్దశరాబోతోం ది. ప్రస్తుత అంచనాలకు అద్దం పట్టేలా ఓడరేవు నిర్మితమైతే, అత్యా ధునిక హంగులు కలిగి, అంతర్జాతీయ కీర్తిని సంతరించు కోబోతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మితమయ్యే ఈ పోర్టు బ్రేక్ వాటర్ విధానంలో మొదటి స్థానం లో నిలవబో తోంది. మహనీయుల చిరకాల వాంఛలు ఈడేరటంతో పాటు, ఓడరేవుల విషయంలో మచిలీపట్నంకు పూర్వవైభవం కొనితెచ్చి, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేసి, ప్రజల ఆర్థికా భివృద్ధికి సోపానాలు ఏర్పరచగలదని మేధావి వర్గం అభిప్రాయపడుతోంది.

మచిలీపట్నానికీ ఓడరేవుకు అవినాభావ సంబంధం ఉంది. (మచిలీపట్నం పేరు మరుగున పడి, బందరుగా గుర్తింపు పొం దటానికి అక్కడున్న ఓడరేవు కారణమన్నది నిపుణుల అభి ప్రాయం. విదేశీయులను సైతం ఆకర్షించి, వారి వారి వ్యాపారాలకు ఆలవాలంగా మారిన మచిలీప ట్నం ఓడరేవు పునర్నిర్మాణం ప్రజల చిరకాల వాంఛ. దీని నిర్మాణం కోసం ఎన్నో ఉద్యమాలు జరిగాయి. ప్రభుత్వ విధానాలకు, నిర్లిప్తతకు నిరసనగా ర్యాలీలు, నిరసన దీక్షలు, నిరాహార దీక్షలు కూడా జరిగాయి. మచిలీపట్నంలో ఓడరేవును నిర్మించి, ప్రజల జీవన విధానంలో మార్పు తేవా లని, వారి ఆర్థిక పరిస్థితు లను మెరుగుపరచాలి. దాదాపు ఏడాదిన్నర పాటు ఒకసారి, సుమారు ఏడాది పాటు మచిలీపట్నంలో నిరసన దీక్షలు నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా, రాజకీయ పార్టీలు, సామాజిక వర్గాలు ఒక్కతాటిపై నడిచి, ఒక్క మాటపై నిలబడి, ముక్తకంఠంతో ఎలుగెత్తి అరచి న సంఘటన కూ డా మచిలీపట్నం చరిత్రలో మరొకటి కనిపించదు. మచిలీపట్నం ఓడరేవు నిర్మాణం ఇప్పటి కలగా, ప్రజల భవిష్యత్తుకు ఓ వారధిగా కనిపించవచ్చు. అంతకు మించిన చారిత్రక అంశం మరొకటి ఉంది. మచిలీపట్నంకు మరో ఉదాత్తమైన చరిత్ర ఉంది. క్రీస్తుకు పూర్వ మే మైసోలియా పేరిట ఇక్కడ ఒక ఓడరేవు కొనసాగిన విషయం చరిత్ర చెపుతున్న సత్యం. ఇండోనేషియా, చైనా, జపాన్, గ్రీస్ లాంటి దేశాలలో మచిలీపట్నం ఓడరే వు ఆధారంగా వ్యాపార లావాదేవీలు, సరకుల ఎగుమతులు జరుగుతుండేవి. అపుడు మనకు స్వాతంత్ర్యం లేదు. ఆ వ్యవహారం వల్ల విదేశీయులదే పూర్తి ఆధిపత్యం. లాభాలు కూడా కాలక్రమంలో మనకు స్వాతంత్ర్యం రావటం, అధికారిక లావాదేవీలన్నీ మన అధికారుల, నాయకుల హస్తగతం కావటంతో విదే శీయులకు లాభం కుంటుపడింది. ఈ రంగం నుంచి వారు తప్పుకోవటం, మన పాలకుల నిర్లక్ష్యంవల్ల ఆనాటి అపూర్వ అవకాశాలన్నీ కాలగర్భంలో కలిసిపోయాయి. అలసత్వం, అశ్రద్ధల కారణంగా మచిలీపట్నం ఓడరేవు 1980లో మూతపడింది.

గత కాలపు ఘనకీర్తిని ప్రవేశపెట్టాలనే తపన, తాపత్రయం కన్నా, నేటి అవస రాల ఆవశ్యకత దృష్ట్యా మచిలీపట్నం పోర్టు నిర్మాణం ప్రాముఖ్యతను సంతరించుకొంది. ఈ విషయాన్ని గత ముఖ్యమంత్రులు గ్రహించారు. అందుకవసరమైన చర్యలు ప్రారంభించారు. 2014లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడు మచిలీపట్నం ఓడరేవు నిర్మాణం ఒక ఛాలెంజ్‌గా తీసుకొని, నిర్మాణం పనులు వేగవంతం చేయాలని ఆదేశాలిచ్చారు. చాలాకాలంగా నాన్చుడు కు గురైన స్థలసేకరణకు తుది రూపు ఇస్తూ, 2014 ఆగస్టు 31న స్థలసేకరణ నోటిఫికే షన్ విడుదల చేశారు. ఆటంకాలు ఒక్కొక్కటిగా తొలగిపోయాయి. శంకుస్థా పన ముహూర్తం ఖరారైంది. ప్రస్తుత అంచనాల ప్రకారం రూ.11,924 కోట్లు ఖర్చుకు సిద్ధమైంది ప్రభుత్వం. మొదటి దశలో రూ.6,778 కోట్లు కాగా, రెండవ దశలో రూ.5,146 కోట్లు ఖర్చు చేయను న్నారు. రెండు దశల్లోనూ పోర్టు నిర్మాణంకు ఖర్చు ఈ విధంగా ఉంటుంది. 1. ప్రాజెక్టు ప్రిలిమినరీ అండ్ సైట్‌కి రూ.91 కోట్లు, 2. డ్రెడ్జింగ్‌కి రూ.2,297 కోట్లు, 3. బ్రేక్ వాటర్ రూ.817 కోట్లు, 4. బెర్త్స్‌కి రూ.2,662 కోట్లు, 5. స్థల అభివృద్ధి, స్టాక్ యార్డ్ నిర్మాణాలకు రూ.532 కోట్లు, 6. విద్యుత్ పరిక రాలకు రూ.213 కోట్లు, 7. యంత్ర పరికరాలకు రూ.3,772 కోట్లు, 8. అంతర్గత రోడ్లు, రైలు మార్గం నిర్మాణానికి రూ. 317 కోట్లు, 9. బాహ్య రైలు మార్గం నిర్మాణానికి రూ.30 కోట్లు, 10. ఇతర ఖర్చులకు రూ.567 కోట్లు, సర్వీస్ టాక్స్ కింద రూ.620 కోట్లు ఖర్చవుతుందని అంచనా.

-దాసరి ఆళ్వారస్వామి

పింఛన్ రూ.3 వేలు!

(మొదటిపేజీ తరువాయి)

లభించింది. తాను అధికారంలో వచ్చాక వృద్ధులకు నెలకు రూ. 3 వేల పెన్షన్ ఇస్తానని, నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెంచుతానని, రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ చేస్తానిని జగన్ ప్రకటించారు.



2014 ఎన్నికల సమయంలో ప్రధాని మోడీ, జనసేన అధినేత పవన్‌తో చంద్రబాబు కలిసి ఓ సినిమాలాంటి డ్రామా ఆడారని విమర్శించారు. నేను వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని, బాబు వస్తే జాబు వస్తుందని, రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని, ఇంటికో ఉద్యోగం ఇస్తానని... ఇలా వాగ్దానాలు చేసిన చంద్రబాబు తన అభివృద్దే చూసుకున్నారని ఆరోపించారు. చంద్ర బాబునాయుడు సీఎంగా 2014లో పగ్గాలు చేపట్టాక రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని ఆరోపించారు. జన్మభూమి కమిటీల పేరుతో గ్రామగ్రామానా అవినీతి పెరిగిపోయిందని, వారు చెప్పిందే ఆటగా, పాడిందే పాటగా జరిగిందన్నారు. మూడేళ్లలో పోలవరాన్ని పూర్తి చేస్తానని చెప్పి నేటికీ పూర్తి చేయక పోగా, జాతికి అంకితమంటూ ఓ పెద్ద అబద్ధం చెప్పారని జగన్ ఆరోపించారు. తాను పాదయాత్రల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలు, వైకాపా నవరత్నాలను సీఎం చంద్రబాబు పూర్తిగా కాపీ కొట్టారని జగన్ ఎద్దేవా చేశారు. నల్లచొక్కా నీడన డ్రామా ఆడుతున్నారని జగన్ పేర్కొన్నారు. ఎన్నికలకు మూడునాళ్ల ముందర చంద్రబాబు పసుపు-కుంకుమ అంటూ, పెన్షన్ల పంపిణీ అంటూ, రైతులకు తాను అండ అంటూ పేర్కొనడం నయవంచనగా జగన్ పేర్కొన్నారు. తాము అధికారంలోకి రామని తెలిసినా చంద్రబాబు బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో అక్రమ మార్గాల ద్వారా గెలిచేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని, రాష్ట్రంలో 59 లక్షల అక్రమ ఓట్లు వెంటనే తొలగించాలంటూ జగన్ డిమాండ్ చేశారు. అంతకుముందు జగన్ రేణిగుంట విమానాశ్రయం నుంచి నేరుగా తిరుపతి సమీపంలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలుగా చేరుకున్నారు అక్కడ జిల్లా వ్యాప్తంగా పార్టీలకు అతీతంగా పలువురు మేధావులు, విద్యావేత్తలు, తటస్థులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలువురి నుంచి సూచనలు సలహాలు అడిగి తెలుసుకున్నారు.

పేదల సంక్షేమం

(మొదటిపేజీ తరువాయి)

చేయి వేసుకుని హాయిగా ఉన్నారని అన్నారు. రుణమాఫీకి సంబంధించి ప్రధానిని ప్రాధేయపడినా ఆర్‌బిఐ నుంచి రుణం ఇవ్వకుండా అడ్డుకున్నారని, అయినా ఎన్ని ఇబ్బందులున్నా రుణమాఫీ చేశామన్నారు. ప్రభుత్వం చేపట్టిన కృషిఫలితంగా నేడు రాష్ట్రం 11 శాతం వృద్ధి రేటును సాధించిందన్నారు. జాతీయ స్థాయిలో కేవలం 2. 4 శాతం వృద్ధి రేటు మాత్రమే ఉందన్నారు. ఈనాలుగేళ్లలో రైతులకు 97 శాతం ఆదాయం పెంచగలిగామన్నారు. వాస్తవాలను ఎవరూ దాచలేరు.. అన్నదాత సుఖీభవ పథకానికి రూ. 5వేల కోట్లు కేటాయించామన్నారు. గత పాలకులు వ్యవసాయం దండగ అన్నారు... కానీ టిడిపి ప్రభుత్వం పండుగ చేసి చూపించిందన్నారు. ఈ 5 ఏళ్లలో వ్యవసాయ రంగానికి లక్ష కోట్లు ఖర్చు చేశామన్నారు. విత్తన భద్రత కల్పించాం..భూమిని సారవంతం చేశాం.. ఎన్నడూ లేని విధంగా కౌలు రైతులకు రూ. 9,200 కోట్ల రుణాలను అందించామన్నారు. రాబోయే కాలంలో వ్యవసాయంలో వృద్దిరేటును 15 శాతం దాకా సాధించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకుపోతామన్నారు. ప్రకృతి సేద్యాన్ని గణ నీయంగా ప్రొత్సహించామన్నారు. కర్నూలులో సీడ్ పార్కును తీసుకొస్తున్నామన్నారు. రాజకీయంగా , ఆర్థికంగా,సామాజికంగా అందర్నీ పైకి తీసుకొచ్చేందుకు వ్యవసాయం పండుగ పేరిట రైతులకు చెక్కులు ఇచ్చే కార్యక్రమాన్ని త్వరలో చేపట్టబోతున్నామన్నారు. 5 లక్షల మంది 5 లక్షల ఎకరాల్లో ఈ రకమైన సేద్యాన్ని చేస్తున్నారన్నారు. హార్టికల్చర్‌లో కూడా దూసుకుపోతున్నా మన్నారు. నదుల అనుసంధానంతో ముందుకు పోతున్నామన్నారు. ఇప్పటికే కృష్ణా - గోదావరి నదులను అనుసంధానించి, పట్టిసీమ ద్వారా నీటిని సాగునీటికి మళ్లించడంతో పాటు రాయలసీమకు సైతం నీటిని తీసుకువెళ్లిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు.



మరో వైపు పారిశ్రామిక ప్రగతిని సాధిస్తూ పెద్ద ఎత్తున యువతకు ఉద్యోగవకాశాలు కల్పిస్తూ పూర్తి భరోసా కల్పిస్తున్నా మన్నారు. గత పాలకులు రాష్ట్రా నికి పరిశ్రమలు రాకుండా వాటాల కోసం అడ్డుకున్నారని,పరిశ్రమలు పెట్టడానికి వచ్చిన వారిని బెధిరించారన్నారు. ఆ క్రమంలోనే వోక్స్ వ్యాగన్ కారు పరిశ్రమ రాష్ట్రానికి రాకుండా పూనేకు తరలిపోయిందన్నారు. కియో కార్ల పరిశ్రమలను అనంతపురంలో ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రమంలో టిడిపి ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలలో విశ్వసనీయత పెంచి,పెట్టుబడులు తీసుకొచ్చామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 10లక్షల50వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. 32 లక్షల మందికి ఉపాధికావకాశాలు కల్పించామన్నారు. భవిష్యత్‌లో మరో 14 లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయన్నారు. తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం నగరాలను ఐటీ హబ్‌లుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. మార్చి 1 నుంచి యువతకు రూ. 1000 నుంచి 2000లు ఇవ్వబోతున్నామన్నారు.

ఈనెల 9న ఇళ్ల పండుగ నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 11 లక్షల ఇళ్లు కట్టామని, 9న 4 లక్షల ఇళ్లల్లోకి పేదల చేత గృహ ప్రవేశాలు చేయించబోతున్నామన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షం అనేది లేకుండాపోయిందని, ప్రజా సమస్యలు పరిష్కరిస్తారని, వారిని ఎన్నుకుంటే ,అసెంబ్లీకి రాకుండా పారిపోయారన్నారు. కానీ అసెంబ్లీ మాత్రం రారు ..కానీ జీతాలు మాత్రం తీసుకుంటారు..టిఏల పేరుతో మీటింగులు పెట్టుకుంటారని ముఖ్యమంత్రి అన్నారు.

జూన్‌లో గ్రావిటీ ద్వారా పోలవరం నుంచి నీళ్లు

62 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టి, 19 ప్రాజెక్టులను ప్రారంభించామన్నారు. మరో నాలుగు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇంకో 26 ప్రాజెక్టులు వివిధ ధశల్లో ఉన్నాయన్నారు. ఇప్పటివరకు రూ. 64,330 కోట్లు ఖర్చు చేశామన్నారు. నవ్యాంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఇప్పటి వ రకు 65.04 శాతం పూర్తయిందన్నారు. ఎట్టిపరిస్థితుల్లోను డిసెంబర్ నెలాఖరు కల్లా పనులు పూర్తి చేసి, గ్రావిటీ ద్వారా జూన్ నెలలో పోలవరం నుంచి నీటిని విడుదల చేస్తామని అసెంబ్లీ సాక్షిగాచెబుతున్నానని స్పష్టంచేశారు. ఇంకా కేంద్రం నుంచిరూ. 3,800 కోట్లు రావాల్సి ఉందని, డీపీఆర్ -2కు ఇంతవరకు ఆమోదం తెలపకుండా ఇబ్బందిపెడుతున్నారన్నారు. కొంత మంది కళ్లుండి కబోదుల్లా మాట్లడుతున్నారని అన్నారు. ఒక్కసారి ప్రాజెక్టు వద్దకు వెళితే తెలుస్తుందన్నారు.

ముగ్గురు మోడీలది బూటకపు ఫ్రంట్

ముగ్గురు మోడీలు మోడీ,కేసీఆర్,జగన్‌లు కుమ్మక్కై బూటకపు ఫ్రంట్ పెట్టారన్నారు. మమత బెనర్జీపై సిబిఐ దాడులు జరిగితే జగన్,కేసీఆర్ ఖండించలేదంటే పరిస్ధితి అందరికీ తెలిసిందిపోయిందన్నారు. పిల్లిపాలు తాగుతూ ఎవరూ చూడడం లేదనుకుంటే ఎలా? వారి గురించి అంతా గమనిస్తూనే ఉన్నారన్నారు. కాపుల రిజర్వేషన్ గురించి జగన్‌కు పట్టదు కానీ రైతుల్ని రెచ్చగొట్టి,రైళ్లు తగలబెడతారని విమర్శించారు. 5 శాతం రిజర్వేషన్లను కాపులకు ఇచ్చిన ఘనత టిడిపికే దక్కిందన్నారు. మోడీ నల్లధనం వెనక్కి తీసుకువస్తానని, పేదల బ్యాంక్ ఖాతాల్లో 15లక్షలు వేయిస్తానన్నారు..మరి ఏమైందని ప్రశ్నించారు. బ్యాంకులను మోసం చేసి,దివాలా తీయించిన వారికి వీసాలు ఇప్పించి,దేశాన్ని దాటించారని అన్నారు. తాము మాత్రం రాష్ట్రంలో అగ్రిగోల్డ్ వ్యవహారంలో బాధితులను ఆదుకుంటున్నామని, వారికి రూ. 250 కోట్లు అందించనున్నామన్నారు.

కేసీఆర్, జగన్‌ల కలయిక ఫిక్స్

● 14న ముహూర్తం ● వైజాగ్‌లోనే ఇద్దరి భేటీ ● స్వరూపానందస్వామి ఆశ్రమమే వేదిక ● తెలుగు రాష్ట్రాల్లో ఆసక్తి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగురాష్ట్రాల రాజకీయాల్లో కీలక పరిణామంగా చెప్పుకునే తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు, ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిల భేటీకి ముహూర్తం ఖరారైందా? విశాఖ నగరంలోనే ఇద్దరు నేతలు కలవబోతున్నారా? తాజాగా టీఆర్ఎస్ వర్గాల్లో జరుగుతున్న చర్చ ప్రకారం ఈనెల 14వ తేదీన ఇరువురు నేతలు కలిసే అవకాశం ఉంది. విశాఖలో ఈనెల 10నుండి 14వ తేదీవరకు శారదాపీఠం వార్షికోత్సవాలు జరగను న్నాయి. ఈ కార్యక్రమానికి హాజరుకావాలంటూ కేసీఆర్‌కు ఆహ్వానం అందగా, ఇప్పటికే సీఎం కేసీఆర్ ఫిబ్రవరి 14న వెళ్తున్నట్లు అధికారికంగా షెడ్యూల్ కూడా ప్రకటించారు. ఇక వైసీపీ అధినేత జగన్‌కి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానం అందింది. శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామితో, కేసీఆర్‌తో, జగన్‌తో సత్సంబంధాలు ఉన్నాయి. తెలంగాణలో ఎన్నికలకు వెళ్ళేముందు ఎర్రవెల్లిలోని తన ఫామ్‌హౌజ్‌లో చండీయాగం నిర్వహించిన కేసీఆర్ ఇటీవల రెండోసారి ప్రభుత్వం ఏర్పడ్డాక శృంగేరి పీఠం సంప్రదాయం ప్రకారం సహస్రచండీయాగాన్ని నిర్వహించిన అమ్మవారి విగ్రహం ప్రతిష్టించారు. మరోవైపు జగన్ కూడా పాదయాత్ర ప్రారంభానికి ముందు శారదాపీఠానికి వెళ్ళి స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఫిబ్రవరి 10నుండి 14వరకు విశాఖలో జరిగే శారదాపీఠం వార్షికోత్సవాల్లో ఇరువురు నేతలు పాల్గొనబోతున్నారని సన్నిహితవర్గాల సమాచారం. వార్షికోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 14న నిర్వహించే పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొనబోతున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమం సందర్భంగా కేసీఆర్, జగన్ ఏకాంతంగా మాట్లాడుకునే అవకాశం ఉందని, ఇందుకు సంబంధించిన ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీని ఓడించేందుకు తన అనుభవం, పరిశీలనను రంగరించి పలు సూచనలు, సలహాలు జగన్‌కు కేసీఆర్ ఇచ్చే అవకాశముందని సమాచారం. తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో రెండోసారి విజయం సాధించిన అనంతరం ఏపీ సీఎం చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇస్తానని కేసీఆర్ చెప్పడం, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ బృందం జగన్‌తో భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. త్వరలోనే కేసీఆర్, జగన్ మాట్లాడుకుంటారని ప్రకటించగా అందుకు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. ఏపీ రాజకీయాల్లో టీడీపీకి వ్యతిరేకంగా పనిచేసే వారికి సహకరించాలని నిర్ణయించిన టీఆర్ఎస్ వైసీపీకి సహాయం అందిస్తామని బాహాటంగానే చెబుతోంది. ఏపీ రాజకీయాల్లో కేసీఆర్ ప్రత్యక్షంగా పాల్గొంటారా.. లేక వైసీపీకి సలహాలు, సూచనలు ఇచ్చేందుకు పరిమితం అవుతారా? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది. ఫెడరల్ ఫ్రంటే దేశానికి శరణ్యమని, రాష్ట్రాలు బలంగా ఉంటేనే దేశం పురోగమిస్తుందని జగన్ ఇటీవల అభిప్రాయపడ్డారు.

సౌత్‌లో దమ్మున్న నేత చంద్రబాబు

● అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు

అమరావతి, ఆంధ్రప్రభ : దక్షిణ భారతదేశంలో దమ్మున్న నాయకుడు చంద్రబాబునాయుడని, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన విలేఖరులతో బుధవారం మాట్లాడారు. రాష్ట్రాన్ని పాలించే వ్యక్తి సమర్ధుడై ఉండాలని, సమర్ధవంతమైన నాయకుని పాలన వల్లనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. చంద్రబాబు పాలనను చూసి ప్రతిపక్షాలు, బిజెపి వణుకుతున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ 13 జిల్లాలు అభివృద్ధి పథంలో ఉన్నాయని, మోడీ ప్రభుత్వం మాటపై నిలబడలేనందు వల్లనే ఏపీకి హోదా దక్కలేదన్నారు. మోడీ పశ్చిమ బెంగాల్‌లో వ్యవస్థలను ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. ఐఎఎస్ అధికారులు జైలుకెళ్లినందుకు ప్రధాన కారకుడు జగన్ అని అన్నారు. ఏపీ బడ్జెట్ అద్భుతంగా ఉందని ప్రజలు హర్షిస్తున్నారని ఆనందరావు అన్నారు.

రైతాంగ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● రుణమాఫీ, ఇన్‌పుట్ సబ్సిడీలతో దేశానికే ఆదర్శం ●మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

అమరావతి, ఆంధ్రప్రభ : వ్యవసాయంపై ఆధారపడి జీవనోపాధిని పొందుతున్న రైతుల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం దేశానికే ఆదర్శంతమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యే కార్యక్రమంలో గుంటూరు, తూర్పు గోదావరి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో రూ.21.47 కోట్ల నాబార్డ్, ఆర్‌ఐడీఎఫ్ నిధులతో నిర్మించిన నూతన విస్తరణ, పరిశోధన, కళాశాల భవన సముదాయాలను ప్రారంభించడంతోపాటు కొత్తగా నిర్మించబోతున్న వాటికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆకాంక్ష మేరకు వ్యవసాయ రంగాభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్‌ను ఏటా ప్రవేశ పెడుతున్నామని, గత ఏడాదికి మించి వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు రూ.21,480 కోట్లను కేటాయించి చరిత్ర సృష్టించామని చెప్పారు. సాగును మొదలు పెట్టినప్పటి నుంచి పంటను మద్దతు ధరకు అమ్ముకునేంత వరకు అన్నదాతలకు అవసరమైన సహాయ, సహకారాలు, ప్రోత్సహకాలు, రాయితీలు, తోడ్పాటును ప్రభుత్వం అందిస్తున్న ఫలితంగా ప్రతి పంటలో అధిక దిగుబడులను సాధిస్తూ రెండంకెల వృద్ధి రేటుతో దేశంలోనే అగ్రగామిగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వల్లభనేని దామోదర్ నాయుడు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, జడ్పీ ఛైర్‌పర్సన్ జానీమూన్, పాలక మండలి సభ్యులు కోటేశ్వరరావు, భవానీదేవి, గణపతిరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల బదిలీలు!


● 12 మంది ఐఏఎస్‌లకు స్థానచలనం ● ఏడుగురు ఐపీఎస్‌లకు కూడా... ● టీటీడీ జేఈవోగా లక్ష్మీకాంతం ● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి, ఆంధ్రప్రభ : సార్వత్రిక ఎన్నిక లకు ఈ నెలలోనే నోటిఫికేషన్ వస్తుందని భావిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఐఏఎస్, ఐసీఎస్‌ల బదిలీలు పెద్దెత్తున జరిగాయి. బుధవారం 12 మంది ఐఏఎస్ లను బదిలీ చేయగా, గత రెండు రోజులుగా ఏడు గురు ఐపీఎస్‌లను బదిలీ చేశారు. రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శిగా పని చేస్తున్న ముకేష్ కుమార్ మీనాను ఎక్సైజ్ శాఖ కమిషనర్‌గా బదిలీ చేశారు. ప్రస్తుతం ఎక్సైజ్ కమిష నర్‌గా విధులు నిర్వహిస్తున్న పి. లక్ష్మీనర సింహంను హ్యాండ్‌లూమ్స్, టెక్స్‌టైల్స్ కార్యదర్శిగా నియమించారు. అదే విధంగా హ్యాండ్ లూమ్స్, టెక్స్‌టైల్స్ కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీనివాస శ్రీనరేష్‌ను భూగర్భ గనులశాఖ కార్యదర్శిగా బదిలీ చేయగా, పశుసంవర్ధకశాఖ కార్యదర్శి బాధ్యతలను బి.శ్రీధర్‌కు అప్పగించారు. మరో వైపు కృష్ణాజిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న బి. లక్ష్మీకాంతంను ప్రతిష్టాత్మక తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్త కార్యనిర్వహణాధికారి(జేఈవో)గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో గుంటూరు జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎండీ ఇంతియాజ్‌కు కలెక్టర్‌గా పదోన్నతి కల్పిం చారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న కె. ధనుంజయ రెడ్డిని ఏపీ టూరిజం అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియ మించారు. ఇప్పటి వరకు సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులుగా ఉన్న ఎం.రామారావును శ్రీకాకుళం జిల్లాకలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం తితిదే జేఈవోగా పనిచేస్తున్న పోలా భాస్కర్‌ను సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులుగా నియమించారు. ప్రస్తుతం కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న విజయకృష్ణన్‌ను సాధారణ పరిపాలన శాఖ (జీఏడి) డిప్యూటీసెక్రటరీగా నియమించగా ఆమె స్థానంలో ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ, సీఈవోగా పనిచేస్తున్న కృత్తికా శుక్లాను నియమించారు. పర్యాటక శాఖ సంచాలకులుగా పనిచేస్తున్న హిమాన్షు శుక్లాను గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్రపునేఠ ఉత్తర్వులు జారీ చేశారు.

గుంటూరు ఐజీగా ఆర్పీ మీనా

రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల వ్యవధిలో ఏడుగురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేశారు. ఇద్దరు ఐజీలు, ఎస్పీతో పాటు నలుగురు నాన్ కేడర్ ఐపీఎస్‌లకు పోస్టింగ్ ఇచ్చారు. ఏపీఎస్పీ బెటాలియన్స్ ఐజీ రాజీవ్ కుమార్ మీనాను గుంటూరు ఐజీగా బదిలీ చేసి ఇక్కడున్న కెవి గోపాలరావును బెటాలియన్స్ ఐజీగా నియమించారు. విజయవాడ శాంతి భద్రతల విభాగం డీసీపీ డాక్టర్ గజారావు భూపాల్‌ను మంగళగిరి ఆరో బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ చేశారు. నాన్ కేడర్ ఎస్పీలైన ఇంటిలిజెన్స్ ఎస్పీ ఎ.వెంకటరత్నంకు శ్రీకాకుళం ఎస్పీగా, విజిలెన్స్ ఎస్పీ డి.కోటేశ్వరరావుకు విజయవాడ డీసీపీ(పరిపాలన), విశాఖపట్నం క్రైమ్స్ డీసీపీ ఎఆర్ దామోదర్‌కు విజయనగరం ఎస్పీగా, విజిలెన్స్ ఎస్పీ వి.హర్షవర్ధన రాజుకు విజయవాడ శాంతి భద్రతల విభాగం డీసీపీగా పోస్టింగ్ ఇచ్చారు.

18న ఆర్బీఐ బోర్డు సమావేశం



న్యూఢిల్లీ : రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సెంట్రల్ బోర్డు సమావేశం ఫిబ్రవరి 18కి వాయిదా పడింది. ఈ సమావేశంలో ప్రభుత్వానికి మధ్యంతర డివిడెండ్‌పై చర్చించాల్సి ఉంది. మధ్యంతర బడ్జెట్ 2019-20 తర్వాత బోర్డుకు ఇదే మొట్టమొదటి సమావేశం. ఈ సమావేశానికి ఆర్థికమంత్రి అధ్యక్షత వహిస్తారు. సంప్రదాయ ప్రకారం చూస్తే బడ్జెట్ ముగిసిన తర్వాత ఆర్‌బీఐ బోర్డు సమావేశం జరగాలి. వాస్తవంగా ఈ సమావేశం ఫిబ్రవరి 9వ తేదీన ఖరారు చేశారు. అయితే ఈ సమావేశాన్ని వాయిదా వేశారని విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఈ సమావేశంలోనే ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి మధ్యంతర డివిడెండ్ చెల్లించాల్సిందిగా ప్రభుత్వ విజ్ఞప్తిని పరిశీలిస్తుందని ఆ వర్గాలు చెబుతున్నాయి. ఈ బోర్డు సమావేశంలోనే ఆర్‌బీఐ మొదటి ఆరు నెలల ఖాతాలను ఆడిట్ చేసి ప్రభుత్వానికి మధ్యంతర డివిడెండ్ ఎంతవరకు బదిలీ చేయవచ్చో నిర్ణయిస్తారు. ఇదిలా ఉండగా ఆర్‌బీఐ జులై -జూన్‌ను ఆర్థిక సంవత్సరంగా పాటిస్తుంది. కాబట్టి డిసెంబర్ చివరి నాటికి ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థం ముగుస్తుంది. కాగా గత ఆర్థిక సంవత్సరం ఆర్‌బీఐ ప్రభుత్వానికి మధ్యంతర డివిడెండ్ కింది రూ.10వేల కోట్లు చెల్లించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ప్రభుత్వానికి రూ.40 వేల కోట్ల వరకు మధ్యంతర డివిడెండ్ జమ చేసింది. ఇప్పటికే ప్రభుత్వం భారీ ద్రవ్య లోటుతో సతమత మవుతోంది. మధ్యంతర బడ్జెట్‌లో 2019-20 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 3.4 శాతానికి ఎగబాకుతుందని అంచనా వేసింది. ప్రభుత్వం సంక్షేమ పథకాలకు పెద్దమొత్తంలో వ్యయం చేయడం, అదే సమయంలో రెవెన్యూ తగ్గడంతో ఆర్‌బీఐ నుంచి అదనపు నిధులను ఆశిస్తోంది.



వీల్స్ ఇండియా లాభం రూ.152 కోట్లు

చెన్నై : టీవీఎస్ గ్రూపునకు చెందిన వీల్స్‌ఇండియా డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం నికరలాభంలో 18.6 శాతంతో రూ. 15.3 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ. 12.9 కోట్లు నమోదు చేసింది. తొమ్మిది నెలల కాలానికి నికరలాభం 6.88 శాతం వృద్ధితో రూ.55.9 కోట్లకు చేరగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.52.30 కోట్లు ఆర్జించింది. రెవెన్యూ విషయానికి వస్తే క్యూ3లో 32.7 శాతం పెరిగి రూ.786 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.591.9 కోట్లని తెలిపింది. తొమ్మది నెలల కాలానికి రూ. 29 శాతం వృద్ధితో రూ.2,333.8 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.1,808.3 కోట్లని తెలిపింది. కాగా బోర్డు మధ్యంతర డివిడెండ్‌ను షేరుపై రూ.3.25 ప్రకటించింది.

లూపిన్ నష్టం రూ.152 కోట్లు

న్యూఢిల్లీ : ప్రముఖ ఔషధ దిగ్గజం లూపిన్ లిమిటెడ్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.152 కోట్లు నష్టాన్ని చవిచూసింది. బ్లడ్‌ప్రెషర్ ఔషధం కేసులో జనరల్ కోర్టు ఆఫ్ యూరోపియన్ యూనియన్‌లో బ్లడ్‌ప్రెషర్ కేసుపై రూ.342 కోట్లు జరిమానా విధించడంతో కంపెనీ నష్టపోయింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికరలాభం రూ.222 కోట్లు ఆర్జించింది. అమ్మకాలు మాత్రం 12.2 శాతం పెరిగి రూ. 4,370 కోట్లకు ఎగబాకాయి. అయితే క్రితం ఏడాదితో పోల్చు కుంటే ఒక శాతం రెవెన్యూ తగ్గింది. గత ఏడాది నుంచి అమెరికాలో ఔషధ నియంత్రణ సంస్థల వల్ల అమ్మకాలు మందగించాయని కంపెనీ ఎండీ నీలేష్ గుప్తా చెప్పారు.

వోడాఫోన్-ఐడియా నష్టం రూ.5005 కోట్లు


న్యూఢిల్లీ : టెలికం ఆపరేటర్ వోడాఫోన్ ఐడియా డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత నికర నష్టం రూ.5,005.7 కోట్లు నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికరనష్టం రూ.1,284.5 కోట్లుగా ప్రకటించింది. అయితే క్రితం ఏడాది ఫలితాలను డిసెంబర్ త్రైమాసికం ఫలితాలో పోల్చి చూడరాదని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. కాగా వోడాఫోన్, ఐడియాలో గత ఏడాది ఆగస్టు 31, 2018న విలీనం అయ్యాయి. త్రైమాసికం ప్రాతిపదికన చూస్తే నష్టాలు భారీగా పెరిగాయి. మొత్తం ఆదాయం విషయానికి వస్తే డిసెంబర్ త్రైమాసికంలో రూ.11,982.8 కోట్లకు ఎగబాకగా..అదే జులై - సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.7,876.6 కోట్లతో పోల్చుకుంటే 52 శాతం వృద్ధి కనిపించింది. కాగా విలీనం ప్రభావం ఫలితాలు అనుకూలంగా కనిపిస్తున్నాయని.. మార్చి చివరి నాటికి పూర్తిస్థాయిలో మెరుగైన ఫలితాలను ఆశించవచ్చునని వోడాఫోన్ ఐడియా సీఈవో బాలేష్ శర్మ చెప్పారు. ఏడాది క్రితం ఏడాది త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆదాయం రూ.6,551.6 కోట్లని తెలిపింది. 4జీ నెట్‌వర్కును జిల్లాస్థాయికి విస్తరించాలని చూస్తున్నామని నెట్‌వర్కును మరింత విస్తరిస్తామని శర్మ అన్నారు. కస్టమర్లకు వినూత్నమైన సేవలందించి తిరిగి తమ స్థానాన్ని పదిలం చేసుకుంటామన్నారు.

ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్‌కు
రెండు గ్లోబల్ అవార్డులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మేనేజ్‌మెంట్ విద్యలో పేరుగాంచిన ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్ గ్లోబల్ అవార్డులు, గుర్తింపును పొందింది. కెనడాకు చెందిన కాంకార్డియా యూనివర్సిటీ నిర్వహించిన ఒక కార్యక్రమంలో జాన్ మోల్సన్ ఎంబీఏ కేస్ రైటింగ్ కాంపిటేషన్‌లో రెండు ప్రతిష్టాత్మక అవార్డులు వచ్చాయి. డిస్నీ ఎంటర్స్ స్ట్రీమింగ్‌స్పేస్.. కెనెట్ డిస్రప్ట్ ది డిస్రప్టర్ అన్న అంశంపై జరిగిన కాంపిటేషన్‌లో ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్ డీన్ డాక్టర్ దేవరతిమ్ పుర్కయాస్త, సయ్యద్ మసీహా తృతీయ బహుమతి పొందారు. మరో పోటీలో పోర్టు టు ప్లేట్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ - విల్ ప్రెస్కీ ఫీషెస్ సప్లయ్ చైన్ మోడల్ సస్టైయిల్ గ్రోత్ అన్న అంశంపై ఇందు పీరేపు, కేబీఎస్ కుమార్ షార్ట్ కేస్ కాంపిటేషన్‌లో మరో బహుమతి గెలుచుకున్నారు.

అంచనాలను మించిన కాగ్నిజెంట్

- క్యూ 4 రెవెన్యూ 4.13 బి. డాలర్లు
- కొత్త సీఈవోగా బ్రియాన్ హంప్రీస్



చెన్నై : టెక్నాలజీ దిగ్గజం కాగ్నిజెంట్ రెవెన్యూ వాల్‌స్ట్రీట్ అంచనాలను మించిపోయింది. హెల్త్‌కేర్, ఫైనాన్షియల్ ఇండస్ట్రీస్ క్లయింట్లు పెద్దమొత్తంలో చేరడంతో దాని ప్రభావం రెవెన్యూపై కనిపించింది. 2007 నుంచి కొనసాగుతున్న సీఈవో ఫ్రాన్సిస్కో డిసౌజా స్థానంలో కొత్త సీఈవో బాధ్యతలు స్వీకరించనున్నారని కాగ్నిజెంట్ ఒక ప్రకటనలో తెలిపింది. డిసౌజా కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. వోడాఫోన్ బిజినెస్ సీఈవో బ్రియాన్ హంప్రీస్ ... సీఈవో డిసౌజా నుంచి ఏప్రిల్ 1 నుంచి కొత్త సీఈవో బాధ్యతలు స్వీకరిస్తారని ప్రకటనలో వివరించింది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ నికరలాభం 648 మిలియన్ డాలర్లని, క్రితం ఏడాది ఇదే డిసెంబర్‌తో ముగిసిన చివరి త్రైమాసికంలో 18 మిలియన్‌లు నష్టాన్ని చవిచూసినట్లు తెలిపింది. రెవెన్యూ విషయానికి వస్తే ఏకంగా 4.13 బిలియన్ డాలర్లకు ఎగబాకింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 3.83 బిలియన్ డాలర్లు నమోదు చేసింది. మార్కెట్ విశ్లేషకుల అంచనా 4.11 బిలియన్ డాలర్ల కంటే కాస్తా ఎక్కువగానే నమోదు చేసింది.

ఇదిలా ఉండగా కాగ్నిజెంట్ మొట్టమొదటిసారి బయటి వ్యక్తిని కొత్త సీఈవోగా నియమించింది. బ్రియాన్ హంప్రీస్ ఏప్రిల్ 1 నుంచి బాధ్యతలు చేపడతారు. కాగ్నిజెంట్ ప్రెసిడెంట్ రాజీవ్ మెహతా ఏప్రిల్ 1 నుంచి తప్పుకుంటున్నారు. ఇప్పటి వరకు కంపెనీ వ్యక్తినే సీఈవోగా తీసుకుంటారన్న ఊహాగానాలకు దీంతో తెరపడింది. హంప్రీస్ విషయానికి వస్తే ఆయన డెల్ నుంచి వోడాఫోన్‌కు మారారు. అంతకంటే ముందు ఆయన హెవ్లెట్ ప్యాకెర్డులో సీనియర్ వైస్‌ప్రెసిడెంట్‌గా పనిచేశారు. అంతకు ముందు కాంపాక్‌లో పనిచేసిన అనుభవం ఉందని కంపెనీ వెల్లడించింది.

పెబ్స్ పెన్నార్ రెవెన్యూ రూ.180 కోట్లు

హైదరాబాద్ : పెన్నార్ ఇంజినీర్డ్ బిల్డింగ్ సిస్టమ్స్ (పెబ్స్ పెన్నార్) లిమిటెడ్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం ఫలితాలతో పాటు డిసెంబర్‌తో ముగిసిన తొమ్మిది నెలల ఫలితాలను వెల్లడించింది. క్యూ3 ఫలితాల విషయానికి వస్తే గరిష్ఠ రెవెన్యూ రూ.180.47 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.44.84 కోట్లు రెవెన్యూలో 33.06 శాతం వృద్ధి కనిపించింది. నికర రెవెన్యూ విషయానికి వస్తే రూ.154.21 కోట్లు కాగా క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.38.30 కోట్లు.. రెవెన్యూలో 33.04 శాతం వృద్ధి కనిపించింది. పన్ను చెల్లించిన తర్వాత నికర లాభం రూ.2.72 కోట్లు కాగా.. క్రితం ఏడాది రూ. 0.62 కోట్లతో పోల్చుకుంటే 29.44 శాతం వృద్ధి కనిపించింది. తొమ్మిది నెలల కాలానికి చూస్తే గరిష్ఠ రెవెన్యూ రూ. 466.19 కోట్లు కాగా క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.40.41 కోట్లు.. నికర రెవెన్యూ రూ. 401.94 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.33.88 కోట్లతో పోల్చుకుంటే 9.21 శాతం వృద్ధిని సాధించింది. పన్ను చెల్లించిన తర్వాత నికరలాభం రూ. 5.17 కోట్లని కంపెనీ వైస్ ప్రెసిడెంట్, కార్పొరేట్ స్ట్రాటజీ కె ఎం సునీల్ ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీకి కొత్తకొత్త ఆర్డర్లు రావడంతో రాబోయే త్రైమాసికాల్లో మంచి ఫలితాలను సాధిస్తామన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు.

రూపీకి మూడింది!

- కార్వీ అధ్యయనం వెల్లడి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఈ ఏడాది చివరి నాటికి డాలర్ మారకంతో రూపాయి మరింత బక్కచిక్కి 78మార్కును దాటిపోతుంది. దీనికి ప్రధాన కారణం ఒకటి పెరిగిపోతున్న ద్రవ్యలోటు.. రెండోది కరెంటు ఖాతా లోటు... ఈ రెండు కలిసి రూపాయిపై ఒత్తిడి పెంచి ఏడాది చివరి నాటికి రూపాయిని మరింత బలహీనపర్చే అవకాశం ఉందని కార్వీ వార్షిక కమాడిటి, కరెన్సీ నివేదిక -2019లో వివరించింది. మొత్తానికి కమాడిటీ.. కరెన్సీ మార్కెట్‌కు ఈ ఏడాది 'మిశ్రమ సంవత్సరంగా' ఉంటుందని చెప్పవచ్చునని నివేదికలో తేల్చి చెప్పింది.

ఎన్నికల సంవత్సరం కాబట్టి ప్రైవేట్ పెట్టుబడులు పెద్దగా రావని, దీంతో కరెంటు ఖాతా లోటు లేదా బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్ (బీపీవో) ఈ ఏడాది ద్వితీయార్థంలో కూడా మెరుగుపడే పరిస్థితి కనిపించడం లేదని కార్వీ కమాడిటీస్, కరెన్సీ సీఈవో రమేష్ వార్దేకర్ చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో క్యాడ్ లేదా కరెంటు ఖాతాలోటు (-) 34.94 బిలయన్ డాలర్లకు చేరితే.. 2017-18 ఆర్థిక సంవత్సరం మొత్తానికి చూస్తే (-)48.72 బిలియన్ డాలర్లుగా తేలింది. ఇదే పరిస్థితి కొనసాగితే ఈ ఆర్థిక సంవత్సరం 2018-19 నాటికి కరెంటు ఖాతాలోటు మరింత పెరగడం ఖాయ మని నివేదికలో పేర్కొంది.

ఇదిలా ఉండగా ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్సుల్ (బీఓపీ) (-)13.20 బిలియన్ డాలర్లకు చేరగా... 2011-12 సంవత్సరం తర్వాత మొట్టమొదటిసారి నెగెటివ్‌కుకు చేరిందని.. చివరగా బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్ (-)20.08 బిలియన్ డాలర్లు 2009 ఆర్థిక సంవత్సరంలో ఏర్పడిందని.. అప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆర్థి కమాంద్యం ఏర్పడింది కాబట్టి బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్‌లో వ్యత్యాసాన్ని సమర్థించకోవచ్చునన్నారు.

పతనానికి చమురు ధరలే కారణమా?

వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడుతోందనన్న రాజకీయ అస్థిరత, ఆర్థిక లోటుతో ఈ ఏడాది చివరి నాటికి రూపాయి విలువ గణనీయంగా పడిపోయి డాలర్ల విలువ రూ.78కి చేరనుంది. అలాగే ఎగుమతులకన్నా దిగుమతులు గణనీయంగా పెరగడం అంతర్జాతీయ చమురు మార్కెట్లు క్రూడాయిల్ ధరలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నందున రూపాయి విలువ పడిపోయే అవకాశాలున్నాయని కార్వీ కన్సల్టెన్సీ అధ్యయనం పేర్కొంది. కరెంట్ అకౌంట్ ఖాతాలో ప్రతికూల ఫలితాలు ఏర్పడి ఆర్థిక లోటు ఎదుర్కోవలసిన పరిస్థితి వస్తుందని తెలిపింది. ఆర్థిక వ్యవస్థలో వచ్చే మార్పులు, ఒడిదుడుకులపై అధ్యయనంచేసి కమోడిటీస్, ద్రవ్య నివేదిక 2019ని బుధవారం విడుదల చేసింది.

చమురు ఉత్పత్తుల కోతకో తగ్గనున్న విదేశీ పెట్టుబడులు

రష్యా, ఒపెక్ దేశాలు చమురు ఉత్పత్తిని తగ్గించడంతో ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు కొరత ఏర్పడి వాటి ధరలు గణనీయంగా పెరుగుతాయని పేర్కొంది. ప్రతికూల పరిస్థితుల్లో రూపాయి విలువ రూ.74కు పడిపోతే, అది ఈ ఏడాది చివరి నాటికి రూ.78కి చేరుతుంది. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ), విదేశీ ప్రత్యక్షపెట్టుబడిదారులు (ఎఫ్‌డీఐ) భారతీయ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు సన్నగిల్లుతాయి. కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం ఏర్పడి రాజకీయ అస్థిత్వం లేకుంటేనే విదేశీ పెట్టుబడులు వస్తాయనిస్పష్టం చేసింది. ఈ పరిణామం ఎన్నికలు జరిగిన ప్రతి సంవత్సరంలో కూడా పరిశీలించామని కార్వీ కమోడిటీస్ అండ్ కరెన్సీస్ సీఈవో రమేష్ వరఖేద్కర్ చెప్పారు.

చైనా-అమెరికా వాణిజ్య యుద్ధంతో భారత్‌కు లబ్ధి

ఈ ఏడాది కాటన్ ఎగుమతులకు మంచి డిమాండ్ ఉంటుందని, వీటి ధరలు నిలకడగా ఉంటాయని ఆ అధ్యయనం వెల్లడించింది. అమెరికా, చైనాల మధ్య ఉన్న వాణిజ్య ఆందోళనతో పత్తి ఎగుమతులకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. ఈ రెండు దేశాలమధ్య ఉన్న వాణిజ్య యుద్ధం కారణంగా బేస్‌మెటల్స్ 2018లో ప్రభావితమయ్యాయి. నవంబర్ చివరిలో జరిగిన జీ20 సమావేశంలో ఈ రెండు దేశాలు 90 రోజులపాటు అదనపు సుంకాలు వేయకుండా ఒప్పందం చేసుకున్నాయి. అంతర్జాతీయంగా ఆర్థికాభివృద్ధిపట్ల ఆందోళనల నడుమ 2019లో బేస్‌మెటల్స్‌కు ఒత్తిడి కొనసాగే అవకాశం ఉందని ఆ అధ్యయనం పేర్కొంది.

పెట్టుబడులకు బంగారం శ్రీరామరక్ష

అంతర్జాతీయంగా మార్కెట్ ఒడిదుడుకుల నేపథ్యంలో ఈ ఏడాది బులియన్ నామ సంవత్సరంగా నిలువనుంది. ఈ ఏడాది బంగారం, వెండికి మంచి డిమాండ్ పెరుగుతోంది. చిన్న, మధ్య తరహా ఇన్వెస్టర్లు బంగారంపై పెట్టుబడులను సురక్షితంగా భావించడంతో ఈ కమోడిటిస్‌కు మంచి ఆదరణ లభిస్తోంది. వ్యవసాయ కమోడిటీస్‌పై సరఫరా, డిమాండ్, వాతావరణం, ప్రభుత్వ విధానాలైన ఎంఎస్‌పీ, సేకరణ, ధరలు, పన్నులు ప్రభావం చూపనున్నాయి. దీంతో వచ్చే కాలంలో వ్యవసాయ ఉత్పత్తులపై దేశీయ డైనమిక్స్ ధోరణిని నిర్దేశించడంతో పాటు అమెరికా - చైనా మధ్య ఉన్న వాణిజ్య ఆందోళనలు వీటి ధరల నిర్ణయంలో మూడో కోణాన్ని ఆవిష్కృతం చేయనున్నాయని రమేష్ పేర్కొన్నారు.

ఐటీ ఫైలింగ్‌కు.. ఆధార్ లింకేజీ తప్పనిసరి

- సుప్రీంకోర్టు తాజా తీర్పు



న్యూఢిల్లీ : ఆదాయపు పన్ను రిటర్న్స్ ఫైల్ చేయడానికి పాన్‌తో ఆధార్ లింకేజీ తప్పనిసరి అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ధర్మాసనం న్యాయమూర్తులు ఎకె సిక్రీ, ఎస్ అబ్దుల్ నాజీర్‌లు ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 139ఏఏను యధాతథంగా కొనసాగించాలని నిర్ణయించారు.

ఇదిలా ఉండగా ఢిల్లీ హైకోర్టు ఆర్డర్‌ను సవాలు చేస్తూ.. కేంద్రం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కేసుపూర్వాపరాల విషయానికి వస్తే.. ఢిల్లీ హైకోర్టు శ్రేయాసేన్, జయశ్రీ సట్‌పుటేలను 2018-19 ఆర్థికసంవత్సరం ఆదాయపు పన్నురిటర్న్స్‌ను పాన్ కార్డుతో ఆధార్ లింకేజీ లేకుండా అనుమతించింది. ఢిల్లీ కోర్టు ఆర్డర్‌ను కేంద్ర ప్రభుత్వం సుప్రీంలో సవాలు చేసింది. సుప్రీంకోర్టు ఆదాయపు పన్ను చట్టంలో సెక్షన్ 139ఏఏను యధాతథంగా కొనసాగించాలని తీర్పు ఇచ్చింది. దీన్నిబట్టి ఆదాయపు పన్ను రిటర్న్స్ ఫైల్ చేయాలనుకుంటే పాన్‌తో ఆధార్ తప్పని చేయాల్సిందేనని బెంచ్ స్పష్టం చేసింది. ఢిల్లీ హైకోర్టు ఆర్డర్ ప్రకారం ఇద్దరు పిటిషనర్లు 2018-19 ఆర్థిక సంవత్సరానికి పాన్‌తో ఆధార్ లింకేజీ లేకుండా ఫైల్ చేశారు. కాబట్టి వచ్చే ఆర్థిక సంవత్సరం 2019-20 నుంచి ఆదాయపు పన్ను రిటర్న్స్ ఫైల్ చేయాల్సిన వారు తాజా సుప్రీంకోర్టు తీర్పును అనుసరించాలని.. పాన్‌తో ఆధార్‌తప్పని సరి చేయాల్సిందేనని సుప్రీం ధర్మాసనం ఆర్డర్ జారీ చేసింది. సోమవారం నాడు సుప్రీం కోర్టు ప్రత్యేక లీవ్ పిటిషన్‌ను స్వీకరించి తాజా తీర్పుతో ముగించింది.

ఇదిలా ఉండగా ఇద్దరు పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయిస్తూ.. పాన్‌తో ఆధార్ లింకజీ ఆర్డర్లు ఉన్నా తాము పలు మార్లు ఐటీఆర్ ఫైల్ చేయాలనుకున్నా.. ఈ-ఫైలింగ్ చేసేటప్పుడు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ అందుబాటులో లేదని వెబ్‌సైట్‌లో చూపించిందని పిటిషనర్లు కోర్టుకు తెలియజేశారు. ఇదిలా ఉండగా సుప్రీంకోర్టు గతేడాది సెప్టెంబర్ 26వ తేదీన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసు కొచ్చిన ఆధార్ స్కీం చట్టబద్ధంగా చెల్లుబాటు అయినా.. కొన్ని సేవలకు అవసరం లేదని.. ఉదాహరణకు బ్యాంకు ఖాతాలు తెరడానికి, మొబైల్‌ఫోన్ కనెక్షన్‌కు, స్కూలు అడ్మిషన్‌కు అవసరం లేదని తేల్చి చెప్పింది. ఇదిలా ఉండగా ఐదుగురు సభ్యులు ధర్మాసనం మాత్రం ఆదాయపు పన్ను రిటర్న్స్ ఫైల్ చేయాలంటే ఆధార్ తప్పనిసరని.. అయితే బ్యాంకు ఖాతాలకు, టెలికం సర్వీసులకు పాన్ కార్డు అనుసంధానం చేయాలనే నిబంధన ఏమీ లేదని తీర్పు ఇచ్చింది.

ఆరు నెలల్లో 'రియల్ బూమ్'

- రియల్ ఎస్టేట్‌లోనే అధిక రాబడి
- ఇన్వెస్టర్ల మొగ్గు అటువైపే
- నైట్‌ఫ్రాంక్, ఫిక్కీ అధ్యయనం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రస్తుత క్యాలెండర్ సంవత్సరం 2019లో రియల్ ఎస్టేట్ రంగం సానుకూలంగా విస్తరించనుంది. భవిష్యత్ పెట్టుబడుల కింద ఇన్వెస్టర్లు రియల్ ఎస్టేట్ రంగానికే అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఈ రంగంపైనే ఎక్కువ ఫలితాలు వస్తాయని ఆశించి మదుపరులు మొగ్గు చూపుతారని నైట్‌ఫ్రాంక్-ఫిక్కీ సంయుక్త అధ్యయనంలో పేర్కొన్నాయి. రియల్ ఎస్టేట్ రంగం అన్ని వేళలా లాభదాయకమైనదని నైట్‌ఫ్రాంక్ గతంలో అనేక అధ్యయనాల్లో పేర్కొన్న విషయం గమనార్హం.

రియల్ ఎస్టేట్ రంగం పనితీరు, ఈ రంగంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తల పెట్టుబడుల పురోగతిపై బుధవారం ఒక అధ్యయన నివేదిక విడుదల చేసింది. భారతీయ రియల్ ఎస్టేట్ రంగంలో ప్రముఖమైన 150 మంది బిల్డర్లు, రియల్టర్స్ అభివృద్ధి, ఆర్థిక అంశాలను దృష్టిలో ఉంచుకుని అధ్యయనం చేసింది. ఈ రంగానికి సంబంధించి 2017లో రూపొందించిన సంస్కరణల అమలు ఆధారంగా ఈ ఏడాది మొదటి ఆరు నెలలు వేగంగా పురోగతి చెందుతుందని పేర్కొంది. అయితే గత ఏడాది మార్కెట్ కొద్ది మేరకు మందగించి మళ్ళీ పుంజుకోవడంతో ఇన్వెస్టర్లు ధరల తగ్గుతాయన్న భావనతో వేచిచూసే ధోరణిలో ఉన్నారని పేర్కొంది. దీంతో గత ఏడాది చివరి త్రైమాసికంలో కొనుగోళ్ళలో కొంచెం వేగం తగ్గినప్పటికీ ఈ ఏడాది మళ్ళీ వేగం పుంజుకునే అవకాశాలు ఉన్నాయని ఫిక్కీ, నైట్‌ఫ్రాంక్ అధ్యయనం పేర్కొంది. ధరల పెరుగుదలతో ఇన్వెస్టర్లు వెనకడుగు వేయడంతో ఆరు నెలల పాటు మళ్ళీ ధరలు పెరిగే అవకాశం లేనందున కొనుగోళ్ళకు మొగ్గు చూపుతారని పేర్కొంది.

రియల్ ఎస్టేట్ రంగంపట్ల ఇన్వెస్టర్లకు ఎల్లప్పుడు సానుకూల స్పందనే ఉంటుందని, ఇందులో పెట్టుబడులకు ఎక్కువ మంది మొగ్గు చూపారని తమ అధ్యయనంలో తేలిందని నైట్‌ఫ్రాంక్ ఇండియా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శశిర్ బైజాల్ చెప్పారు. పెరిగిన ధరలతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ తగ్గిందని, ఈ రంగంలోనే అధిక రాబడి వస్తుందని ఎక్కువ మంది అభిప్రాయం వ్యక్తంచేశారని చెప్పారు. రెసిడెన్షియల్, ఆఫీస్ స్పేస్‌లో పెట్టుబడులకు సమానంగా మొగ్గు చూపారని ఆయన అన్నారు. ఆర్థిక వ్యవస్థ ఒడిదుడుకులు, వచ్చే సాధారణ ఎన్నికల్లో రాజకీయ స్థిరత్వంపై ప్రజల్లో విశ్వాసం కల్పించలేకపోయినందునే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో మార్కెట్ మందగించింది. మార్కెట్లో ధరలు స్థిరీకరిస్తే రెసిడెన్షియల్ ప్లాట్స్ కొనుగోలు చేసేందుకు ఎక్కువమంది మొగ్గు చూపారని శశిర్ బైజాల్ చెప్పారు.

డిపాజిట్ల సేకరణలో ప్రైవేట్ బ్యాంకుల హవా!

- క్రిసిల్ రేటింగ్ అంచనా

ముంబై : బ్యాంకులు పెద్ద మొత్తంలో రుణాలు ఇవ్వాలనుకుంటే బ్యాంకుల వద్ద డిపాజిట్లు భారీగా పెరగాలి. 2020 నాటికి సుమారు రూ.20 లక్షల కోట్ల కంటే ఎక్కువ మొత్తంలో డిపాజిట్లు పెరిగితే వడ్డీరేట్లు కూడా పెంచుకోవచ్చునని దేశీయ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ తాజా నివేదికలో వెల్లడించింది. అయితే డిపాజిట్లు సేకరించడంలో ప్రైవేట్ రంగానికి చెందిన బ్యాంకులు ముందున్నాయి. సుమారు 60 శాతం డిపాజిట్లు ప్రైవేట్ బ్యాంకులు వసూలు చేస్తున్నాయి.

గత కొన్ని సంవత్సరాల నుంచి బ్యాంకు డిపాజిట్లు క్రమంగా తగ్గు ముఖం పడుతున్నాయి. దీనికి ప్రధాన కారణం ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్ డీ)పై బ్యాంకులు వడ్డీరేట్లు తగ్గించడమే. బ్యాంకు వడ్డీలతో పోల్చుకుంటే ఇతర చోట్ల మదింపు చేస్తే ఎక్కువ వడ్డీరేటు గిట్టుబాటు అవుతుందన్న కారణంతో ఆమ్‌ఆద్మీ బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీరేటు గిట్టుబాటు అవుతుందో అక్కడే మదుపు చేయడానికి మొగ్గుచూపుతున్నాడు. గత కొన్ని సంవత్సరాల నుంచి చూస్తే బ్యాంకులు సరాసరి ఏడాదికి రూ.7 లక్షలకోట్ల కంటే ఎక్కువ డిపాజిట్లు సేకరించిన దాఖలాలు కనిపించడం లేదు. దీనికి ప్రధాన కారణం బ్యాంకులు ఇచ్చే వడ్డీ ఆఫర్ చాలా తక్కువ కాబట్టి డిపాజిటర్లు ప్రత్యామ్నాయమార్గాలు వెతుక్కుంటున్నారు.

ప్రస్తుతం స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకులకు గురికావడంతో దాని అనుబంధ మార్కెట్లు.. మ్యుచువల్‌ఫండ్స్, బాండ్లు తదితర మార్కెట్లలో పెట్టుబడులు మందగించాయి. ఇటీవల ప్రభుత్వం బ్యాంక్ డిపాజిట్ రేట్లను పెంచడంతో తిరిగి బ్యాంక్ డిపాజిట్లకు డిమాండ్ పెరిగే అవకాశాలున్నాయని క్రిసిల్ నివేదికలో వెల్లడించింది.

గత కొన్ని నెలల నుంచి చూస్తే డిపాజిట్ రేట్లు సరాసరి 0.40 శాతం నుంచి 0.60 శాతం వరకు పెరిగాయి. దీంతో బ్యాంకులకు నిధుల సేకరించడానికి పెద్దమొత్తంలో వ్యయం చేయాల్సి వస్తుందని క్రిసిల్ డైరెక్టర్ రమాపటేల్ చెప్పారు.

గత అనుభవాలను పరిగణనలోకి తీసుకొంటే బ్యాంకుల వద్ద ఉన్న అదనపు నిధులను ప్రభుత్వం సెక్యూరిటీల్లో పెట్టాల్సి వస్తోంది. అదీ కాకుండా చట్టబద్ధ ద్రవ్యనిష్పత్తి (ఎస్ఎల్ఆర్) ప్రకారం నాలుగు శాతం వరకు ఆర్‌బీఐ వద్ద డిపాజిట్ చేయాల్సి వస్తోంది. దీంతో పాటు అదనపు నిధులు ఉన్నా బాండ్లలో బ్యాంకులు డిపాజిట్ చేసి వడ్డీలు రాబట్టు కుంటాయి.

క్రిసిల్ అంచనా ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం, వచ్చే ఆర్థిక సంవత్సరం రుణాల డిమాండ్ 13 నుంచి 14 శాతం వరకు ఉంటుందని అంచనా వేశాయి. అంతకు ముందు 2018 ఆర్థిక సంవత్సరంలో 8 శాతం మాత్రమేనని వెల్ల డించింది. అలాగే డిపాజిట్లలో 10 శాతం వృద్ధిని ఆశించవచ్చునని.. గత ఆర్థిక సంవత్సరం డిపాజిట్లలో ఆరు శాతం మాత్రం వృద్ధి కనిపించింది. 2007 ఆర్థిక సంవత్సరంలో గతంలో ఎన్నడూలేని విధంగా డిపాజిట్ రేటు ఏకంగా 25 శాతం వృద్ధి కనిపించింది. క్రిసిల్ సీనియర్ డైరెక్టర్ కృష్ణన్‌సీతారామన్ అంచనా ప్రకారం ఈ ఆర్థికసంవత్సరం క్రెడిట్ టూ డిపాజిట్ నిష్పత్తి 78 శాతానికి ఎగబాకే అవకాశాలున్నాయని.. మార్చి 2017 నాటికి ఇది 73 శాతమని తెలిపారు. మార్చి 2020 నాటికి ఇది దశాబ్దం గరిష్టానికి 80 శాతానికి ఎగబా కుతుందని అంచనా వేశారు.

ప్రైవేట్ బ్యాంకుల బ్యాలెన్స్‌షీట్లు బలంగా ఉండటంతో పాటు రుణాల డిమాండ్‌తో పాటు డిపాజిట్లు కూడా క్రమంగా పెరుగుతున్నా యి. డిపాజిట్ల సేకరణలో 55-60 శాతం వరకు ప్రైవేట్ బ్యాంకులు సేకరిస్తున్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులు 30-35 శాతం వరకు మాత్రమే సేకరించగలిగాయి. అలాగే ప్రైవేట్ బ్యాంకుల మొత్తం డిపాజిట్లు చూస్తే ఏకంగా 30 శాతం పెరి గాయి. గత ఐదు సంవత్సరాల సరాసరి చూస్తే 7 శాతం వరకు పెరిగా యని క్రిసిల్ నివేదికలో వివరించింది.

నిఫ్టీ @ 11,000

ముంబై: స్టాక్ మార్కెట్లో బుధవారం నాడు ర్యాలీ ఏర్పడింది. సెన్సెక్స్ 358 పాయింట్లు, నిఫ్టీ కీలకమైన 11వేల పాయింట్ల మార్కును దాటిపోయింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఆర్‌బీఐ ద్రవ్య పరపతి సమీక్షలో వడ్డీరేట్ల తగ్గింపు జోలికి పోకపోయినా.. యధాతథంగా కొనసాగించేఅవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న అంచనాతో మార్కెట్లో ర్యాలీ ఏర్పడింది. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 358.42 పాయింట్లు లాభపడి 36,975.23 పాయింట్లకు ఎగబాకగా నిఫ్టీ 128.10 పాయింట్ల లాభంతో 11,062.45 వద్ద ముగిసింది. ఆర్‌బీఐ ద్రవ్యపరపతి సమీక్షవిధాన నిర్ణయాలు గురువారం నాడు వెల్లడికానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఆర్‌బీఐ ద్రవ్యపరపతి సమీక్ష మంగళవారం నుంచి మొదలైంది. మార్కెట్ విశ్లేషకుల అంచనా ప్రకారం ఈ సారి వడ్డీరేట్ల జోలికిపోకుండా న్యూట్రల్‌గా అంటే యధతథంగా కొనసాగించే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ప్రస్తుతం ద్రవ్యోల్బణం అదుపులోకి రావడంతో పాటు వడ్డీరేట్లు తగ్గించే అవకాశాలున్నా.. ముడిచమురు ధరలు తిరిగి పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం ఆర్‌బీఐ వడ్డీరేట్ల పెంపుజోలికిపోకపోవచ్చునని కొటక్ తాజా నివేదికలో పేర్కొంది. బీఎస్ఈలో అత్యధికంగా లాభపడిన షేర్లలో బజాజ్ ఫైనాన్స్, టాటాస్టీల్, ఓఎన్‌జీసీ, బజాజ్‌ఆటో, సన్‌ఫార్మా, ఎన్‌టీపీసీ, కోల్ ఇండియా, మారుతి, టాటా మోటార్స్, ఐసీఐసీఐ బ్యాంకు, రిలయన్స్ షేర్లు 4.34 శాతం పెరిగాయి. దీనికి వ్యతిరేకంగా యాక్సిస్ బ్యాంకు, ఇండస్‌ఇండ్ బ్యాంకు షేర్లు 0.54 శాతం వరకు నష్టపోయాయి. సెక్టార్ ప్రకారం చూస్తే బ్యాంకింగ్, ఫార్మా, లోహ, ఐటి రంగానికి చెందిన షేర్లలో ర్యాలీ ఏర్పడింది. 2 శాతం వరకు లాభపడ్డాయి. దేశీయ సంస్థాగత మదుపరులతో పాటు విదేశీ సంస్థాగత మదుపరులు కూడా పెద్దెత్తున షేర్లు కొనుగోలు చేయడంతో మార్కెట్ మరింత బలపడిందని బ్రోకర్లు చెబుతున్నారు.

ఆమెకు ఓకే..

◆ అయ్యప్ప సన్నిధికి మహిళలు వెళ్లొచ్చు ◆ సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తాం ◆ యూ టర్న్ తీసుకున్న ట్రావెన్‌కోర్ బోర్డు ◆ సెప్టెంబర్ 28 నాటి తీర్పు పునఃసమీక్ష కోరుతూ 64 పిటిషన్లు ◆ తీర్పును రిజర్వ్‌లో ఉంచిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: శబరిమల అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశంపై ట్రావెన్‌కోర్ బోర్డు యూ టర్న్ తీసుకుంది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ అన్ని వయస్సులు గల మహిళలకు ఆలయ ప్రవేశం కల్పిస్తామని తెలియజేసింది. గత తీర్పును అనుసరించి రుతుక్రమ వయస్సు గల మహిళలను కూడా స్వామివారి దర్శనానికి అనుమతిస్తామని ట్రావెన్ కోర్ బోర్డు సుప్రీకోర్టుకు వివరించింది. సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ మహిళలందరికీ అయ్యప్ప దర్శనాన్ని కల్పించేందుకు మొదటి నుంచి కేరళ ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా తాజాగా ట్రావెన్ కోర్ బోర్డు కూడా ప్రభుత్వ నిర్ణయంతో ఏకీభవించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 (1) ప్రకారం మత ఆచారాలు అందరికీ సమానంగా ఉంటాయని సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది తెలిపారు. జీవ సంబంధిత లక్షణాల కారణంగా మహిళలపై వివక్ష చూపడం సరికాదని.. శబరిమల విషయంలో న్యాయస్థానం గతంలో ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని స్పష్టం చేసింది. గతంలో అయ్యప్ప ఆలయంలోకి అన్నివయస్సు గల మహిళల ప్రవేశాన్ని వ్యతిరేకించిన బోర్డు హఠాత్తుగా తన నిర్ణయాన్ని మార్చుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

ఆ పిటిషన్లను కొట్టివేయండి

అంతకుముందు వాదనలు వినిపించిన నాయర్ సొసైటీ, కేరళ ప్రభుత్వం వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించాయి. స్వామివారి దర్శనం విషయంలో వివక్ష తగదని వ్యాఖ్యానించాయి. రుతుక్రమ వయస్సు గల మహిళలకు అయ్యప్ప సన్నిధిలో ఉన్న నిషేద సంప్రదాయాలు కొనసాగించాలని దాఖలైన పిటిషన్లను కొట్టివేయాలని సుప్రీంకోర్టును కోరాయి. శబరిమల అంశం ప్రజలందరికీ చెందినదని.. ఈ విషయంలో రాజ్యాంగ ధర్మాన్ని పాటించాలని కేరళ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

అది అంటరాని తనం కాదు

శబరిమలలో రుతుక్రమ వయస్సు గల మహిళలకు ప్రవేశం కల్పించకపోవడం అంటరానితనం కిందకు రాదని నాయర్ సర్వీస్ సొసైటీ వ్యాఖ్యానించింది. నాయర్ సొసైటీ తరపున వాదనలు వినిపించిన న్యాయవాది పరాశరణ్ ధర్మాసనానికి వివరించింది. శబరిమల ఆలయ సంప్రదాయం ప్రకారం రుతుక్రమ వయస్సు గల మహిళలకు దర్శనం లేదు. చాలా కాలంగా మహిళలూ ఈ విషయంపై అభ్యంతరం వ్యక్తం చేయలేదు. ఆలయ సంప్రదాయాలను పరిరక్షించడంలో మహిళలదే కీలక పాత్ర అని వ్యాఖ్యానించారు.

తీర్పు రిజర్వ్

గతేడాది సెప్టెంబర్ 28న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలంటూ సర్వోన్నత న్యాయస్థానంలో 64 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిలో కొన్ని గత తీర్పును అమలు చేయాలని..మరికొన్ని స్టే ఇవ్వాలని దాఖలు కాగా.. వీటన్నింటిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గగోయ్ నేతృత్వంలోని న్యాయమూర్తులు ఆర్‌ఎఫ్ నారీమణ్,ఏఎం ఖాన్విల్కర్, డీవై చంద్రచూడ్,ఇందూ మల్హోత్రాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. కేరళ ప్రభుత్వం, ట్రావెన్‌కోర్ బోర్డు,నాయిర్ సర్వీసెస్ సొసైటీ వాదనలు విన్న ధర్మాసనం..మరికొందరి వాదనలు కూడా వినాల్సిన అవసరముందని పేర్కొంది. అందరి వాదనలు పూర్తయిన తర్వాతే తమ నిర్ణయాన్ని వెల్లడిస్తామంటూ తీర్పును రిజర్వ్‌లో ఉంచింది.

వారికి రక్షణ కల్పించండి..

సుప్రీంకోర్టు తీర్పు తర్వాత శబరిమల ఆలయంలోకి ప్రవేశించిన ఇద్దరు మహిళలు ఆలయం తెరిచిన తర్వాత మళ్లీ దర్శనానికి వెళ్లొచ్చని కోర్టు తెలిపింది. దళిత హిందూ మహిళబిందు, ఆమె కుటుంబసభ్యులను ఇరుగుపొరుగు వాళ్లు దూరంగా ఉంచడాన్ని కోర్టు తప్పుబట్టింది. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఆలయంలో ప్రవేశించిన మహిళలను దూషిస్తూ.. వివక్ష చూపడాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. భయం భయంగా గడుపుతున్న వారికి రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది.

ఆ 15 మందికి రూ.3.5 లక్షల కోట్లు...

రైతులకు మొండిచేయి

◆ ఆ ఇద్దరూ.. రైతులు, గిరిజనులను దోచేస్తున్నారు ◆ పేదల సంక్షేమం మరిచి... పెద్దోళ్ల సేవలో తరిస్తున్నారు ◆ మా ప్రభుత్వ హయాంలో రెండ్రోజుల్లో రుణమాఫీ ◆ ఒడిశా పర్యటనలో మోడీ, నవీన్ పట్నాయక్‌పై విమర్శలు



భువనేశ్వర్: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి ప్రధాని మోడీ, ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్‌పై విరుచుకుపడ్డారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం, ఒడిశాలో నవీన్ పట్నాయక్ ప్రభుత్వం గిరిజనులను దోచుకుంటున్నాయని ఆరోపించారు. 10 రోజుల్లోనే రెండోసారి ఒడిశా వెళ్లిన రాహుల్ గాంధీ వెనకబడిన ప్రాంతమైన భవానీపాట్నా గిరిజనులు, దళితులతో మమేకమయ్యారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో బీజేడీ ప్రభుత్వం దళితుల సంక్షేమాన్ని మరిచి ప్రవర్తిస్తున్నాయని రాహుల్ గాంధీ మండిపడ్డారు. గిరిజనుల హక్కులు,భూములను కాపాడేది కాంగ్రెస్ పార్టీ ఒక్కటేనని అన్నారు. బీజేపీ,బీజేడీ ప్రభుత్వాలు తమ పారిశ్రామిక మిత్రుల కోసం రైతులు, పేదల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని రాహుల్ ఆరోపించారు. కేవలం 15 మంది పారిశ్రామిక వేత్తలకు రూ. 3.5 లక్షల కోట్ల రూపాయల రుణమాఫీ చేసిన మోడీ.. రైతుల రుణాలను మాఫీ చేయడంలో ఎందుకు వెనకాడుతున్నారని రాహుల్ ప్రశ్నించారు. రైతుల పంట ఉత్పత్తులకు మద్దతు ధరను కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్,రాజస్థాన్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండ్రోజులకే రైతు రుణాలను మాఫీ చేశాయని రాహుల్ గుర్తు చేశారు.

మోడీ చేతిలో రిమోట్‌లా నవీన్..

దేశానికి కాపలాదారుడినని చెప్పుకుంటున్న ప్రధాని మోడీ.. అవినీతి పరుడయ్యాడని.. చిట్ ఫండ్ స్కాంలతో సంబంధమన్న నవీన్ పట్నాయక్ మోడీ చేతిలో రిమోట్‌గా మారిపోయారని ఆరోపించారు. పరిశ్రమల కోసం సేకరించిన భూముల్లో ఐదేళ్ల కాలంలో పనిమొదలు కాకుండా ఆ భూములను తిరిగి రైతులకు ఇవ్వాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. వ్యాపారులకు మద్దతు పలుకుతున్నాయని రాహుల్ మండిపడ్డారు. ఈ విషయంలో చత్తీస్‌గఢ్‌లోనికాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తూ రైతుల భూములను తిరిగి ఇచ్చే ప్రక్రియను ప్రారంభించిందన్నారు.

గారడిల రాజు పాలనలో అంతా నాశనం

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రధాని మోడీని గారడిల రాజుగా అభివర్ణించారు. అబద్ధాల రాజు పాలనలో దేశమంతా నాశనమౌతోందని ట్విట్టర్ వేదికపై మండిపడ్డారు. దేశంలో నిరుద్యోగం పెచ్చుమీరుతున్నా మోడీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లే వ్యవహరిస్తోందని విమర్శించారు. మీడియా కథనాలను ఆధారంగా చేసుకుని దేశంలో నిరుద్యోగం పెరుగుదలకు బీజేపీ పాలిత రాష్ట్రం ఉత్తర్ ప్రదేశ్‌ను ఉదాహరణగా పేర్కొన్నారు. ఉత్తర్ ప్రదేశ్‌లో క్లాస్ -4 ఉద్యోగాలకు పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యావంతులు దరఖాస్తు చేసుకోవడం మోడీ పాలనలో నిరుద్యోగం పెరుగుదలకు అద్దంపడుతుందని వ్యాఖ్యానించారు. రైతులకు మద్దతు ధర కల్పించడంలోనూ మోడీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని రాహుల్ ఆరోపించారు.

ఈడీ ముందుకు వాద్రా

◆ మనీలాండరింగ్ ఆరోపణల నేపథ్యంలో విచారణ ◆ లండన్‌లో ఆస్తుల కొనుగోలు వ్యవహారంపై ఆరా ◆ అక్రమ లావాదేవీలు.. బ్లాక్‌మనీ అంశంపై ప్రశ్నలు ◆ వాద్రాను ఈడీ కార్యాలయానికి తీసుకొచ్చిన ప్రియాంక

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బావమరిది, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ భర్త అయిన రాబర్ట్‌వాద్రా బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) కార్యాలయానికి చేరుకున్నారు. మనీలాండరింగ్, లండన్‌లోని అక్రమాస్తుల వ్యవహారానికి సంబంధించిన కేసులో కోర్టు ఆదేశాల మేరకు ఈడీ విచారణకు హాజరయ్యారు. ప్రియాంక గాంధీ స్వయంగా ఆయన్ను ఈడీ కార్యాలయం వద్దకు తీసుకెళ్లారు. ఎస్‌పీజీ బలగాలు వెన్నంటి రాగా, తెల్ల రంగు టయోటా లాండ్ క్రూయిజర్‌లో దర్యాప్తు కార్యాలయం చేరుకున్నారు. సెంట్రల్ ఢిల్లీలోని జామ్‌నగర్ హౌస్‌లోని ఈడీ కార్యాలయానికి మధ్యాహ్నం 3.47 నిముషాలకు రాబర్ట్ వాద్రా ప్రవేశించారు. దీనికి కొద్ది నిముషాల ముందు న్యాయవాదుల బృందం అక్కడకు చేరుకుంది. ఆర్థిక ఒప్పందాల నేరాల కేసుల్లో వాద్రా దర్యాప్తు సంస్థల ముందుకు వెళ్లడం ఇదే తొలిసారి. గతంలో అనేక సందర్భాల్లో ఆరోపణలు వచ్చినప్పటికీ, కోర్టుల వరకే పరిమితం అయ్యారు. ఈ కేసులోమధ్యంతర బెయిల్ కోసం అప్పీలు చేసుకున్న నేపథ్యంలో ఢిల్లీ కోర్టు అందుకు అంగీకరించింది. కేంద్ర దర్యాప్తు సంస్థలకు సహకరించాలని ఆదేశించింది. ఫిబ్రవరి 16వరకు వాద్రాను అరెస్టు చేయకూడదని ఆదేశించింది. వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని సూచించడంతో దీంతో బుధవారం ఈడీ



కార్యాలయానికి వచ్చారు.

మనీలాండరింగ్ ఆరోపణలకు సంబంధించి ఈడీ వాద్రాను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. లావాదేవీల వ్యవహారం, స్థిరాస్తుల కొనుగోలు అంశంపై ప్రధానంగా వాద్రాను విచారించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. లండన్‌లోని 12 బ్ర్యాన్‌స్టన్ స్క్వేర్ ప్రాంతంలోని 1.9 మిలియన్ పౌండ్ల విలువ చేసే స్థిరాస్తులపై వాద్రాను ఆరాతీసినట్లు తెలుస్తోంది. ఈ ఆస్తి వాద్రా పేరుమీదే రిజిస్టర్‌అయినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గతేడాది డిసెంబర్‌లో పలుచోట్ల దాడులు నిర్వహించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, వాద్రా సన్నిహితుడు అరోరా తోపాటు స్కైలైట్ ఆసుపత్రి ఉద్యోగి ఒకరిని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఇదిలావుండగా మరో మనీలాండరింగ్ కేసులో ఈనెల 12న ఈడీ విచారణకు హాజరవ్వాలని రాజస్థాన్ హైకోర్టు వాద్రాను ఆదేశించింది.

రోడ్‌పతి.. కరోడ్‌పతి ఎలా అయ్యారు?: బీజేపీ

రాబర్ట్‌వాద్రా ఈడీ విచారణకు హాజరైన నేపథ్యంలో బీజేపీ విమర్శల దాడి చేసింది. కాంగ్రెస్ పార్టీ, కుటుంబం లక్ష్యంగా తీవ్ర ఆరోపణలు చేసింది. రోడ్‌పతి కరోడ్‌తి కావడంలోని రహస్యమేంటి? దేశంలోని ప్రతిఒక్కరికి తెలుసు... కాంగ్రెస్ కుటుంబంలో ప్రతి సభ్యుడు బెయిల్‌పై బయట తిరుగుతున్నారు. 2019 ఎన్నికలు అనీవీతి పార్టీకి, మోడీ పారదర్శక పాలనకు మధ్య పోటీ. పెట్రోలియం డీల్ ద్వారా అక్రమంగా వాద్రా కంపెనీలోకి నిధులు చేరాయి. ఇలా పోగేసిన సొమ్ముతో విదేశాల్లో ఎనిమిది నుంచి తొమ్మిది ఆస్తులు కొన్నారని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర ఆరోపించారు. యూపీఏ హయాంలో రక్షణ ఒప్పందాల్లోనూ వాద్రాకు వాటాలు వెళ్లాయని ఆరోపించారు. అవినీతి సొమ్మును వాద్రా కంపెనీలు నల్లధనాన్ని వైట్‌గా మార్చాయని విమర్శించారు.

ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక బాధ్యతలు

న్యూఢిల్లీ: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక గాంధీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఉత్తరప్రదేశ్‌లోని తూర్పు ప్రాంతానికి ఆమె ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు. రాష్ట్రంలోని మొత్తం 80 లోక్‌సభ స్థానాల్లో, ఇక్కడ 40 ఎంపీ స్థానాలున్నాయి. భర్త రాబర్ట్ వాద్రాను ఈడీ కార్యాలయం వద్ద విడిచివచ్చిన తర్వాత పార్టీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం అయ్యారు. సోదరిని క్రియాశీలక బాధ్యతల్లో నియమిస్తూ గతనెల 23న రాహుల్ గాంధీ అధికారికంగా ప్రకటించారు. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో తన గది పక్కనే ఆమెకు ప్రత్యేకంగా ఆఫీసుగదిని మంగళవారం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. నేడు ప్రియాంక అధికారిక సమావేశం నిర్వహించబోతున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జిలతో లోక్‌సభ ఎన్నికల వ్యూహం గురించి రాహుల్ చర్చించిన విషయం తెలిసిందే.

నా కుటుంబానికి అండగా ఉంటా: ప్రియాంక

మనీలాండరింగ్, విదేశీ అక్రమాస్తులు ఆరోపణల అంశంపై బుధవారం రాబర్ట్ వాద్రా ఈడీ విచారణకు హాజరయ్యారు.



కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ప్రియాంక గాంధీ తన భర్తను స్వయంగా ఈడీ కార్యాలయం వద్దకు తీసుకెళ్లడం రాజకీయ దుమారం రేపుతోంది. ప్రతిపక్షాల విమర్శలకు ఇదొక ఆయుధమైంది. వాద్రాను ఈడీ కార్యలయం వద్ద వదలివచ్చిన అనంతరం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టింది. అనంతరం మీడియా ప్రశ్నలకు ప్రియాంక సూటిగా జవాబిచ్చింది. ఆయన నా భర్త. ఆయన నా కుటుంబం.. నేను నా కుటుంబానికి అండగా నిలుస్తాను అని స్పష్టం చేసింది.

అనుమతిలేని డిపాజిట్ పథకాలు తెస్తే జైలుకే

◆ కేంద్ర మంత్రివర్గ నిర్ణయం ◆ జాతీయ కామధేను కార్పొరేషన్ ఏర్పాటు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: నియంత్రణ లేని డిపాజిట్ పథకాలను నిషేధిస్తూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నియంత్రణ లేని డిపాజిట్ పథకాల నిషేధ బిల్లు 2018కి సవరణలు చేస్తూ నిర్ణయం తీసుకుంది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం పలు నిర్ణయాలు తీసుకుంది. ఈ సమావేశంలో నియంత్రణ లేని డిపాజిట్ పథకాలను నిషేధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నిషేధ బిల్లుకు సవరణలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇక నుంచి అనుమతి లేని డిపాజిట్ పథకాలను అమలు చేస్తే కఠినమైన శిక్షలు విధించనున్నారు. ఇలాంటి డిపాజిట్ పథకాలను నిషేధించారు. ఈ మేరకు సెక్షన్ 5కు సవరణలు చేశారు. ఈ డిపాజిట్లపై ప్రచారం చేస్తే కూడా శిక్ష, జరిమానా విధిస్తారు. అనుమతిలేని పథకాలను కొనసాగించే సంస్థల ఆస్తులను వేలం వేయనున్నారు. సినిమా పైరసీ, కాపీయింగ్‌ను అడ్డుకునేందుకు సినిమాటోగ్రఫీ చట్ట సవరణలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పైరసీ చేసిన వారికి మూడేళ్ల జైలు శిక్ష, పది లక్షల జరిమానా విధించనున్నారు. సినిమా నిర్మాత అనుమతి లేకుండా డిజిటల్ పైరసీకి పాల్పడితే కటకటాలు లెక్కించాల్సిందే.

జాతీయ కామధేను కార్పొరేషన్ ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గో సంతతి సంరక్షణతో పాటు చిన్న, సన్న కారు రైతుల జీవనోపాధి కోసం కామధేను కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. నాబార్డు ద్వారా పదివేల గ్రామీణ వ్యవసాయ మార్కెట్లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం నాబార్డుకు రెండువేల కోట్ల రూపాయల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయనున్నారు. అంతర్జాతీయ యునిఫైడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రెగ్యులేటరీని గాంధీనగర్‌లో ఏర్పాటు చేసేందుకు కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ఎన్‌టిపిసి నిర్మిస్తున్న నాలుగువేల మెగావాట్ల విద్యుత్ స్టేషన్ల నుంచి 85శాతం విద్యుత్‌ను సొంత రాష్ట్రానికి వినియోగించుకునేందుకు అనుమతినిస్తూ కేంద్రమంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.

కావాలనే తప్పుదోవ..!

◆ వారిని రక్షించే బాధ్యత మాపై ఉంది ◆ తరగతుల కోసం డీన్‌పై ఒత్తిడి తీసుకొచ్చారు ◆ భారత్ ఇమ్మిగ్రేషన్ అటార్నీ అనూ పెషవారియా

వాషింగ్టన్ : అమెరికాలో నకిలీ వర్సిటీల్లో అడ్మిషన్ పొందిన వారి పరిస్థితి దయనీయంగా మారింది. దీనిపై ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలు అమెరికాపై దుమ్మెత్తి పోస్తున్నాయి. పక్కా ప్లాన్ ప్రకారమే అందరినీ ఇరికించినట్టు పలువురు ఆరోపిస్తున్నారు. అమె రికా ప్రభుత్వం భారతీయ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని నకిలీ విశ్వ విద్యాలయాలను స్థాపించి తప్పు దోవ పట్టించిందని భారత్ ఇమ్మిగ్రేషన్ అటార్నీ అనూ పెషవారియా ఆగ్రహం వ్యక్తం చేసింది. అండర్ కవర్ ఆపరేషన్‌తో వందలాది మంది భారతీయ విద్యా ర్థుల బతుకు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. భారతీయ విద్యార్థులు తప్పు చేయలేదని అనడం లేదని, వారు తెలీక చేశారని అనూ వివరించింది. హోంలాండ్ సెక్యూరిటీ సంస్థ కావాలని వారిని వల పన్ని తప్పుదోవ పట్టించిందన్నారు. నేరం చేసేలా వారే ప్రోత్సహించారని, అలాంటప్పుడు వారిని రక్షించాల్సిన బాధ్యత తమపై ఉందని వివరించారు. గత వారం వెలుగులోకొచ్చిన మోసంతో 600 మందిలో 130 మందిని బంధించడం జరిగిందన్నారు. 129 మంది భారతీయులు బాధితులుగా ఉన్నారని అనూ తెలిపారు. కొందరిని విడుదల చేయగా మరికొందరిని అదుపులోకి ఉంచుకున్నారు. దేశం విడిచి వెళ్లకుండా నిర్బంధం విధించారు. చాలా మంది విద్యార్థులు తనకు ఫోన్ చేశారని, అరెస్టుల ద్వారా తమ విద్యా భవిష్యత్తుపై వారు ఆవేదన వ్యక్తం చేసినట్టు అనూ వివరించారు. విద్యార్థులకు ఐ-20లు జారీ చేసే విద్యా విభాగంలోనూ వర్సిటీ పేరుతో నమోదు చేసి ఉందని, అలాగే హోంలాండ్ సెక్యూరిటీ విభాగం వారు సైతం ధ్రువీకరించారని తెలిపారు. ఈ ఐ-20లు ఆధారంగా విద్యార్థులు డ్రైవింగ్ లైసెన్సులు సైతం పొందారని గుర్తు చేశారు. దీన్ని బట్టి చూస్తే కావాలనే హోంలాండ్ సెక్యురిటీ విభాగం విద్యార్థులతో ఈ పని చేయించినట్టు అర్థం అవుతోందన్నారు. చాలా సార్లు వర్సిటీకి చెందిన డీన్‌ను విద్యార్థులు కలిశారని, తరగతుల నిర్వహణ కోసం డిమాండ్ కూడా చేసినట్టు వివరించారు. తరువాత ఇలా అక్రమంగా వారిని అరెస్టు చేయడం బాధాకరమన్నారు. చాలా మంది విద్యార్థులు పన్నులు సైతం కట్టారని, వారి తరఫున తాము పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని వివరిం చారు. అరెస్టయిన వారిలో చాలా మంది భారీ లోన్లు తీసుకున్నట్టు తెలిసిందని, వాటిని తీర్చడం కోసం వారు పని చేస్తూ కొంత సొమ్మును ఇంటికి పంపాలనే ఆలోచనలో ఉన్నట్టు ఆమె వివరించారు. విద్యా ర్థులను రక్షించేందుకు ప్రయత్నిస్తుంటే, అమెరికా మాత్రం వారిని తిరిగి భారత్ వెళ్లేందుకు బలవంతం చేస్తున్నట్టు తెలిసిందని అనూ తెలిపారు.





ఆపరేషన్ లోటస్

◆ పరేషాన్‌లో కుమార సర్కార్ ◆ కర్నాటకలో మళ్లీ క్యాంప్ రాజకీయాలు ◆ బడ్జెట్ సమావేశాలకు 9మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల డుమ్మా ◆ సిద్ధరామయ్య విప్‌ను ధిక్కరించిన నేతలు ◆ బీజేపీతో టచ్‌లో 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ◆ ప్రభుత్వంపై అవిశ్వాసానికి సిద్ధమౌతున్న కమలనాథులు

బెంగళూరు: కర్నాటకలో కాంగ్రెస్- జేడీఎస్ ప్రభుత్వానికి ముప్పు ముంచుకొచ్చిందా..? బీజేపీ ప్రయోగించిన ఆపరేషన్ లోటస్ వికసించనుందా..? బడ్జెట్ సమావేశాల వేళ 9 మంది కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు విప్‌ను ధిక్కరించి సభకు హాజరుకాకపోవడం దేనికి సంకేతం. తమ ప్రభుత్వానికి ఢోకా లేదని కుమార స్వామి.. కూటమి ప్రభుత్వాన్ని కూల్చబోమంటూ యడ్యూరప్ప ప్రకటనలు చేస్తున్నప్పటికీ.. లోలోపల ఏదో జరుగుతున్నట్లు అనిపిస్తోంది. జనవరి 18న కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశానికి డుమ్మా కొట్టిన నలుగురు ఎమ్మెల్యేలు రమేష్ జకిహోలీ, ఉమేష్ జీ జాదవ్, బి. నాగేంద్ర, మహేశ్ కుమాతల్లిలతో పాటు మరో ఐదుగురు ఎమ్మెల్యే బడ్జెట్ సమావేశాలకు గైర్హజరయ్యారు. వీరిలోని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ రిసార్ట్‌లో మరో ఎమ్మెల్యేలతో గొడవ తర్వాత కనిపించకుండా పోయారు. సొంత పార్టీ నేతలకు సైతం గణేష్ టచ్‌లోకి రావడం లేదు. ఈనేపథ్యంలో కన్నడ రాజకీయాలపై దక్షిణాది రాష్ట్రాలు ఆసక్తిగా చూస్తున్నాయి.

విప్‌ను పట్టించుకోని ఎమ్మెల్యేలు

బడ్జెట్ సమావేశాలు ముగిసేంత వరకు కాంగ్రెస్- జేడీఎస్ ఎమ్మెల్యేల్లో ఒక్కరు కూడా గైర్హాజరయ్యేందుకు వీలులేదని రెండు పార్టీలు విప్ జారీ చేసినా సంకీర్ణ ప్రభుత్వానికి కాలం చెల్లిందన్న ప్రచారం ఇరు పార్టీల రెబల్స్ చెవికిపట్టడం లేనట్లే కనిపిస్తోంది. బడ్జెట్ సమావేశాలు సందర్భంగా గవర్నర్ వాజూభాయ్ వాలా ప్రసంగిస్తుండగానే బీజేపీ నేతలు అసెంబ్లీలో రచ్చరచ్చ చేశారు. ప్రభుత్వం చెప్పే అబద్దాలు వినేందుకు మేం సిద్ధంగాలేము.. మెజారిటీలేని ఈ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయింది అంటూ నినాదాలు చేశారు. ఈనేపథ్యంలో కుమారస్వామి ప్రభుత్వం డైలమాలో పడింది. ఫిబ్రవరి 6 నుంచి 15 వ తేదీ వరకు జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యేలంతా హాజరు కావాల్సిందేనని మాజీ సీఎం సిద్ధరామయ్య బుధవారం మరోవిప్ జారీచేసినా కాంగ్రెస్ నేతలు మాత్రం తమను బలవంతంగా సభలో కూర్చోబెడుతున్నారని సన్నిహితుల వద్ద చెప్పుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది ఎమ్మెల్యేలు ఇంకా బీజేపీ నేతలతో టచ్‌లో ఉన్నారని ప్రచారం ఊపందుకుంటున్నా బాహాటంగా ఎవరూ స్పందించడం లేదు. ఈ సమావేశాలకు నలుగురు బీజేపీ నేతలు కూడా డుమ్మా కొట్టినప్పటికీ.. ముందస్తు అనుమతితోనే వారు సభకు రాలేదని తెలుస్తోంది. ఒక జేడీఎస్ ఎమ్మెల్యే కూడా సభలో కనిపించపోవడంపై పలు ఊహాగానాలు వస్తున్నాయి.

అధికారం దక్కలేదనే నిరాశలో బీజేపీ

తాజా పరిణామాలపై కర్నాటక మంత్రి డీకే శివకుమార్ స్పందిస్తూ.. బీజేపీపై నిప్పులు చెరిగారు.గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్న బీజేపీ నేతలకు ప్రజాస్వామ్యంపై గౌరవం లేదని వ్యాఖ్యానించారు. వారింకా అధికారం దక్కలేదన్న నిరాశ,నిస్పృహలోనే ఉన్నారని చురకలంటించారు. మరో మంత్రి కేజే జార్జ్ స్పందిస్తూ బీజేపీకి దమ్ముంటే ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని పెట్టాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా తమతోనే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. అయితే కాంగ్రెస్ పార్టీలోని 20 మంది ఎమ్మెల్యేలు కుమారస్వామి సీఎంగా కొనసాగడం జీర్ణించుకోలేకపోతున్నారన్న ప్రచార జరుగుతోంది.

బడ్జెట్ ఉన్నట్టా..లేనట్టా..

శుక్రవారం బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలోనూ సభలో ఆందోళన నిర్వహించాలని బీజేపీ తమ నేతలు ఆదేశాలిచ్చినట్లు సమాచారం. ఆర్థిక శాఖకు తనవద్దే ఉంచుకున్న కుమారస్వామి శుక్రవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నారు. ఈ నేపథ్యంలో కుమారకు గట్టిసెగ తగిలేలా ఆందోళనకు దిగాలని బీజేపీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే ఈ సమావేశాల్లో బడ్జెట్ ప్రవేశపెడతారా లేదా అనేది కూడా అనుమానంగానే ఉందని కొందరు బీజేపీ నేతలు చెబుతున్నారు. 20-25 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీకి దూరంగా ఉన్న నేపథ్యంలో సంకీర్ణ ప్రభుత్వానికి గడ్డురోజులు దగ్గరపడ్డాయని వ్యాఖ్యానిస్తున్నారు. కుమారస్వామి గత డిసెంబర్‌లో మంత్రివర్గాన్ని విస్తరించిన తర్వాత తొలిసారి జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలు కావడం.. అసమ్మతి నేతలు తిరుగుబాటుకు దిగడం బీజేపీ క్యాష్ చేసుకుంటోంది. ప్రస్తుతం బీజేపీనే సింగిల్ లార్జెస్ట్ పార్టీగా కర్నాటకలో అవతరించినా.. కాంగ్రెస్-జేడీఎస్ దోస్తీతో ప్రభుత్వాన్ని నిలబెట్టుకోలేకపోయింది. గత నెలలో కూడా ప్రభుత్వాన్ని పడగొట్టాలని బీజేపీ ప్రయత్నాలు చేసినప్పటికీ విఫలం కావడంతో ఈసారి పక్కా ప్లాన్‌తో బీజేపీ ముందడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలో బీజేపీలో కొత్తగా చేరిన ఎమ్మెల్యే ప్రసాద్ లాడ్‌కు కాంగ్రెస్ నేతలను బీజేపీ వైపు తిప్పుకునే బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు సన్నిహితుడైన లాడ్.. ముంబైలోని ఓ నేతలతో మంతనాలు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో బడ్జెట్ సమావేశాలుముగిసేలోపే సంకీర్ణ ప్రభుత్వంపై బీజేపీ అవిశ్వాస తీర్మానం పెడుతుందా అనే సందేహాలు వ్యక్తమౌతున్నాయి. కర్నాటకలో మొత్తం 224 ఎమ్మెల్యే స్థానాలుండగా.. సంకీర్ణ ప్రభుత్వానికి 117 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంది. బీజేపీ నుంచి 104 మంది సభ్యులున్నారు.



రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు

గీటురాయి అవార్డులు

• అవార్డులతో ప్రభుత్వ ప్రతిష్ట పెరిగింది • కేంద్రం విమర్శలకు అవార్డులే సమాధానం

• అవార్డుల గ్యాలరీ ప్రారంభంలో సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రప్రభుత్వ పనితీరుకు గీటురాయిగానే కేంద్రం నుంచి మనకు అవార్డులు లభించాయని, అవార్డులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ట మరింతగా పెరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై కేంద్రం రాష్ట్రానికి 671 అవార్డులను అందచేసిన విషయం తెలిసిందే. ఈ మొత్తం అవార్డుల ప్రదర్శన కోసం ప్రత్యేక గ్యాలరీని అధికారులు ఏర్పాటు చేశారు. అసెంబ్లీ ఆవరణలో ఇందుకు సంబంధించి ఏర్పాటు చేసిన అవార్డుల గ్యాలరీని ముఖ్యమంత్రి బుధవారం ప్రారంభించారు. అనంతరం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ అందరూ కష్టపడి పనిచేయడం ద్వారానే అవార్డులు లభించాయన్నారు. జాతీయ, అంతర్జాతీయ అవార్డులు రావడంతో వీటి ద్వారా ప్రభుత్వ ప్రతిష్ట మరింతగా పెరిగిందన్నారు. ఐదేళ్లలో ఏం సాధించామో ప్రజలకు తెలియజేసేందుకు ఈ ప్రదర్శన ఎంతగానో ఉపయోగపడుతుందని సీఎం అన్నారు. కేంద్రం చేస్తున్న విమర్శలకు అవార్డులే సమాధానమని అన్నారు. కొత్త రాష్ట్రంలో అనేక ఇబ్బందుల మధ్య పనులు ప్రారంభించామని, చిత్తశుద్ధితో పనిచేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ముఖ్య



మంత్రి అన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెంచడం లక్ష్యంగా పని చేస్తున్నందు వల్లనే రాష్ట్రానికి ఇన్ని అవార్డులు లభించాయని అన్నారు. మరింత బాగా పనిచేసేందుకు ఈ అవార్డులు స్ఫూర్తిని ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ కోడెల శివప్రసాదరావుతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

• ఆకట్టుకున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖల అవార్డులు • అందరితో హుషారుగా ముచ్చటించిన మంత్రి లోకేష్ • మంత్రిని ప్రశంసించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

అవార్డుల గ్యాలరీ ప్రారంభానికి

తరలివచ్చిన కేబినెట్

అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన అవార్డుల గ్యాలరీ అలరించింది. గ్యాలరీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. గ్యాలరీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేబినెట్ మొత్తం తరలి వచ్చింది. ఈ సందర్భంగా అక్కడ సంపూర్ణ సందడి వాతావరణం నెలకొంది. ప్రజాప్రతినిధులు అందరు గ్యాలరీని సందర్శించి ప్రభుత్వంలో వివిధ మంత్రిత్వ శాఖలు సాధించిన అవార్డులు, రివార్డులను పరిశీలించారు. ముఖ్యంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, ఐటీ శాఖలకు ఎక్కువగా అవార్డులు లభించడంతో ఆయా శాఖల మంత్రి నారా లోకేష్ గ్యాలరీ ఆవరణ ప్రాంగణంలో సందడి చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పేరుపేరునా పలుకరించి వారితో హుషారుగా ముచ్చటించారు. ప్రదర్శనను తిలకించిన ప్రజాప్రతినిధులు మంత్రి లోకేష్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులు అమలు చేసిన పథకాలు గ్రామీణాభివృద్ధి విభాగానికి దేశ వ్యాప్తంగా పేరు తెచ్చి పెట్టాయి. వివిధ శాఖల్లో అభివృద్ధి పనులను నరేగాకు అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన సూచనలను అమలు చేయడం లో మంత్రి లోకేష్ కీలకపాత్ర పోషించారు. కేంద్రం విధించిన 60:40 నిష్పత్తి పాటిస్తూ అనుసంధానంతో గ్రామీణాభివృద్ధిలో దేశంలో ఏ రాష్ట్రం సాధించలేని ప్రగతి సాధించగలిగారు. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారు.



పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు అద్భుతమైన పనితీరు కనబరచి నాలుగేళ్లలో 53 అవార్డులు సాధించాయి. ఇందులో జాతీయ, రాష్ట్రీయ అవార్డులు ఉన్నాయి. లోకేష్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ఎక్కువ అవార్డులు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ అనే ప్రశ్న వినబడితే ఏమిటి? అని ఆశ్చర్యంగా చూసే పరిస్థితి నవ్యాంధ్రగా ఏర్పడిన కొత్తలో ఉండేది. లోకేష్ ఐటీ, కమ్యూనికేషన్ల మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ఐటీలో ఏపీని సాటి లేని మేటిగా తీర్చిదిద్దారు. ప్రపంచం ఏపీ వైపు చూసేలా వినూత్నమైన పాలసీలు తీసుకువచ్చారు. ఐటీ కంపెనీల ఏర్పాటుకు అనువైన పరిస్థితులు, సదుపాయాలు కల్పించారు. రాయితీలు ప్రకటించారు. దీంతో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కంపెనీలు ఏపీకి తరలి వచ్చాయి. ఐదేళ్లలో ఐటీ, కమ్యూనికేషన్ శాఖల్లో వివిధ విభాగాలకు 38 అవార్డులు వచ్చాయి. ఇందులో 32 లోకేష్ ఐటీ మంత్రి అయిన తర్వాత వచ్చినవి కావడం విశేషం.

బాబుతోనే సామాజిక న్యాయం

• కళ్లుండి చూడలేని కబోధులు బీజేపీ, వైసీపీ నేతలు • గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చీఫ్ విప్ పల్లె రఘునాథ్‌రెడ్డి

అమరావతి, ఆంధ్రప్రభ : ప్రతిపక్షనేత జగన్‌కే కుల దురాభిమానం ఉందని, 2007లో తమ్మినేని సీతారాం వైయస్ రాజశేఖర్‌రెడ్డి గురించి చెప్పారని చీఫ్ విప్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆరోపించారు. బుధవారం అసెంబ్లీలో గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రసంగించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వృద్ధులకు పెద్దకొడుకుగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారని, సాక్షాత్తు మోడీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో కూడా రూ.500 మాత్రమే పెన్షన్ ఇస్తున్నట్లు తెలిపారు. డ్వాక్రాలకు వైయస్ హయాంలో రూ.200 కోట్లు మాత్రమే ఇచ్చారని, కిరణ్ కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో రూ.2000 కోట్లు ఇచ్చారని, కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు వాటిని ఎన్నోరెట్లు పెంచి రూ.21వేల కోట్లకుపైగా ఇచ్చినట్లు చెప్పారు. ఎన్టీఆర్ వైద్యసేవ దాదాపు 1044 రోగాలకు వర్తిస్తుందని, ఇప్పటివరకు 18లక్షలమంది లబ్ధి పొందినట్లు పేర్కొన్నారు. దేశంలో ఏప్రభుత్వం చేయని విధంగా వ్యవసాయానికి ఈ ప్రభుత్వం 5సంవత్సరాల్లో రూ.81,554 కోట్లు ఖర్చు పెట్టిందని, కానీ వైయస్ హయాంలో 24వేలమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. తమ సామాజిక వర్గాల అధికారులకే పదోన్నతులు కల్పిస్తున్నారన్న జగన్ విమర్శలకు స్పందిస్తూ గతంలో తమ్మినేని సీతారాం పలు పోస్టులు సొంత సామాజిక వర్గానికే కట్టబెట్టారని వైయస్ రాజశేఖర్ రెడ్డిపై ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. అదేవిధంగా వైయస్ కేబినెట్‌లో ఎక్కువ మంది రెడ్డి సామాజిక వర్గం వాళ్లే వున్నారని, కానీ చంద్రబాబు సామాజిక న్యాయం పాటిస్తున్నారని, చంద్రబాబు తన కాబినెట్‌లో 4రెడ్డి సామాజిక మంత్రులకు స్థానం కల్పించారని, అదేవిధంగా కమ్మసామాజిక వర్గం మంత్రులు నలుగురే ఉన్నారని స్పష్టంచేశారు. వైసీపీ, బీజేపీ నేతలు కళ్లు ఉండి చూడలేని కబోదులుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.



బీజేపీశాసన సభాపక్ష నేత విష్ణుకుమార్ రాజు శాసనసభలో బాహుబలిగా ఉంటూ ప్రతిపక్షపార్టీగా వ్యవహరిస్తున్నారని శాసనసభ విప్ కూన రవికుమార్ చలోక్తి విసిరారు. విభజన సమయంలో ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు పదేళ్లన్న బీజేపీ మొసలి కన్నీరు కారుస్తుందని మండిపడ్డారు. అన్ని ఇచ్చాం, ఇన్ని ఇచ్చామని చెబుతున్న బీజేపీ వాళ్లు శ్రీకాకుళం జిల్లా వెళితే పలకరించే నాధుడే కరువయ్యారని దుయ్యబట్టారు. ఆ విషయాన్ని అటకెక్కించిందని మండిపడ్డారు. బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు కాగ్ చెప్పిన లోటు బడ్జెట్ ఇవ్వకుండా పీడీ ఎకౌంట్స్ గురించి మాట్లాడుతున్నారని రాజధానికి రూ.62వేలకోట్లు పైగా అవసరమైతే కేవలం రూ.1500కోట్లు మాత్రమే ఇచ్చారని దెప్పిపొడిచారు. విభజన చట్టంలో బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ ఇవ్వాలని ఉన్న ఇవ్వలేదని, చట్టప్రకారం రూ.24,360కోట్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.1050కోట్లు మాత్రమే ఇచ్చారని ఆగ్రహించారు. మోడీ ఒక ప్రధానిగా కాకుండా ఒక గల్లీ లీడర్‌గా ఆలోచిస్తున్నారని తూర్పారబట్టారు. హోదా లేని రాష్ట్రాల కంటే ఏపీ సంక్షేమంలో ముందు ఉందని, లోటు బడ్జెట్

విపక్ష బాహుబలిగా విష్ణు కుమార్ రాజు -విప్ కూన రవికుమార్

ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థిక విధానాలను పాటిస్తూ అభివృద్ధివైపు దూసుకెళుతున్నారని కొనియాడారు. దేశంలో వృద్ధిరేటు 7.3 నమోదయితే రాష్ట్రంలో 10.6 సాధించామని, అదేవిధంగా వ్యవసాయరంగానికి సంబంధించి దేశంలో 2.47శాతం నమోదయితే రాష్ట్రంలో 11శాతం నమొదయిందన్నారు. దేశంలో పారిశ్రామికాభివృద్ధి 7.5శాతంగా నమోదు కాగా రాష్ట్రంలో 9.5శాతం నమోదయిందని, దేవంలో సేవరంగం 8.8శాతం వృద్ధిరేటు నమోదయితే ఏపీలో 9.5శాతం నమోదయినట్లు పేర్కొన్నారు. మోదీ తీసుకున్న నిర్ణయాలవల్ల నిరుద్యోగం పెరిగిందని సర్వేలు చెబుతున్నాయని, నదుల అనుసంధానం చేయాలని వాజ్‌పేయి భావిస్తే మోడీ ఒక్కటి కూడా చేసి చూపలేదని, సీఎం చంద్రబాబు చేసి చూపారన్నారు. రాష్ట్రంలో నీటి పారుదల రంగానికి రూ.62వేల కోట్లు కేటాయించి 35లక్షల ఎకరాలను స్థిరీకరించడం జరిగిందని, అదేవిధంగా రాష్ట్రంలో 35లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకోగా 10లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తిచేశామని తెలిపారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణాలో 2లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకొని కేవలం 14వేల ఇళ్లు మాత్రమే పూర్తిచేశారని గుర్తుచేశారు.

ఏపీలో రామరాజ్యాన్ని చూస్తున్నాం.. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్

రాష్ట్రంలో రామరాజ్యాన్ని చూస్తున్నామని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ అన్నారు. గతంలో 9లక్షల మందికి భుజాలు ఎగరేశారని, కానీ ఇప్పుడు 54లక్షల మందికి పెన్షన్ ఇస్తున్నామన్నారు. గతంలో బాల్యవివాహాలు జరిగేయని చంద్రన్న పెళ్లి కానుక వల్ల రాష్ట్రంలో బాల్యవివాహాలు తగ్గుముఖం పట్టాయన్నారు. ఇప్పటివరకు 37,987మందికి చంద్రన్న పెళ్లి కానుక అందించారని తెలిపారు. బీజేపీ నేతలు రాముడి గుడి కట్టిస్తామని చెబుతున్నారే గాని రామరాజ్యం తెస్తామని చెప్పటంలేదని విమర్శించారు. అనంతరం మాజీ మంత్రి మృణాళిని, ఎమ్మెల్యేలు ఆనందరావు, జలీల్‌ఖాన్, లాల్ జాన్‌బాషా తదితరులు గవర్నర్ ప్రసంగం దన్యవాదాల తీర్మానం ప్రసంగించారు.



మండలి చైర్మన్‌గా

నేడు షరీఫ్ ప్రమాణం



అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ శాసన మండలి నూతన ఛైర్మన్‌గా ప్రస్తుత మండలి ప్రభుత్వ విప్ ఎం.ఏ. షరీఫ్ గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గత సమావేశాల వరకు ఛైర్మన్‌గా వ్యవహరించిన ఎన్ఎండీ ఫరూక్‌ను మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా ఎంపిక చేయడంతో ఆయన ఛైర్మన్ పదవికి రాజీనామా చేసి మంత్రిగా బాధ్యతలను చేపట్టారు. దీనితో మండలి డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ఇన్‌ఛార్జీ ఛైర్మన్‌గా ప్రస్తుతం జరుగుతున్న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలను నిర్వహిస్తున్నారు. బుధవారం మండలిలో నూతన ఛైర్మన్ ఎంపికకు నోటిఫికేషన్ జారీ చేయగా షరీఫ్ ఒక్కరే నామినేషన్ వేయడం జరిగింది. దీనితో ఆయన నియామకం లాంఛనం కావడంతో గురువారం జరిగే మండలి సమావేశాల్లో 11.30 గంటలకు ప్రమాణ స్వీకారం చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేశారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని నర్సాపురంలో 01.01.1955న జన్మించిన షరీఫ్ ఎంకామ్ ఎల్ఎల్‌బీ విద్యను అభ్యసించారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు పిలుపుమేరకు 1982లో టీడీపీ ద్వారా రాజకీయ జీవితం ప్రారంభించిన ఆయన పార్టీలో వివిధ హోదాల్లో పనిచేయడంతోపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ పనిచేశారు. అలాగే విభజన నవ్యాంధ్రలో 2015లో స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయిన ఆయన 2017 నుంచి మండలి ప్రభుత్వ విప్‌గా కొనసాగుతున్నారు. ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి, మైనారిటీల సంక్షేమానికి నిరంతరంసేవలను అందిస్తున్న మహ్మద్ అహ్మద్ షరీఫ్‌కు కానుకగా అత్యున్నతమైన మండలి ఛైర్మన్ పదవికి చంద్రబాబు ప్రభుత్వం ఎంపిక చేయడం జరిగింది.

మోడీ బి-టీమ్‌లో

జగన్, కేసీఆర్‌లు

• ట్విట్టర్లో మంత్రి లోకేష్



అమరావతి, ఆంధ్రప్రభ : జగన్, కేసీఆర్‌లు ప్రధాని మోడీకి బీ-టీమ్ అని అందుకే కోల్‌కతా ర్యాలీకి రాలేదని మంత్రి లోకేష్ విమర్శలు గుప్పించారు. బుధవారం ట్విట్టర్లో స్పందిస్తూ "బీజేపీ వ్యతిరేక పార్టీలన్నీ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా దీదీకి మద్దతుగా కోల్‌కతా ర్యాలీలో పాల్గొంటే ఫెడరల్ ఫ్రంట్‌కు సుప్రీం లీడర్ అని చెప్పుకుంటున్న ఓవ్యక్తి, అవినీతి రాజు అయిన దొంగబ్బాయి మాత్రం కనిపించడం లేదని, వీరిద్దరూ మోడీకి బీ-టీమ్ అనడానికి ఇంతకంటే ఆధారం ఏం కావాలి" అని ట్వీట్ చేశారు.

కాపులకు రిజర్వేషన్లు

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం ఈబీసీలకు పదిశాతం రిజర్వేషన్ లు కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడంతో కాపు రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టే సౌలభ్యం రాష్ట్ర ప్రభుత్వానికి కలిగింది. కాపు రిజర్వేషన్ లకు సంబంధించి ఈ నెల 1వ తేదిన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో చర్చ జరిగింది. దీనిని మంత్రి వర్గం ఏకగ్రీవంగా ఆమోదించి బిల్లును అసెంబ్లీలో పెట్టాలని తీర్మానించింది. ఈ తీర్మానం మేరకు బుధవారం శాసనసభలో కాపు రిజర్వేషన్ బిల్లును బీసీ సంక్షేమ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టారు. దీనిని సభ ఆమోదించింది. దీనిపై గురువారం శాసనసభలో చర్చ జరగనుంది.కాగా, వివిధ అంశాలకు సంబంధించి రాష్ట్ర శాసనసభ బుధవారం 12 బిల్లులను ఆమోదించింది. క్రైస్తవ మతం తీసుకున్న ఎస్సీల సంక్షేమానికి సంబంధించిన సవరణ బిల్లుతో పాటు ఆంధ్ర ప్రదేశ్ విలువ ఆధారిత పన్ను సవరణ, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ విశ్వ విద్యాలయాల (స్థాపన, క్రమబద్ధీకరణ) సవరణ బిల్లు, ఆంధ్రప్రదేశ్ ప్రపంచ స్థాయి డిజిటల్ విద్యా బోధనల ప్రజ్ఞా పాటవముల కేంద్రం బిల్లు, ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల ఉప ప్రణాళిక బిల్లు, ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా బలహీనవర్గాల పౌరుల బిల్లు, ఏపీ ఫిజియోథెరపీ బిల్లు, ఏపీ సింహాచల వరాహా లక్ష్మీనరసింహస్వామి టెంపుల్ భూముల బిల్లు,ఏపీ రీషెటిల్‌మెంట్ రిజిస్ట్రేషన్‌సవరణ, ఏపీ అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ , ఏపీ ఫ్యాక్టరీస్ అమెండ్‌మెంట్ బిల్లు,ఏపీ ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ అమెండ్‌మెంట్ , లేబర్ లాస్ ఏపీ అమెండ్‌మెంట్ కాంపౌండింగ్ ఆఫ్ అఫెన్సెస్, వ్యాట్ చట్ట సవరణ బిల్లు తదితర బిల్లులను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అలాగే ఆంధ్రప్రదేశ్ శాసనసభ బుధవారం పలు బిల్లులను ఆమోదించింది. ఏపీ విలువ ఆధారిత పన్ను సవరణ బిల్లును మంత్రి అచ్చెన్నాయుడు, ప్రైవేటు విశ్వ విద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు, ప్రపంచ స్థాయి విద్యా బోధనల ప్రజ్ఞపాటవాల కేంద్రం బిల్లును మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు.

నా మతం పేదరికం: చంద్రబాబు

"నా మతం పేదరికం..పేదలందరికీ న్యాయం చేయడమే నా లక్ష్యం ..నాకు కులమతాలు లేవు.. అందరూ సమానమే..అందరికీ సమాన అవకాశాలు కల్పించడమే ధ్యేయం "అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. క్రైస్తవ మతంలోకి మారిన ఎ స్సీలకు ఎస్సీ ఫలాలు అందేలా రాజ్యాంగ సవరణ చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగీవంగా ఆమోదించింది. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ తీర్మానాన్ని కేంద్రానికి పంపించి, దళితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.ఎస్సీలు క్రైస్తవ మతంలోకి మారడం వల్ల వారిని బీసీలుగా పరిగణించబ డుతున్నారని,పైగా వారికి అక్కడ ఎటువంటి లబ్ధి లభించకపోగా, అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అటువంటి వారికి న్యాయం చేయాలని భావించి, ఈ తీర్మానం చేశామన్నారు. వారిని ఆర్థికంగా పైకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నదన్నారు. కుల వ్యవస్థ అడ్డుగోలుగా నిలవడం వల్ల వారి అభివృద్ధి ఆగిపోయిందన్నారు. వారికి రాజ్యాంగ బద్ధంగా రక్షణ,భద్రత కల్పించేందుకు దళిత క్రైస్తవులకు సంబంధించి తీర్మానం చేసి, కేంద్రానికి పంపిస్తున్నామన్నారు. ఎస్సీలు క్రైస్తవ మతంలోకి మారినా అభివృద్ధి లేదన్నారు. కాగా తీర్మానానికి బీజేపీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఆ పార్టీ శాసనసభా ప క్ష నేత విష్ణుకుమార్‌రాజు సభకు తెలిపారు.

అవార్డులు తీసుకుని విమర్శలా?

• జగన్‌ని వెనకేసుకొచ్చే అవసరం మాకు లేదు • పవన్ మీద ఎందుకంత ప్రేమ?

• గవర్నర్ ప్రసంగం ధన్యవాదాల తీర్మానంపై బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు



అమరావతి, ఆంధ్రప్రభ : ఒక పక్క అవార్డుల తీసుకుంటూనే మరోపక్క విమర్శలు చేస్తున్నారని బీజేపీ శాసనసభాపక్షనేత విష్ణుకుమార్‌రాజు టీడీపీ నేతలపై మండిపడ్డారు. బుధవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడుతూ ఏపీలో కేంద్ర సహకారంతోనే 10.66 వృద్ధిరేటు నమోదయిందన్నారు. విప్ కూన రవికుమార్ ప్రధాని మోడీ గల్లీ లీడర్ అని చెప్పడం సరికాదని, రాష్ట్రంలో పబ్లిసిటీ బాగా చేస్తున్నారని, అందుకు అవార్డు కూడా ఇవ్వాలని వ్యంగ్యంగా స్పందించారు. పెన్షన్ రెట్టింపు చేయడం మంచి నిర్ణయమని, కాని ఒక రేషన్ కార్డుతో ఒక్కరికే పెన్షన్ ఇవ్వడం సరికాదని, ఒక్క రేషన్ కార్డులు అర్హులు ఉన్నవారికి కూడా ఇవ్వాలన్నారు. దివ్యాంగులకు మెడికల్ సర్టిఫికెట్లు ఇవ్వటంలేదని, ఆవిషయం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి-చంద్రన్న భీమాలో ప్రధానమంత్రిని తీసేశారని, తన నియోజకవర్గంలో 39మందికి చంద్రన్న భీమా రావటం లేదని ఈవిషయాన్ని గతంలో కూడా చెప్పానన్నారు. పసుపు-కుంకుమ రూ.10వేలు ఇవ్వడం మంచిదేనని, తానైతే రూ.11వేలు ఇచ్చేవాడినని, ప్రజల సొమ్ము ప్రజలకి ఇవ్వటానికి అభ్యంతరం ఏమీ లేదన్నారు. దేశంలో స్వతంత్ర్యం వచ్చిన తర్వాత సంస్కరణలు తెచ్చింది బీజేపీ ప్రభుత్వమేనని, ఆర్థికంగా వెనుక బడిన అగ్రవర్ణ పేదలకు 10శాతం రిజర్వేషన్ తీసుకరావటం జరిగిందన్నారు. రాష్ట్రంలో బీజేపీ మీద నిందలు వేస్తున్నారని, ఆఖరికి తుఫాన్ వచ్చినా బీజేపీయే తెచ్చిందని అంటారని మండి పడ్డారు. క్షత్రియులకు బడ్జెట్‌లో రూ.50కోట్లు కేటాయించినందుకు ముఖ్యమంత్రిని అభినందిస్తున్నానని, అదేవిధంగా కమ్మ, రెడ్డి, ఇతర అగ్రకులాల్లో కూడా పేదలు వున్నారని వాళ్లకు కూడా కేటాయించాలన్నారు. ఫిబ్రవరి 9న 4లక్షల గృహప్రవేశాలు జరుగుతున్నాయని, 2015లో ప్రధాని మోడీ ఈ పథకాన్ని ప్రారంబించారని, ఇది కేంద్ర సహకారంతోనే ఇది సాధ్యమవుతుందన్నారు. పట్టణ ప్రాంతాలలో 365 చదరపు అడుగులు గృహం నిర్మించుకునే పేదలకు నెలకు రూ.2900 కట్టాలని, కాని అలా 20 సంవత్సరాలు కట్టాలంటే ఇబ్బందిగా ఉంటుందని, దీనిని మార్పు చేసేవిధంగా ప్రభుత్వం ఆలోచించాలన్నారు.

కేజీహెచ్ ఆస్పత్రిలో నర్సింగ్ స్టాఫ్, డాక్టర్లు లేరని, అక్కడకి వచ్చే రోగులకు కొంతమంది బ్రోకర్లు ఇక్కడ ట్రీట్ మెంట్ సరిగా వుండదని చెప్పి ప్రైవేటు ఆస్పత్రులకు పంపిస్తున్నారని, అక్కడ ఫీజులు కట్టలేక పేదలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు డబ్బు మొత్తం కేంద్రమే ఇస్తుందని, కేంద్రం రాష్ట్రానికి పలు విధ్యాసంస్థలు ఇస్తే వీటి నిర్మాణం 30సంవత్సరాలు పడుతుందని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో మిగులు విద్యుత్‌కు కేంద్ర ప్రభుత్వమే కారణమని, 2014లో కేంద్రం 24గంటల కరెంటు పథకంలో రాష్ట్రానికి అవకాశం కల్పించిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వమే కారణమని, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అంతర్జాతీయ విమానాశ్రయాలు విశాఖ, తిరుపతి, విజయవాడ, భోగాపురం, కడప పెట్టడం జరిగిందన్నారు.



కల్తీ విత్తనాల దందా!

• డీలర్లతో అధికారుల కుమ్మక్కు • రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని సభ్యుల ఆవేదన • ఏకీభవించిన స్పీకర్ కోడెల



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రవ్యాప్తంగా కల్తీ, నకిలీ విత్తనాల విషయంలో విత్తనాభివృద్ధి సంస్థ అధికారుల తీరును పలువురు ఎమ్మెల్యేలు తప్పుబట్టారు. విత్తన డీలర్లతో కుమ్మక్కై నాసి, నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను నిలువునా ముంచుతున్నట్లు వారు ఆరోపించారు. నకిలీ విత్తనాల సరఫరాదారులను కేవలం లైసెన్స్ సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటున్నట్లు దుయ్యబట్టారు. వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి తరపున పౌరసరఫరాల మంత్రి పత్తిపాటి పుల్లారావు సమాధానంతో సంతృప్తి చెందని ఎమ్మెల్యేలు కీలక అంశంపై జరిగే చర్చకు సంబంధిత మంత్రి రాకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్ సైతం సభ్యుల వాదనతో ఏకీభవించి కల్తీ, నకిలీలను నిలువరించడంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని సూచించారు. శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి వేసిన ప్రశ్నపై శాసనసభలో చర్చ జరిగింది. చర్చను ప్రారంభించిన వేణుగోపాల రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించేందుకు ప్రభుత్వపరంగా ధృవీకరణ అధికారిని నియమించకపోవడం శోచనీయమన్నారు. తరుచూ విజిలెన్స్ అధికారుల దాడుల్లో పెద్ద ఎత్తున కల్తీ విత్తనాలు పట్టుబడుతున్నప్పటికీ ప్రభుత్వపరంగా చర్యలు శూన్యమన్నారు. దేశవ్యాప్తంగా నష్టపోతున్న రైతుల్లో మెజారిటీ శాతం కల్తీ, నకిలీ విత్తనాలే కారణమన్నారు. ఇలాంటి పరిస్థితిని అరికట్టాలంటే స్థానిక ప్రజాప్రతినిధులతో కమిటీలు వేసి సీజన్‌కు ముందే రైతుల్లో అవగాహన కలిగిస్తే మంచిదని అభిప్రాయపడ్డారు. కల్తీ విత్తనా లను సీజ్ చేయడం వలన ఒనగూరే ప్రయోజనం లేదంటూ చట్ట ప్రకారం డీలర్లకు రూ.50వేల జరిమానా, ఆరు మాసాల జైలు విధించే అవకాశాన్ని ఎందుకు వినియోగించడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ గుంటూరు జిల్లా కేంద్రంగా రాష్ట్రంలో నకిలీ విత్త నాల దందా సాగుతోందన్నారు. విత్తన సరఫరా అధికారులు, డీలర్లు కుమ్మక్కై రైతులను నిలువునా ముంచు తున్నారన్నారు. చివరకు విత్తనాభివృద్ధి సంస్థ అధికారులనుసైతం డీలర్లు ప్రభావితం చేస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. సభ్యుల ఆందోళనపై మంత్రి పత్తిపాటి పుల్లారావు సమాధానమిస్తూ సబ్సిడీ విత్తనాలను ఏపీ ట్రేడ్ సీడ్ ఏజెన్సీ ద్వారా సరఫరా చేస్తుండగా, ఇతర విత్తనాలు నేరుగా డీలర్ల నుంచి రైతులు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. కర్నూలు పట్టణానికి చెందిన నర్మదా సాగర్ ట్రేడర్ లైసెన్స్‌ను రద్దు చేయడంతో పాటు 13 ఏజెన్సీల లైసెన్స్‌ను ఏడాది పాటు సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. గతంలో తాను వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు డీలర్ల లైసెన్స్‌లు రద్దు చేయడంతో పాటు పీడీ చట్టం కింద అరెస్టు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికే లక్షల క్వింటాళ్ల నకిలీ ధాన్యం సీజ్ చేశామని, వీటి విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని చెప్పారు. సభ్యుల ఆవేదనను సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కల్తీ విత్తనాలు నిజం



రాష్ట్రంలో కల్తీ విత్తనాల విక్రయాలు నిజమని స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు అన్నారు. పత్తి, మిరప, కంది విత్తనాల్లో భారీగా కల్తీ జరుగుతున్నట్లు తెలిపారు. కంది ఏపుగా పెరిగినప్పటికీ గింజ కూడా రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పంట పోవడంతో పెట్టిన పెట్టుబడులు రాక రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారని స్పీకర్ పేర్కొన్నారు. సభ్యులు ఆరోపించినట్లుగా విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు డీలర్లతో కుమ్మక్కు కావడం నిజమేనన్నారు. కల్తీ విత్తనాల వలన రైతులే కాక వ్యవసాయం, అభివృద్ధిపరంగా రాష్ట్రం నష్టపోతుందనే విషయం గుర్తుంచుకోవాలన్నారు.

కాపులకు మరింత రిజర్వేషన్ కల్పిస్తే ఇబ్బంది ఏంటి..?

• ఎమ్మెల్యే విష్ణుకుమారరాజు



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో కాపులకు 5 శాతం రిజర్వేషన్లు ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారని, ఇంకా ఎక్కువ ఇస్తే వచ్చిన ఇబ్బంది ఏమిటని ఎమ్మెల్యే విష్ణుకుమారరాజు అన్నారు. బుధవారం శాసనసభ సమావేశాల సందర్భంగా ఆయన మీడియాతో చిట్‌చాట్ చేస్తూ గతంలో కాపు రిజర్వేషన్ల బిల్లును హడావుడిగా పెట్టి కేంద్రానికి పంపారని, ఇవి చెల్లవన్న విషయం సీఎం చంద్రబాబుకు తెలుసని వ్యాఖ్యానించారు. అధికారం ఉందిగదా అని బిల్లును అసెంబ్లీలో పెట్టారని అన్నారు. అగ్రకులాల్లో వెనుకబడిన వారికి మేలు చేయాలన్న సదుద్దేశంతో ప్రధాని మోడీ ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో తాను మళ్ళీ విశాఖ నార్త్ నుంచే పోటీ చేస్తానని, అయితే ఏ పార్టీ నుంచి పోటీ చేయాలన్న విషయాన్ని తన నియోజకవర్గ ప్రజలు నిర్ణయిస్తారని చెప్పారు. కొంత మంది నేతలు నియోజకవర్గాలు మారి పోటీ చేస్తున్నారని, ఇదంతా ఓటమి భయంతోనేనన్నారు. అమిత్ షా పర్యటనకు ప్రజల నుంచి ఆశించిన స్పందన లేదని మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ పసుపు-కుంకుమ కార్యక్రమం అదే సమయంలో ఉండటం వల్ల జనం తక్కువగా వచ్చారన్నారు. ఈ చిట్టచివరి అసెంబ్లీ సమావేశాలకు వైకాపా ఎమ్మెల్యేలు హాజరయ్యేలా స్పీకర్ చర్యలు తీసుకుని ఉంటే బాగుండేదన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు.

ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి మద్దతు

• పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి



అమరావతి, ఆంధ్రప్రభ : కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని నిరసిస్తూ గురువారం ఉపాధ్యా, ఉద్యోగ సంఘం ఫ్యాప్టో జరుప తలపెట్టిన ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి తెలిపారు. భోజన విరామ సమయంలో ఆయన మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లా డుతూ, రాష్ట్రవ్యాప్తంగా 1.84 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరిస్తామని గత సమావేశాల సందర్భంగా ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. హామీ ఇచ్చి ఐదు నెలలు గడచినా నేటి వరకూ అమలు చేయకపోగా ఆ సమస్యను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. బుధవారం కూడా ఈ అంశంపై వాయిదా తీర్మానం ఇచ్చామని, టీ బ్రేక్‌లో మంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని స్పీకర్ హామీ ఇచ్చి దానిని మరిచిపోయారని తెలిపారు. ఈ విధానం రద్దు చేయకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పోరాటం ఉధృతం చేస్తాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 10,224 భాషా పండితులు, 2,603 వ్యాయామోపాధ్యా యులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తామని డిసెంబరు 17, 2018న జీవో నెం. 91 జారీ చేశారన్నారు. కానీ నేటి వరకూ ఆవి అమలు జరగలేద న్నారు. దీంతో ఉపాధ్యాయులు మానసిక సంఘర్షణకు గురవుతున్నారన్నారు. సత్వరమే వారికి పదోన్నతులు కల్పించాలన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 19 వేల ఉపాధ్యాయ పోస్టులను కూడా సత్వరమే భర్తీ చేయాలన్నారు. పురపాలక శాఖలో పదోన్నతులు లేకుండా పోయాయా న్నారు. వీరికి పదోన్నతుల విషయంలో మంత్రి హామీ ఏమైందో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు శాపంగా పరిణమిం చిన జీవో నెం 12ను సత్వరమే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. వీరికి మినిమం టైం స్కేల్‌తోపాటు ఉద్యోగ భద్రత కల్పించాల్సి ఉందన్నారు. ఇదే అంశాన్ని జీవోఎం, ఎమ్మెల్సీల కమిటీ ప్రభుత్వానికి రికమెండ్ చేసిందన్నారు. ఆ విషయాన్ని కూడా ఈ ప్రభుత్వం పట్టించుకోలదన్నారు. ఈ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

రుణాల మంజూరులో బ్యాంకర్ల నిర్లక్ష్యం

• మండలిలో సభ్యుల ధ్వజం • ప్రాజెక్టులపై రూ.52,535 కోట్లు వెచ్చించాం • ఎన్టీఆర్ జలసిరి అద్భుత కార్యక్రమం: మంత్రి లోకేష్ • సీపీఎస్‌పై పీడీఎఫ్ ఎమ్మెల్సీల నిరసన

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలకు స్వయం ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రుణాలు మంజూరు చేసినా బ్యాంకర్లు సరైన సహకారం అందించడంలేదని ఎమ్మెల్సీలు శమంతకమణి, రామ సూర్యారావు, సోము వీర్రాజులు ధ్వజమెత్తారు. బుధవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఎస్సీ, ఎస్టీల స్వయం ఉపాధి పథకాలపై ఎమ్మెల్సీలు మాట్లాడుతూ బ్యాంకర్లు ష్యూరిటీ లేనిదే రుణాలు మంజూరు చేయడంలేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే బ్యాంకర్లతో ఒక సమావేశాన్ని నిర్వహించి లబ్ధిదారులకు రుణాలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి నక్కా ఆనందబాబు సమాధానం ఇస్తూ బ్యాంకర్ల నుంచి కొంత ఇబ్బంది ఉన్న మాట వాస్తవమేనని, ఇప్పటికే ఎస్ఎల్‌బిసీలోసైతం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ రుణాలను వెంటనే ఇవ్వాలని ఆదేశాలను కూడా జారీ చేశారని తెలిపారు. అదే విధంగా జిల్లా కలెక్టర్లను కూడా సమన్వయం చేసి లబ్ధిదారులకు రుణాలు అందించేలా ఆదేశాలిచ్చామన్నారు. త్వరలోనే బ్యాంకర్లతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీనిచ్చారు.

ప్రాజెక్టులపై రూ.52,535 కోట్లు వెచ్చించాం

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించి ఇప్పటివరకు రూ.52,535.69 కోట్లను వెచ్చించినట్లు రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు తెలిపారు. బుధవారం జలవనరుల శాఖ ప్రాజెక్టులపై ఖర్చుచేసిన నిధుల వివరాలకు సంబంధించి మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ 2014-15లో రూ.9,223.75 కోట్లు, 2015-16కు సంబంధించి రూ.9545.87 కోట్లు, అదే విధంగా 2016-17లో 10,561.68 కోట్లు, 2017-18 రూ.12,100.28 కోట్లు, 2018-19లో రూ.11,104.11 కోట్లను ఖర్చు చేశామని వెల్లడించారు. పోలవరంకు సంబంధించి రూ.15,369 కోట్లు ఇప్పటి వరకు ఖర్చుచేయడం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం నుంచి ఇంకా రూ.3,866.78 కోట్లు రావాల్సి ఉందని వెల్లడించారు. ఇంతవరకు డీపీఆర్-2కి సంబంధించి కేంద్రం ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఉత్తరాంధ్ర సుజల శ్రవంతిని ఏడాది లోగా పూర్తి చేస్తామని తెలిపా రు. గడిచిన నాలుగేళ్ళలో పట్టి సీమ ద్వారా కృష్ణా డెల్టాను సస్యశ్యామలం చేయడమే కాకుండా ఆ నీటిని రాయలసీమకు తరలించి ఒక చరిత్ర సృష్టించామన్నారు. ఈ నెల నాలుగోవారంలో కుప్పంకు కూడా కృష్ణా జలాలను పంపేవిధంగా చర్యలు చేపడుతు న్నామని తెలిపారు. అనంతపురంకు కృష్ణా జలాలు తరలించడం వల్లే కియా కార్ల కంపెనీ వచ్చిందన్నారు. పోలవరం ప్రాజెక్టు నుంచి జూలైలో గ్రావిటీతో నీళ్ళు అందించేందుకు తగిన చర్యలు తీసుకున్నామని స్పష్టంచేశారు.

ఎన్టీఆర్ జలసిరి అద్భుత కార్యక్రమం : మంత్రి లోకేష్



చిన్న, సన్నకారు రైతులకు ఎన్టీఆర్ జలసిరి పథకం ఒక వరమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. ప్రకాశం జిల్లాలో ఎన్టీఆర్ జలసిరి పథకానికి సంబంధించి అదనపు ప్రతిపాదనలపై ఎమ్మెల్సీ కరణం బలరాం అడిగిన ప్రశ్నలకు ఆయన జవాబిస్తూ రాష్ట్రంలో ఐదెకరాలలోపు ఉన్న రైతులకు 200 అడుగుల వరకు ప్రభుత్వం తరపున బోర్లు వేస్తున్నామని తెలిపారు. ఒక్కొక్క బోరుకు మోటర్‌తో కలిపి రూ.2.70 లక్షలు ఖర్చుచేస్తున్నామని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన రైతులు కేవలం రూ.6 వేలు చెల్లిస్తే చాలని, మిగిలిన వర్గాలవారు రూ.27 వేలు చెల్లిస్తే మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఇప్పటివరకు రూ.1000 కోట్లను ఈ పథకం నిమిత్తం ఖర్చుచేశామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 18,207 బోర్లు వేసినట్లు వెల్లడించారు. ప్రకాశం జిల్లాలో తాగునీరు, సాగునీటి ఉన్న ఇబ్బందిని ప్రభుత్వం గుర్తించిందని, ఈ ఏడాది ఆఖరులోగా పూర్తి స్థాయిలో ఆ జిల్లా వాసులకు నీరందిస్తామన్నారు. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నామని తెలిపారు.

సీపీఎస్‌పై పీడీఎఫ్ ఎమ్మెల్సీల నిరసన

ప్రస్తుతం ఉద్యోగులకు అమలు చేస్తున్న సీపీఎస్ విధానాన్ని వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఛైర్మన్ పోడియం వద్ద నిరసనకు దిగారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎమ్మెల్సీలు వై.శ్రీనివాసుల రెడ్డి, రామసూర్యారావు, కత్తినరసింహారావు, విఠపు బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. అంతకు ముందు సీపీఎస్ విధానంపై సభలో చర్చించాలని వారిచ్చిన తీర్మానాన్ని మండలి డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం తిరస్కరించారు.

కన్నా ఇంటిపై బీజేపీ, లోపల వైసీపీ జెండాలు!

మండలి విప్ బుద్దా వెంకన్న



అమరావతి, ఆంధ్రప్రభ : ఏపీ బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఇంటి మీద బీజేపీ జెండా ఎగురుతూ కనిపిస్తుందని, కానీ లోపలికెళ్లి చూస్తే వైసీపీ జెండా కనిపిస్తుందని మండలి విప్ బుద్దా వెంకన్న ఎద్దేవా చేశారు. బుధవారం భోజన విరామ సమయంలో ఆయన మీడియాపాయింట్ వద్ద మాట్లాడుతూ, ఈ రాష్ట్రంలో గజ దొంగ ఎవరైనా ఉన్నారంటే అది కన్నా లక్ష్మీ నారాయణేనని చెప్పారు. 10 ఏళ్లపాటు మంత్రిగా కొనసాగి రాష్ట్రసొమ్మును అప్పణంగా దోచేసిన కన్నా నీతి, నిజాయితీలతో అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుపై అవాకులు చెవాకులు పేలుతున్నారన్నారు. బీజేపీ పార్టీయే దొంగలపార్టీ అన్నారు. ప్రస్తుతం ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా రాష్ట్రంలో నిర్వహిస్తున్న బస్ యాత్రలు ప్రజల్లేక వెలవెలబోతున్నాయన్నారు. ఈ బస్సులతో ప్రస్తుతం పని అయ్యాక వాటిని షెడ్డుల్లో పెట్టుకోవాలని సూచించారు. ఎన్నికల అనంతరం బీజేపీ శవ యాత్రకు ఇవే బస్సులను వాడుకునేందుకు ఉపయోగించు కోవాలంటూ బీజేపీ నేతలకు సలహా ఇచ్చారు. చార్లెస్ సోమరాజుకు గురువు కన్నా లక్ష్మీనారాయణ అని మండిపడ్డారు. ఆయన తన పదేళ్ల పదవీకాలంలో దోచిన సొమ్మును దాచుకునేందుకు బీజేపీతో చేతులు కలిపారన్నారు. ఇటువంటి వారి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా కన్నా లక్ష్మీనారాయణ ముఖ్యమంత్రిపై చేస్తున్న నిరాధార ఆరోపణలను ఆపకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

గవర్నర్ ప్రసంగంపై 'పెద్దల' మిశ్రమ స్పందన

అమరావతి, ఆంధ్రప్రభ : బడ్జెట్ సమావేశాల సందర్భంగా తొలిరోజు రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ చేసిన ప్రసంగంపై బుధవారం ఇన్‌ఛార్జి ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన శాసన మండలి చర్చల్లో సభ్యులు మిశ్రమంగా స్పందించారు. టీడీపీ ఎమ్మెల్సీ వైవిబి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రం సహాయ నిరాకరణ చేస్తున్నా గత నాలుగున్నరేళ్లలో దేశంలో ఎక్కడాలేని విధంగా 136 సంక్షేమ కార్యక్రమాలకు లక్షకోట్లకు పైగా ఖర్చు చేసిన విషయం గవర్నర్ వివరించి చెప్పడం అభినందనీయమని కొనియాడారు. హోదాను, విభజన హామీలను అమలు చేకుండా, హక్కుగా ఇవ్వాల్సిన నిధులను కూడా ఇవ్వకుండా, జగన్, కేసీఆర్‌లను ఏజెంట్లుగా చేసుకొని మోడీ, అమిత్‌షాలు చేస్తున్న రాజకీయ కుట్రలను గమనిస్తున్న ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బీజేపీ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ గవర్నర్ చేత అబద్దాలు, అసత్యాలు చెప్పించడంతో పాటు ఆంధ్రాను అన్ని విధాల ఆదుకుంటున్న మోడీ ప్రభుత్వాన్ని అన్యాయంగా తిట్టించారన్నారు. దీనిపై స్పందించిన మంత్రి జవహర్ అబద్దాలు గట్టిగా చెబితే నిజం అవుతుందనే భ్రమలో రాష్ట్ర బీజేపీ నేతలు ఉన్నారని, ఆంధ్రులను నమ్మించి మోసం చేసినందుకే ఇటీవల విజయనగరంలో జరిగిన అమిత్‌షా సభకు పట్టుమని వంద మంది కూడా ప్రజలు హాజర కాలేదన్నారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ వై.శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగం ద్వారా సంక్షేమాంధ్రకు పాలకులు పెద్దపీట వేసినట్లు అర్థమయిందని, కానీ అర్హులైన వారికి పింఛన్లు, ఆరోగ్య సేవలు, పౌష్టికాహారం పంపిణీ ఇంకా అందించాల్సిన అవసరం ఉందంటూ పశ్చిమ బెంగాల్ తరహా సీపీఎస్ విధా నాన్ని రాష్ట్రంలో కూడా రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. టీడీపీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా చంద్రబాబు ప్రభుత్వం దేశానికే ఆదర్శవంతమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమా లను చేపడుతోందన్నారు. టీడీపీ ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు మాట్లాడుతూ కేంద్రం సహకరించకపోయినా, రాజకీయ కుట్రలకు తెగబడుతున్నా ముఖ్యమంత్రి, యువ మంత్రి నారా లోకేష్‌ల నిరంతర శ్రమ, పట్టుదల, కృషికి ఫలితంగా గత నాలుగున్నరేళ్లలో 671 అవార్డులు ఏపీకి వచ్చాయని, ఇలాగే అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే చంద్రబాబు నాయకత్వం మళ్లీ రావాలనే భావన ప్రజల్లో బలంగా ఉందన్నారు. ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడు తూ ప్రజా సమస్యలను పట్టించుకోకుండా గుడ్డెద్దు చేలో పడ్డట్టు పాదయాత్రలు చేస్తున్న జగన్‌ను, హోదాను అమలు చేయకుండా, రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, కేంద్ర ప్రభుత్వ, రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ నిరంకుశ పాలన చేస్తున్న మోడీని సాగనంపేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

అధికారులు 'చుక్క'లు చూపుతున్నారు

• శాసనసభలో పలువురు సభ్యులు



అమరావతి, ఆంధ్రప్రభ : చుక్కల భూముల విషయంలో అధి కారులు చుక్కలు చూపిస్తున్నారంటూ పలువురు సభ్యులు శాసనసభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభు త్వపరంగా విధి విధానాలు రూపొందించినప్పటికీ వ్యక్తిగత ప్రయోజనాలను ఆశించి సమస్య పరిష్కారానికి తగిన విధంగా స్పందించడం లేదన్నారు. రాష్ట్రంలో చుక్క ల భూమి యజమానుల సమస్యపై ఎమ్మె ల్యే శ్రీరామ్ రాజ గోపాల్ అడిగిన ప్రశ్నపై బీజేపీ పక్షనేత పి.వి ష్ణుకుమార్ రాజు చర్చను ప్రారంభిస్తూ ఏదేనా ప్రాంతంలో శ్మశానం వంటివి 22ఎలో ఉంటే ఆ ప్రాంతం మొత్తాన్ని అదే సర్వేలో చేర్చడం వలన యజమానులు మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. కొన్ని చోట్ల తనకు నచ్చని వ్యక్తుల భూములను కూడా అధికారులు 22ఎలో చేర్చుతున్నారన్నారు. తమ వద్దకు పింఛన్లు, రేషను కార్డుల కోసం ఎవరూ రావడం లేదని, కేవలం చుక్కల భూముల సమస్యపై మాత్రమే వస్తున్నారని చెప్పారు. అధికారుల చుట్టు తాము కాళ్లరిగేలా తిరిగినా సమస్య పరిష్కారం కావడం లేదని, కమిటీలు, కలెక్టర్ అంటూ సమస్యను సాగదీయకుండా ప్రజలకు విముక్తి కలిగించాలని కోరారు. వెలగపూడి రామకృష్ణమాట్లాడుతూ ఉడా అధీకృత లే అవుట్లను సైతం 22ఎలో చేర్చుతున్నట్లు ఆరోపించారు. అనేక మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపడం లేదన్నారు. సభ్యుల ఆందోళనకు రాష్ట్రరెవిన్యూ మంత్రి కేఈ కృష్ణమూర్తి సమాధానమిస్తూ చుక్కల భూముల సమస్యలను పరిష్కరిం చడంలో సమస్యలు ఎదురవుతున్న విషయం నిజమేనన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని సమస్య పరిష్కారానికి పలు మార్గదర్శకాలు జారీ చేశామన్నారు. 12 ఏళ్లు అంతకంటే ఎక్కువ కాలం ఆధీనంలో ఉన్న భూములకు సంబంధించి ప్రభుత్వం అడిగిన ఆధారాలు సమర్పిస్తే వెంటనే పరిష్కరించాలని అధికారు లను ఆదేశిం చామన్నారు. కలెక్టర్లకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని సబ్ డివిజనల్ అధికారులకు కూడా అధికారాలు ఇచ్చామన్నారు. ఇప్పటికే చాలా వరకు సమస్యను పరిష్కరించామని చెపుతూ ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

లింకు నిధుల్లో జాప్యం నిజమే


• శాసనసభలో మంత్రి ఆదినారాయణ రెడ్డి



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని పూర్తి చేసిన లింకు రోడ్లకు నిధుల విడుదలలో జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనని మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదినారాయణ రెడ్డి అంగీకరించారు. అయితే కొన్ని చోట్ల మాత్రమే ఈ పరిస్థితి ఉందని చెపుతూ త్వరితగతిన సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోనున్నట్లు హామీ ఇచ్చారు. ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్రంలో పుంత రోడ్ల నిర్మాణంపై ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన అడిగిన ప్రశ్న సందర్భంగా జరిగిన చర్చకు మంత్రి సమాధాన మిచ్చారు. లింకు రోడ్ల నిర్మా ణానికి ఎన్ఆర్జీఎస్‌ను అనుసంధానం చేసినందున జిల్లా కలెక్టర్లు మాత్రమే నిధులు మంజూరు చేయాల్సి ఉందన్నారు. మార్కె టింగ్ శాఖ కేవలం 20శాతం మాత్రమే ఇస్తుందని, ఇది జాప్యం జరగడం లేదన్నారు. దీనిపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో స్థానిక సమస్యల వలన కొన్ని చోట్ల నిధులు విడుదల జాప్యం జరుగుతున్నట్లు అంగీకరించారు. సమస్యపై పలు మార్లు అధికారులతో కలిసి ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన మాట్లాడుతూ గత మూడేళ్లుగా లింకు రోడ్ల నిర్మాణం జరగకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదే మంటే అధికారులు నిధులను నిలిపే సినట్లు చెపుతున్నారని, సమస్య పరిష్కారానికి వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ మూడేళ్లుగా నిధులు నిలిచిపోవడంతో లింకు రోడ్ల నిర్మా ణానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదన్నారు. ఎమ్మెల్యే మోదుగుల వేణు గోపాలరెడ్డి మాట్లాడుతూ పంటను ఇంటికి, మార్కెట్‌కు తరలించేటప్పుడు లింకు రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు.

వెల్లింగ్టన్‌లో తొలి టీ20 మ్యాచ్‌లో రోహిత్ సేన పేలవమైన ఆటను ప్రదర్శించింది. అన్ని రంగాల్లో ప్రత్యర్థి జట్టు ముందు చేతులెత్తేసింది. 80 పరుగుల తేడాతో ఓడింది. న్యూజిలాండ్ బ్యాట్స్‌మెన్‌ను అడ్డుకోవడంలో భారత బౌలర్లు విఫలమయ్యారు. భారత్‌తో ఆడుతూ న్యూజిలాండ్ టీ20ల్లో అత్యధిక పరుగులు 219 సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన రోహిత్ సేన ఛేదనలో కూడా చేతులెత్తేయడంతో న్యూజిలాండ్‌కు సిరీస్‌లో తొలి గెలుపును అందుకుంది.

టిమ్‌సీఫెర్ట్ 84(43బంతులు, ఫోర్లు-7 సిక్స్-6)



తొలి టీ20 కివీస్‌దే

న్యూజిలాండ్ బ్యాట్స్‌మెన్ ఆరంభం నుంచే భారత బౌలింగ్‌ను చితక బాదారు. మూడు ఓవర్లలోనే కివీస్ స్కోరు 28కి చేరుకుంది. కివీస్ యువ ఓపెనర్ టిమ్ సీఫెర్ట్ దూకుడుగా ఆడుతూ 30 బంతుల్లో టీ20ల్లో తన తొలి అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. కివీస్ తొలి వికెట్ 86 పరుగుల వద్ద పడింది. కృణాల్ పాండ్యా బౌలింగ్‌లో కోలిన్ మన్రో 34(20బంతులు, ఫోర్లు-2, సిక్స్-2) పరుగులు చేసి విజయ్‌శంకర్‌కు క్యాచిచ్చి ఔటయ్యాడు. కెప్టెన్ విలియమ్సన్ క్రీజులోకి వచ్చి సీఫెర్ట్ తో జతకలిసి దూకుడుగా ముందుకు సాగారు. భారత్‌తో ఆడుతూ టీ20ల్లో న్యూజి లాండ్ రెండో అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యం (86 పరుగులు) సీఫెర్ట్, మన్రోలు నమోదుచేశారు. 2017లో రాజ్‌కోట్‌లో ఆడిన టీ20లో మార్టిన్ గుప్టిల్ -కోలిన్ మన్రోలు 105 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కొరకరాని కొయ్యగా మారి భారత బౌలర్లను పరీక్షపెడుతున్న టిమ్ సీఫెర్ట్ రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. టిమ్ సీఫెర్ట్ 84(43బంతులు, ఫోర్లు-7, సిక్స్-6) పరుగులు చేసి ఖలీల్ అహ్మద్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డయ్యాడు. తన కెరియర్లో తొలి మ్యాచ్‌ను ఆడుతున్న డేరిల్ మిచెల్ క్రీజులోకి వచ్చాడు. డేరిల్ 8(6బంతులు, ఒక ఫోర్) హార్దిక్ పాండ్యా బౌలింగ్‌లో దినేష్ కార్తిక్‌కు క్యాచిచ్చి పెవిలియన్‌బాటపట్టగా రాస్ టేలర్ బ్యాటింగ్‌కు వచ్చాడు. చాహల్ వేసిన తర్వాతి ఓవర్ తొలి బంతికే విలియమ్సన్ 34(22బంతులు, సిక్స్-3) పాండ్యాకు క్యాచిచ్చి ఔట్ కావడంతో క్రీజులోకి వచ్చిన కోలిన్ డి గ్రాండొమ్మి భారత బౌలర్లను ఎక్కువసేపు ఎదుర్కోలేక పోయాడు. 4బంతులు ఆడి మూడు పరుగులు చేసి హార్దిక్ పాండ్యా బౌలింగ్‌లో సబ్‌స్ట్యూట్ ఆటగాడు సిరాజ్‌కు క్యాచిచ్చి ఔటయ్యాడు. ఒక పక్క వికెట్లు పడుతున్నప్పటికి.. న్యూజిలాండ్ పరుగుల వేగం తగ్గలేదు. 14బంతుల్లో 23 పరుగులు చేసిన మిచెల్ రాస్ టేలర్‌ను భువనేశ్వర్ 6వ వికెట్‌గా పెవిలియన్ పంపాడు. నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి న్యూజిలాండ్ ఆరు వికెట్లకు 219 పరుగులు చేసింది. స్కాట్ కుగ్గలెయిజ్ 20(7బంతులు, ఫోర్లు-3 ఒక ఫోర్) పరుగులతో, మిచెల్ సాంట్నర్ 7(4బంతులు, ఒక ఫోర్) చేసి నాటౌట్లుగా మిగిలారు. భారత బౌలర్లలో హార్దిక్ పాండ్యా 2 వికెట్లు పడగొట్టగా, భువనేశ్వర్‌కుమార్, ఖలీల్ అహ్మద్, కృణాల్ పాండ్యా, యజువేంద్ర చాహల్ తలో వికెట్‌ను తమ ఖాతాల్లో వేసుకున్నారు.

80 పరుగుల తేడాతో భారత్‌పై గెలుపు
అన్ని రంగాల్లో విఫలమైన రోహిత్ సేన



వెల్లింగ్టన్: భారత్‌తో ప్రారంభించిన పొట్టి ఫార్మాట్ సిరీస్‌లో న్యూజిలాండ్ తొలి గెలుపును అందుకుంది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ 80 పరుగుల తేడాతో విజయం సాధించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యాన్ని పొందింది. న్యూజిలాండ్ జట్టు అన్ని రంగాల్లో ఉత్తమ ప్రదర్శన చేసింది. కివీస్ నిర్దేశించిన 219 పరుగుల లక్ష్యాన్ని అందుకోవడంలో భారత్ ఘోరంగా విఫలమయింది. కెప్టెన్ రోహిత్ శర్మ 1 పరుగుచేసి తొలి వికెట్‌గా పెవిలియన్ చేరాడు. క్రీజులోకి వచ్చిన విజయ్ శంకర్, శిఖర్ ధావన్‌తో కలిసి ముందుకు సాగినప్పటికి పవర్ ప్లే ఓవర్లు ముగిసే లోపే ధావన్ 29(18 బంతులు, ఫోర్లు-2 సిక్స్3) పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. లక్ష్య ఛేదన భారత బ్యాట్స్‌మెన్‌కు క్రమంగా కఠినంగా మారింది. మిడిలార్డర్‌లో విజయ్ శంకర్ 27(18బంతులు ఫోర్లు-2, సిక్స్-2) చేయగా, ధోనీ 39(31బంతులు, ఫోర్లు-5 సిక్స్1) కివీస్ బౌలర్లను ఎదుర్కొన్నప్పటికి మరోవైపు మిగతా బ్యాట్స్‌మెన్ అలా వచ్చి ఇలా ఔటయిపోవడం జరిగింది. లోవర్ మిడిలార్డర్‌లో ఆల్ రౌండర్ కృణాల్ పాండ్యా ఎదురు దాడి చేస్తూ..18 బంతుల్లో 20 పరుగులు చేసి మెరిశాడు. భారత జట్టులోని ముగ్గురు బ్యాట్స్‌మెన్ తలొక పరుగు చేసి ఔటవగా, పంత్ 4 పరుగులు, హార్దిక్ పాండ్యా 4 పరుగులు, దినేష్ కార్తిక్ 5 పరుగులు చేసి పెవిలియన్ చేరారు. ఖలీల్ ఒక పరుగు చేసి నాటౌట్‌గా మిగిలాడు. భారత్ ఇన్నింగ్స్ 19.2 ఓవర్లలో 139 పరుగుల వద్ద ముగిసింది. కివీస్ బౌలర్లలో టిమ్ సౌథీ 3/17, ఫెర్గుసన్ 2/22, సాంట్నర్ 2/24, ఐష్ సోధీ 2/26 వికెట్లు దక్కించుకోగా డేరిల్ మిచెల్ తన కెరియర్లో తొలి వికెట్‌ను దక్కించుకున్నాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డ్ టిమ్ సీఫెర్ట్‌కు లభించింది. అంతకు ముందు టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేపట్టిన



స్కోరు బోర్డు

న్యూజిలాండ్: టిమ్ సీఫెర్ట్ (బి) ఖలీల్ అహ్మద్ 84, కోలిన్ మన్రో (సి) విజయ్ శంకర్ (బి) కృణాల్ పాండ్యా 34, కేన్ విలియమ్సన్ (బి) హార్దిక్ పాండ్యా (సి) చాహల్ 34, డేరిల్ మిచెల్ (సి) కార్తిక్ (బి) హార్దిక్ పాండ్యా 8, రాస్ టేలర్ (సి) ఖలీల్ అహ్మద్ (బి) భువనేశ్వర్ 23, గ్రాండొమ్మి (సి) సిరాజ్ (బి) హార్దిక్ పాండ్యా 3, మిచెల్ సాంట్నర్ నాటౌట్ 7, స్కాట్ కుగ్గెలెజ్ నాటౌట్ 20 ఎక్స్‌ట్రాలు 6, మొత్తం: 219/6(20 ఓవర్లు) **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-47-1, ఖలీల్ అహ్మద్ 4-0-48-1, కృణాల్ పాండ్యా 4-0-37-1, హార్దిక్ పాండ్యా 4-0-51-2, యజువేంద్ర చాహల్ 4-0-35-1. **భారత్:** రోహిత్ శర్మ (సి) ఫెర్గుసన్ (బి) సౌథీ 1, ధావన్ (బి) ఫెర్గుసన్ 29, విజయ్ శంకర్ (సి) గ్రాండొమ్మి (బి) సాంట్నర్ 27, రిషభ్ పంత్ (బి) సాంట్నర్ 4, ధోనీ (సి) ఫెర్గుసన్ (బి) సౌథీ 39, దినేష్ కార్తిక్ (సి) సౌథీ (బి) ఐష్ సోధీ 5, హార్దిక్ పాండ్యా (సి) డేరిల్ మిచెల్ (బి) ఐష్ సోధీ 4, కృణాల్ పాండ్యా (సి) సీఫెర్ట్ (బి) సౌథీ 20, భువనేశ్వర్ కుమార్ (సి)సీఫెర్ట్ (బి) ఫెర్గుసన్ 1, చాహల్ (బి) డేరిల్ మిచెల్ 1, ఖలీల్ అహ్మద్ నాటౌట్ 1. ఎక్స్‌ట్రాలు 7, మొత్తం 139 ఆలౌట్ (19.2 ఓవర్లు) టిమ్ సౌథీ 4-0-17-3, కుగ్గెలెయిజ్ 2-0-34-0, ఫెర్గుసన్ 4-0-22-2, మిచెల్ సాంట్నర్ 4-0-24-2, డేరిల్ మిచెల్ 2.2-0-13-1, ఐష్ సోధీ 3-0-26-2.

రంజీ ఫైనల్స్



విజయానికి 148 పరుగుల దూరంలో సౌరాష్ట్ర

నాగ్‌పూర్: రంజీ ఫైనల్‌లో సౌరాష్ట్ర గెలుపుకు 148 పరుగుల దూరంలో ఉంది. నాలుగో రోజు బుధవారం ఆట ముగిసే సమయానికి సౌరాష్ట్ర జట్టు రెండో ఇన్నింగ్స్ ఆడుతూ 5 వికెట్లు కోల్పోయి 58 పరుగులు చేసింది. అంతకు ముందు ఓవర్ నైట్ స్కోరు 55/2తో విదర్భ తన రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించి 200 పరుగులకు ఆలౌటయింది. ఆదిత్య సారస్వతే చేసిన 49 పరుగులే అత్యధిక స్కోరు. సౌరాష్ట్ర బౌలర్లలో దర్మేంద్ర జడేజా 6/96 వికెట్లు తీసి విదర్భ బ్యాటింగ్‌ను శాసించాడు. కమలేష్ మక్‌వానా రెండు వికెట్లు తీయగా, జయదేవ్ ఉనాద్కత్, చేతన్ సకారియా చెరో వికెట్‌ను దక్కించుకున్నారు. దీనితో విదర్భ జట్టు సౌరాష్ట్ర ముందు గెలుపు లక్ష్యంగా 206 పరుగులు ఖరారైంది. సౌరాష్ట్ర జట్టు తన రెండో ఇన్నింగ్స్ ప్రారంభాన్ని విదర్భ బౌలర్ ఆదిత్య సారస్వతే దెబ్బతీశాడు. ఓపెనర్లు హార్విక్ దేశాయ్ (8), తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ వీరుడు స్నెల్ పటేల్(12)లను ఔట్ చేయడమేకాక, కీలక బ్యాట్స్‌మన్ చటేశ్వర్ పుజారాను డకౌట్ చేశాడు. అర్పిత్ వసవాదా (5) వికెట్‌ను ఉమేష్ యాదవ్ పడగొట్టగా, షెల్డన్ జాక్సన్(7)ను వాఖరే క్లీన్ బౌల్డ్ చేశాడు. వన్ డౌన్‌లో క్రీజులోకి వచ్చిన విశ్వరాజ్ జడేజా 23 పరుగులతో కమలేష్ మక్‌వానా 2 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నారు.

సంక్షిప్త స్కోర్లు: సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్ : 307 రెండో ఇన్నింగ్స్ 58/5 బ్యాటింగ్ ,విదర్భ తొలి ఇన్నింగ్స్: 312 రెండో ఇన్నింగ్స్: 200

సర్వీసెస్‌పై 2-1 గోల్స్‌తో తెలంగాణ గెలుపు

సంతోష్ ట్రోఫీ



నైవేలి: సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీలో తెలంగాణ జట్టు సర్వీసెస్ జట్టును ఖంగుతినిపించింది. బుధవారం జరిగిన సౌత్ జోన్ క్వాలిఫయర్ పోటీల్లో తెలంగాణ 2-1 గోల్స్ తేడాతో సర్వీసెస్‌ను ఓడించింది. తెలంగాణ గెలుపు డిఫెండింగ్ చాంపియన్ కేరళకు లైఫ్ ఇచ్చింది. కేరళ జట్టు పుదుచ్చేరితో ఆడిన మ్యాచ్ 0-0తో డ్రాగా ముగియడంతో నేటి మ్యాచ్ ఫలితం కేరళ మెయిన్ రౌండ్ ఆశలను సజీవంగా చేసింది. కేరళ మెయిన్ రౌండ్స్‌కు చేరాలంటే సర్వీసెస్ జట్టును ఓడించాల్సి ఉంటుంది. గ్రూప్ స్థాయిలో విజేత జట్లు మాత్రమే మెయిన్ రౌండ్లకు అర్హత సాధిస్తాయి. తెలంగాణ ఆటగాడు షువాన్ కాంప్‌బెల్ ఆట ఏడో నిమిషంలో గోల్ చేయగా, 45వ నిమిషంలో షఫీక్ మహ్మాద్ మరో గోల్ చేసి తెలంగాణకు 2-0 లీడ్‌ను అందించాడు. ఆట ముగిసే సమయం (89వ నిమిషం)లో సర్వీసెస్ ఆటగాడు హరిక్రిష్ణ ఒక గోల్ చేసి తెలంగాణ ఆధిక్యాన్ని 2-1కు తగ్గించాడు. శుక్రవారం తెలంగాణ జట్టు పుదుచ్చేరితో తలపడనుంది.

అమ్మాయిలకు తప్పని ఓటమి

- 23 పరుగుల తేడాతో కివీస్ జట్టు గెలుపు
- అర్ధ సెంచరీతో మెరిసిన మంధాన



వెల్లింగ్టన్: న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా ఆతిథ్య దేశంతో ఆడిన తొలి టీ20 మ్యాచ్‌లో హర్మన్‌సేన 23 పరుగుల తేడాతో ఓటమి పొందింది. 159 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ తడబడ్డది. భారత జట్టులో సీనియర్ క్రీడాకారిణి మిథాలీ రాజ్‌కు చోటు దక్కలేదు. అమె స్థానంలో ఓపెనర్‌గా జట్టులోకి వచ్చిన ప్రియా పూనియా, స్మృతి మంధానతో కలిసి ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. మంధాన మరోసారి బాధ్యాతయుతమైన ఇన్నింగ్స్ ఆడుతూ 58 పరుగులు (34బంతులు, ఫోర్లు-7, సిక్స్-3) చేయగా జెమీమా రోడ్రిగ్స్ 39(33బంతులు, ఫోర్లు-6) పరుగులు చేయగా భాగా ఆడుతుందనుకున్న కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ కేవలం 17(15బంతులు, సిక్స్1) పరుగులు చేసి పెవిలియన్ చేరింది. ఓపెనర్ ప్రియా పూనియా 4(5బంతులు ఫోర్1) పరుగులు చేసి ఔటయి నిరాశపర్చింది. మిగతా బ్యాట్స్‌వుమెన్‌లో ఎవరూ కూడా 6 పరుగుల మార్క్‌ను చేరుకోలేదు. భారత ఇన్నింగ్స్ 19.1 ఓవర్లలో 136 పరుగుల వద్ద ముగిసింది. కివీస్ బౌలర్లలో లీ తాహుహు 3/20, కాస్పెరెక్ 2/25, అమీలియా కెర్ 2/28 వికెట్లు పడగొట్టగా, సాట్టర్త్‌వైట్, రోస్‌మేరి మాయిర్, సోఫీ డివైన్ తలో వికెట్‌ను దక్కించుకున్నారు. అంతకుముందు టాస్ గెలిచిన భారత్ బౌలింగ్‌ను ఎంచుకుంది. న్యూజిలాండ్ బ్యాటింగ్ ప్రారంభించి నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. సోఫీ డివైన్ అత్యధికంగా 62పరుగులు(48బంతులు, ఫోర్లు 6 సిక్స్ 2) చేయగా కెప్టెన్ సాట్టర్త్‌వైట్ 33 పరుగులు(27బంతులు, ఫోర్లు-4), కాథె మార్టిన్ 27(14బంతులు, ఒక ఫోర్ సిక్స్-2) చేశారు. భారత బౌలర్లలో అరుంధతి రెడ్డి, రాధా యాదవ్, దీప్తి శర్మ, పూనం యాదవ్ తలో వికెట్‌ను దక్కించుకున్నారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లీ తాహుహుకు దక్కింది.

స్కోరు బోర్డు

న్యూజిలాండ్: సూజి బేట్స్ (సి) తానియా బాటియా (బి) రాధా యాదవ్ 7, సోఫీ డివైన్ (సి) దీప్తి శర్మ (బి) అరుంధతి రెడ్డి 62, కెయట్లిన్ గర్రే (బి) పూనం యాదవ్ 15, అమీ సాట్టర్త్‌వైట్ (సి) రోడ్రిగ్స్(బి) దీప్తి శర్మ 33, కాథె మార్టిన్ నాటౌట్ 27, ఫ్రాన్సెస్ మాక్కే నాటౌట్ 10 ఎక్స్‌ట్రాలు 5, మొత్తం 159/4 (20 ఓవర్లు)

బౌలింగ్: అరుంధతి రెడ్డి 4-0-38-1, రాధా యాదవ్ 4-0-38-1, దీప్తి శర్మ 4-0-19-1, అనుజా పాటిల్ 4-0-33-0, పూనం యాదవ్ 4-0-30-1.



భారత్: ప్రియా పూనియా (సి) కాస్పెరిక్ (బి) సాట్టర్త్‌వైట్ 4, స్మృతి మంధాన (సి) హన్నా రోవ్ (బి) అమీలియా కెర్ 58, జెమీమా రోడ్రిగ్స్(సి) కాథె మార్టిన్ (బి) తాహుహు 39, దయాలన్ హేమలత స్టంప్డ్ కాథె మార్టిన్ (బి) అమీలియా కెర్ 3, హర్మన్‌ప్రీత్‌కౌర్ స్టంప్డ్ కాథె మార్టిన్ (బి) అమీలియా కెర్ 17, అనుజ పాటిల్ (సి) అమీలియా కెర్ (బి) తాహుహు 0, అరుంధతి రెడ్డి ఎల్బీడబ్ల్యు (బి) రోస్‌మేరి మాయిర్ 2, దీప్తి శర్మ (సి) సాట్టర్త్‌వైట్ (బి) ఎస్ డివైన్ 5, తానియా బాటియా (సి అండ్ బి) కాస్పెరెక్ 1, రాధా యాదవ్ స్టంప్డ్ కాథె మార్టిన్ (బి) కాస్పెరిక్ 3, పూనం యాదవ్ నాటౌట్ 0 ఎక్స్ట్రాలు 4 మొత్తం: 136 ఆలౌట్ (19.1 ఓవర్లు)

బౌలింగ్: ఫ్రాన్సెస్ మాక్కే 0.3-0-4-0, అమీ సాట్టర్త్‌వైట్ 1.3-0-3-1, లీ తాహుహు 4-1-20-3, లెగ్ కాస్పెరెక్ 3-0-25-2, రోస్‌మేరీ మాయిర్ 3-0-31-1, సోఫీ డివైన్ 3.1-0-24-1, అమీలియా కెర్ 4-0-28-2.

ఎక్స్‌ట్రాలే టాప్ స్కోర్

- సౌత్ ఆస్ట్రేలియా 10 పరుగులకే ఆలౌట్
- బ్యాట్స్‌వుమెన్ చేసినవి 4 పరుగులే



సిడ్నీ: క్రికెట్లో అద్భుతాలు జరుగుతాయి. కాని ఇంత విచిత్రమైన అద్భుతం బహుశ ఇప్పటివరకు జరగలేదేమో. జట్టు స్కోరులో ఎక్స్‌ట్రాలే(అదనపు పరుగులు) టాప్ స్కోర్‌గా నిలిచాయి. బుధవారం జరిగిన ఓ టీ20 మ్యాచ్‌లో సౌత్ ఆస్ట్రేలియా మహిళల జట్టు 10 పరుగులకే ఆలౌటయింది. ఇందులో ఆరు పరుగులు ఎక్స్‌ట్రాలే కావడం గమనార్హం. అలైస్ స్ప్రింగ్స్‌లో జరుగుతున్న దేశీయ టోర్నీ నేషనల్ ఇండిజీనియస్ క్రికెట్ చాంపియన్‌షిప్‌లో భాగంగా సౌత్ ఆస్ట్రేలియా, న్యూ సౌత్ వేల్స్(ఎన్ఎస్‌డబ్ల్యు) జట్ల మధ్య జరిగిన టీ20మ్యాచ్‌లో ఈ విచిత్రం చోటుచేసుకుంది. సౌత్ ఆస్ట్రేలియా ఓపెనర్ ఫెబి మాన్సెల్ ఒక్కతే నాలుగు పరుగులు చేసింది. మిగతా 9 మంది బ్యాట్స్‌వుమెన్ డకౌట్లుగా ఔటయ్యారు. ఎన్ఎస్‌డబ్ల్యు బౌలర్ వాన్ వీన్ రెండు ఓవర్లలో ఒక పరుగు ఇచ్చి ఐదు వికెట్లు తీసి నమ్మశక్యంకాని రికార్డును నమోదు చేసింది. మరో బౌలర్ నవోమి వుడ్స్ తాను వేసిన రెండు బంతుల్లో రెండు వికెట్లు తీసింది. సౌత్ ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ కేవలం 62 బంతుల్లో ముగిసింది. ఎన్ఎస్‌డబ్ల్యు జట్టు ఈ లక్ష్యాన్ని 15బంతుల్లో ఛేదించింది.

ఇండోర్ కోర్టుల్లో సర్వీస్‌లే కీలకం

భారత ఫెడ్ కప్ కోచ్ అంకిత బాంబ్రి



అస్తానా(కజకిస్తాన్): ఫెడ్ (ఫెడరేషన్ కప్)లో భారత మహిళా జట్టు నేడు తన పోరును ప్రారంభించనుంది. ఇండోర్ కోర్టులో సాగుతున్న ఈ పోటీల్లో శక్తివంతమైన సర్వీసులే భారత్‌కు పాయింట్లు తెచ్చిపెడతాయని భారత్ ఫెడ్ కప్ కోచ్ అంకిత బాంబ్రి పేర్కొంది. బుధవారం బాంబ్రి, క్రీడాకారిణులు అంకిత రైనా, కర్మన్ తాండిలు మీడియాతో మాట్లాడారు. టోర్నీ బుధవారం ప్రారంభమైనప్పటికి... ఆసియా/ఓషియానా గ్రూప్ 1లో పోరులో భాగంగా భారత్, నేడు థాయ్‌లాండ్‌తో పోటీపడనుంది. అంకిత రైనా, కర్మన్ కౌర్ తాండిలు సింగిల్స్‌లో తమకన్నా అధిక ర్యాంకులున్నా థాయ్‌లాండ్ క్రీడాకారిణులతో పోటీపడనున్నారు. ఇటీవల పోటీల్లో రాణిస్తోన్న అంకిత జోరుమీదుండగా కర్మన్ తాండి కూడా కోల్పోయిన ఫామ్‌ను దొరకబుచ్చుకుని ముందుకు సాగుతోంది. థాయ్‌లాండ్ సింగిల్స్ ప్లేయర్ పీంగ్‌టార్న్ ప్లిప ర్యాచ్ (297 ర్యాంక్), పునిన్ కోవప్టికుటెడ్ (657 ర్యాంక్)లతో అంకిత, తాండిలు తలపడనున్నారు. భారత క్రీడాకారిణులు క్రమంగా పురోగతి సాధిస్తున్నారని కోచ్ బాంబ్రి చెపుతూ.. ఇండోర్ గేమ్స్‌లో బంతి వేగంగా దూసుకు పోతుంది. సర్వీస్‌లు బాగా చేయడం ఇక్కడ కీలకం. ప్రారంభంలో పాయింట్లు సాధిస్తే.. ముగింపు కూడా బాగా ఉంటుంది అని పేర్కొంది. నాలుగురోజుల నుంచి మా క్రీడాకారిణులు ఇక్కడ ప్రాక్టీస్ చేస్తున్నారు. మన క్రీడాకారిణులు ఫేవరేట్స్ లేదా అండర్ డాగ్స్‌లో బరిలోకి దిగనున్నారు అని కోచ్ బాంబ్రి తెలిపింది. భారత్ శుక్రవారం కజకిస్తాన్‌తో తలపడనుంది. కజకిస్తాన్ వరల్డ్ నెంబర్ 43, యూలియా పుతిన్‌టెసెవా, జరీనా దియాస్(96వ ర్యాంకు) క్రీడాకారిణులనుంచి భారత్‌కు గట్టి పోటీ ఎదురు కానుంది. పూల్ ఎ, పూల్ బిల్లో విజేతలుగా నిలిచిన నాలుగు జట్లు మళ్లీ పోటీపడతాయి. ఈ పోటీల్లో గెలిచిన జట్టు వరల్డ్ గ్రూప్ 2కు అర్హత సాధిస్తుంది. టాప్ 100లో ఉన్న క్రీడాకారిణులతో పోటీ పడటం కఠినమే.. అంకిత గత ఏడాది యూలియాతో మ్యాచ్‌ను ఆడింది. ఆ అనుభవం ఆమెకు ఉపయోగపడు తుందనుకుంటున్నాను అని కోచ్ తెలిపింది.

ర్యాంకులను పట్టించుకోను..ఆటపైనే నా దృష్టి: అంకిత రైనా



25 ఏళ్ల అంకిత రైనా తన కెరియర్ బెస్ట్ ర్యాంక్ 165లో ఉంది. గెలవాలన్న తపనతోనే కోర్టులో నా కదలికలు వ్యూహం ఉంటాయి. దేశం కోసం ఆడినప్పుడల్లా నా ఉత్తమ ఆటను ప్రదర్శించాను. ఈసారి కూడా అదే ఊపుతో ఆడతాను. నేను ర్యాంకులపై దృష్టి పెట్టడంలేదు. నా వ్యక్తిగత ఆటపైనే నా దృష్టి కేంద్రీకరిస్తున్నాను. ఎలా ఆడాలి.. వ్యూహాలు ఎలా అమలు చేయాలన్నదే నాకు ప్రధానం. అదే సమయంలో ప్రత్యర్థి క్రీడాకారిణుల ఆటను కూడా విశ్లేషించుకుంటున్నాను అని అంకిత రైనా పేర్కొంది. స్థానిక వాతావరణం, ఇండోర్ కోర్టులో ఉండే పరిస్థితులకు తగ్గట్లుగా నేను సిద్ధమయ్యాను. గతంలో నేను ఇక్కడ మూడుసార్లు ఆడాను. ఈ టోర్నీకి ముందు టాప్ 200, టాప్ 100లో ఉన్న క్రీడాకారిణులను ఓడించాను. అంతేకాక ఆటలో మెళుకువలను కూడా నేర్చుకున్నాను. భారత్‌కోసం మరిన్ని విజయాలను అందుకుంటానన్న విశ్వాసం ఉంది అని అంకిత రైనా తెలిపింది.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.